శుక్రవారం
6•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 161
• పేజీలు : 14 + 16

మన రాష్ట్రం • మన పత్రిక

# నమస్తే తెలంగాణ

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






2

## కేసీఆర్ కిట్లు, కంటివెలుగు
## పథకాలు భేష్

గవర్నర్ తమిళిసై ప్రశంస

వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష

## పెరల్ హార్బర్‌లో
## కాల్పులు

ఇద్దరు మృతి

ఘటనాస్థలంలోనే ఉన్న భారత వైమానికదళాధిపతి భదౌరియా.. భారత బృందమంతా సురక్షితం 5

# దుమ్ముగూడెం వద్ద బరాజ్



## 37 టీఎంసీల నీటినిల్వ, 320 మెగావాట్ల విద్యుదుత్పత్తికి వీలుగా నిర్మాణం

వచ్చే ఏడాదినుంచి మిడ్‌మానేరుకు 3 టీఎంసీల కాళేశ్వరం నీళ్లు • రెండు పనులకు 14 వేల కోట్లు అంచనా.. నెలాఖరులోగా టెండర్లు

### మల్లన్నసాగర్‌కు రెండో టీఎంసీ తరలింపు.. సీతారామ పెండింగ్ పనులకూ టెండర్లు

- వచ్చే మార్చి చివరికల్లా కంతనపల్లి పూర్తికావాలి
- ఆరేడు ఇరిగేషన్ జోన్లుగా రాష్ట్రం విభజన
- సాగునీటివ్యవస్థ నిర్వహణకు బడ్జెట్‌లో నిధులు
- త్వరలో రాష్ట్రస్థాయిలో ఇరిగేషన్ వర్క్‌షాప్
- నాగార్జునసాగర్ ఆయకట్టుకు కాళేశ్వరం నీళ్లు
- అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు
- ఇరిగేషన్ ప్రాజెక్టులు, సాగునీటి కల్పనపై సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం వద్ద జలవిద్యుత్ ఉత్పత్తికి, గోదావరి నీటి నిల్వకు ఉపయోగపడేలా బరాజ్ నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయానికి మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోయటానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రెండు పనులకు వెంటనే అంచనాలు రూపొందించి, నెలాఖరులోగా టెండర్లు పిలువాలని చెప్పారు. వీటికి సుమారు రూ.14వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనావేశారు. వీటితోపాటు మల్లన్నసాగర్‌కు రెండో టీఎంసీ తరలించే పనులకు, సీతారామ ప్రాజెక్టులో మిగిలిన పనులకు కూడా వెంటనే టెండర్లు పిలవాలని కోరారు. రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులు, సాగునీటి కల్పనపై ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంతనపల్లి బరాజ్ పనులను వచ్చే మార్చి చివరినాటికి పూర్తిచేయాలని ఆదేశించారు.

**దుమ్ముగూడెం వద్ద పుష్కలమైన నీటి లభ్యత**

దుమ్ముగూడెం వద్ద గోదావరిలో పుష్కలమైన నీటి లభ్యత ఉన్నది. ఏడాదిలో 150 రోజులపాటు నీటిప్రవాహం ఉంటుంది. జలవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉన్నది. ఈ సానుకూలతల నేపథ్యంలో 37 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా బరాజ్, 320 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిచేసేలా ప్లాంటు నిర్మించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. వీలైనంత తక్కువ భూసేకరణతో, నదిలోనే నీళ్లు ఆగేలా బరాజ్‌ను డిజైన్‌చేయాలని ఆదేశించారు. అంచనాలు రూపొందించి, నెలాఖరులోగా టెండర్లు పిలువాలని కోరారు.

**మిడ్‌మానేరుకు మూడు టీఎంసీలు**

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మిడ్‌మానేరు (శ్రీరాజరాజేశ్వర)కు ప్రస్తుతం రెండు టీఎంసీలు పంపుచేస్తున్నారు. వచ్చే ఏడాదినుంచి

మిగతా 2వ పేజీలో

# దశదిశలా ఆక్రందనలు!

- అగ్నిజ్వాలల్లో ఉన్నావ్ లైంగికదాడి బాధితురాలు
- కోర్టుకు వెళుతుండగా తగులబెట్టిన దుండగులు
- పశ్చిమబెంగాల్‌లోని మాల్దాలో మరో 'దిశ'
- లైంగికదాడి అనంతరం సజీవదహనం!
- హర్యానాలో తండ్రి కామానికి చిన్నారి బలి
- హిమాచల్‌లో బాలికపై బాలుడి అఘాయిత్యం
- యూపీలో కాళ్లుచేతులు కట్టేసి బాలికపై ఇద్దరి లైంగికదాడి



మహిళలపై కొనసాగుతున్న హింస, లైంగికదాడులకు నిరసనగా లక్నోలో గురువారం ప్రదర్శన దృశ్యం

**గజానికో గాంధారి కొడుకు..**

**ఆకాశంలో** సగం.. కన్నీరు పెడుతున్న వేళ.. దశ 'దిశ'లా ఆక్రందనలు! నిర్భయలోకంలో అంతేలేని ఆవేదనలు.. ఆగని అమానుషాలు! ఒకటి మరిచిపోకముందే మరిన్ని దుర్మార్గాలు! ఒకచోట చితులు ఆరకముందే మరోచోట బుగ్గయిపోతున్న బతుకులు! రాముడొచ్చినా నేరాలు ఆపలేడని చేతులెత్తేస్తున్న మంత్రుల సాక్షిగా.. నడిరోడ్డుపై తగలబడిపోతున్న దేహాల అసహాయ మృత్యుఘోషలు! వీటికి అంతెక్కడ అంటూ ప్రశ్నిస్తున్న మరణాలు.. ఘోరాలు! యూపీలోని ఉన్నావ్‌లో ఏడాదిక్రితం లైంగికదాడికి గురైన బాధితురాలు.. అదే కేసులో నిందితుల దాష్టీకానికి గురువారం నడిరోడ్డుపై అగ్నికీలల్లో దహించుకుపోయింది.. 90% ఒళ్లు కాలిపోయి చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నది! హైదరాబాద్‌లో దిశపై జరిగిన దుర్మార్గాన్ని తలపిస్తూ బెంగాల్‌లోని మాల్దాలో ఓ యువతి హత్యాచారానికి గురై.. గుర్తుపట్టలేనంతగా మసిబొగ్గయి కనిపించింది! హర్యానాలో తొమ్మిదేండ్ల బాలికపై తండ్రే కాలనాగై కాటేస్తే.. తాళలేని పసిహృదయం.. చికిత్స పొందుతూ బుధవారం అసువులుబాసింది! హిమాచల్‌ప్రదేశ్‌లోని కులు జిల్లాలో పదేండ్ల బాలికపై పద్నాలుగేండ్ల బాలుడు అఘాయిత్యం చేస్తే.. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్‌లో పదిహేనేండ్ల బాలిక జీవితాన్ని ఇద్దరు రాక్షసులు చిదిమేశారు! రాజస్థాన్‌లో ఓ హోటల్‌లో విందుకు హాజరైన యువతిని అక్కడ పనిచేసే యువకుడు చెరబట్టాడు! బెంగళూరులో తన మాజీ ప్రియురాలిని కొంతకాలంగా సతాయిస్తున్న యువకుడు.. ఆఖరుసారి మాట్లాడాలని పిలిచి లైంగికవేధింపులకు గురిచేస్తే.. పశ్చిమబెంగాల్‌లో మదమెక్కిన ఓ టాక్సీవాలా తన కారులో ఎక్కిన ప్రయాణికురాలిపై లైంగికదాడి ఉద్దేశంతో కిడ్నాప్ చేయబోయాడు! పోలీసులు సకాలంలో స్పందించడంతో ఆ అమ్మాయి సురక్షితంగా ఇల్లుచేరింది! 5

## కస్టడీలోకి దిశ నిందితులు! 3

ధ్రువీకరించని పోలీసు అధికారులు.. దర్యాప్తులో అంతా గోప్యం



గురువారం బుద్ధభవన్‌లో హైదరాబాద్ రోడ్లు, ట్రాఫిక్ అంశాలపై సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మేయర్ బొంతు రామ్మోహన్, మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి కూడా ఉన్నారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో**

# హైదరాబాద్ రోడ్ల అభివృద్ధి

సౌకర్యవంత ప్రయాణమే లక్ష్యం • మహిళల రక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

వైన్‌షాపులవద్ద మద్యం తాగేవారిపై చర్యలు • కొత్తగా నార్త్-సౌత్ మొబిలిటీ కారిడార్ • నగరానికి నాణ్యమైన మంచినీటి సరఫరా

జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో సమీక్షలో మంత్రి కే తారకరామారావు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

వాహనదారులు, పాదచారులు సౌకర్యవంతంగా ప్రయాణం సాగించడమే లక్ష్యంగా హైదరాబాద్ నగర రోడ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నట్టు పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. నగరంలో ట్రాఫిక్ వ్యవస్థను శాస్త్రీయ పద్ధతుల్లో క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గురువారం బుద్ధభవన్‌లో జీహెచ్‌ఎంసీ, పోలీసు, వాటర్‌బోర్డు, టీఎస్‌ఐఐసీ, విద్యుత్ తదితర విభాగాల ఉన్నతాధికారులతో మంత్రి కేటీఆర్ పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర రోడ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడంలో భాగంగా సమగ్ర రోడ్ల నిర్వహణ ప్రాజెక్టు (సీఆర్‌ఎంపీ) కింద 709 కిలోమీటర్ల మేర ప్రధాన రోడ్ల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తున్నామని తెలిపారు. ఈ నెల తొమ్మిదో తేదీనుంచి వారి ఆధ్వర్యంలో పనులు

మిగతా 2వ పేజీలో

## చట్టాల్ని మార్చాల్సిందే

దిశ ఘటనలో నాకూ భావోద్వేగాలున్నాయి

ఆ నలుగురినీ తుదముట్టించాలని నాకూ ఉన్నది 2

కానీ.. చట్టపరంగానే వారికి శిక్ష పడుతుంది

సివిల్ సర్వీసెస్ అధికారుల శిక్షణ ముగింపు సమావేశంలో మంత్రి కేటీఆర్






దేవికారాణి భర్త గురుమూర్తి

## దేవికారాణి ఆస్తులు
## రూ.100 కోట్లు

హైదరాబాద్, తిరుపతి, చిత్తూరుల్లో విస్తరించిన ఆస్తులు

దేవిక, ఆమె భర్త గురుమూర్తిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

గురుమూర్తి అరెస్ట్.. చంచల్‌గూడ జైలుకు తరలింపు

అక్రమ ఆస్తుల వివరాలు సేకరించిన ఏసీబీ 3



**ఆర్బీఐ ద్రవ్య పరపతి సమీక్ష**

## వడ్డీరేట్లు యథాతథం

ద్రవ్యోల్బణం ఒత్తిడితో వరుస తగ్గింపునకు బ్రేక్ 9

ఉల్లి సెగతో అంచనాలు తలకిందులు

ఆర్థిక మందగమనంపై ఆందోళన

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 83.00 | రిటైల్ లైవ్ | 105.00 |
| డ్రెస్డ్ | 152.00 | స్కిన్‌లెస్ | 173.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 444.00 | రంగారెడ్డి | 444.00 |
| మెదక్ | 444.00 | కరీంనగర్ | 447.00 |
| వరంగల్ | 447.00 | డజన్ ధర | 66.00 |



## మాజీ ఎంపీ కవితకు ప్రపంచ ఆర్థిక సదస్సు ఆహ్వానం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వచ్చే నెల 21న దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనాలని మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితకు గురువారం ఆహ్వానం అందింది. సదస్సులో భాగంగా కవిత.. ఎడ్యుకేషన్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్అ నేఅ ంశంపైప్రసం గించనున్నారు.



గురువారం ప్రగతిభవన్‌లో 'కాళేశ్వరం ప్రాజెక్టు- తెలంగాణ ప్రగతిరథం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, పుస్తక రచయిత, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, కవి, రచయిత జూలూరు గౌరీశంకర్, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

## మూడేండ్లలోనే కాళేశ్వరం నీళ్లందించాం

'కాళేశ్వరం ప్రాజెక్టు- తెలంగాణ ప్రగతిరథం' పుస్తకావిష్కరణ సందర్భంగా సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మూడేండ్ల రికార్డు సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిచేసి రైతాంగానికి నీటిని సరఫరా చేస్తున్నామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. కాళేశ్వర ప్రాజెక్టు నిర్మాణ ఘట్టాలన్నింటినీ ఒకచోట చేర్చి చరిత్రకు అందించడం హర్షణీయమని అన్నారు. ముఖ్యమంత్రి ఓఎస్డీ (నీటిపారుదలశాఖ) శ్రీధర్‌రావు దేశ్‌పాండే రాసిన 'కాళేశ్వరం ప్రాజెక్టు- తెలంగాణ ప్రగతిరథం' పుస్తకాన్ని సీఎం కేసీఆర్ గురువారం ప్రగతిభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర సమాచారాన్ని, చరిత్రను అందించాలన్న సంకల్పంతో సమగ్ర గ్రంథాన్ని రచించిన శ్రీధర్‌రావుదేశ్‌పాండేను అభినందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన నుంచి దానిని పూర్తిచేసేవరకు సీఎం కేసీఆర్ చేసిన కృషిని ఈ గ్రంథంలో రచయిత నిక్షిప్తం చేశారు. కార్యక్రమంలో కవి, రచయిత జూలూరు గౌరీశంకర్, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో సీఎం గజ్వేల్ పర్యటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌ను త్వరలో సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లు.. చేపట్టాల్సిన కార్యక్రమాలపై సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామిరెడ్డి.. గురువారం రాత్రి గజ్వేల్ పట్టణంలో పర్యటించి అధికారులకు దిశానిర్దేశంచేశారు.





గురువారం రాజ్‌భవన్ దర్బార్‌హాల్‌లో వైద్యశాఖ అధికారులతో సమావేశమైన గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్



గురువారం ప్రగతిభవన్‌లో రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులు, సాగునీటి కల్పనపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జెన్‌కో, ట్రాన్స్‌కో చైర్మన్ డీ ప్రభాకర్‌రావు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

## 'కేసీఆర్ కిట్' అద్భుతం

- కంటివెలుగు పథకం భేష్
- గవర్నర్ తమిళిసై ప్రశంస
- వైద్యారోగ్యశాఖ పనితీరుపై ఉన్నతాధికారులతో సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కేసీఆర్ కిట్లు, కంటివెలుగు, ఆరోగ్యశ్రీ వంటి పథకాల వల్ల పేదలకు ఎంతో ప్రయోజనం కలుగుతున్నదని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ప్రశంసించారు. గురువారం రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యక్రమాలు, వాటి అమలుపై ఉన్నతాధికారులతో గవర్నర్ సమీక్షాసమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వ దవాఖానల ద్వారా పేద ప్రజలకు వైద్యసేవలు అందుతున్న విధానాన్ని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి గవర్నర్‌కు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న ప్రధాన ఆరోగ్య కార్యక్రమాలు, కేసీఆర్ కిట్ల పథకం, కంటివెలుగు, ఆరోగ్యశ్రీ వంటివాటి అమలు విధానాన్ని తెలిపారు. ఆయా వైద్య విభాగాల్లో కీలకమైన ఆరోగ్య సూచికలు, దవాఖానల ప్రాథమిక గణాంకాలు, ఆరోగ్య సౌకర్యాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, కేసీఆర్ కిట్, కంటివెలుగు తదితర పథకాల వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలు బాగున్నాయని కొనియాడారు. ఇటీవల న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్లో జరిగిన గవర్నర్ల సమావేశంలో తెలంగాణలో అమలుచేస్తున్న ఈ పథకాలపై తాను చర్చించినట్టు పేర్కొన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలను వినియోగించుకోవడం ద్వారా రాష్ట్రంలోని పేదలకు పూర్తిస్థాయిలో లబ్ధిచేకూర్చాలని ఇటీవల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో సమావేశమైనప్పుడు వ్యక్తిగతంగా చర్చించినట్టు తెలిపారు. ఆ సందర్భంగా రాష్ట్రంలో ఆరోగ్యకార్యక్రమాల అమలుపై చర్చించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను పంపుతానని పేర్కొన్న సీఎం కేసీఆర్ తక్షణం స్పందించినందుకు గవర్నర్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని బ్లడ్ బ్యాంకుల్లో రక్త లభ్యతను ప్రస్తావించిన ఆమె విస్తరిస్తున్న వ్యాధులు, రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రక్త నిధులను సిద్ధంగా ఉంచాలని కోరారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్యసేవలు అందాలన్నదే తన అభిమతమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేషనల్ హెల్త్ అథారిటీ సీఈవో ప్రవీణ్ గోయి మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ పథకం, దాని ప్రయోజనాలను అధికారులకు వివరించారు. ఆరోగ్యశ్రీతోపాటు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా తెలంగాణ ప్రజలకు ప్రయోజనం కలిగే దిశగా దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఏ శాంతికుమారి, జాతీయ ఆరోగ్య అథారిటీ సీఈవో ప్రవీణ్, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ యోగితారాణా, ఆరోగ్యశ్రీ సీఈవో మాణిక్‌రాజ్, ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, ఐపీఎం డైరెక్టర్ శంకర్, ఆయుష్ అదనపు డైరెక్టర్ లింగరాజు, కేఎన్ఆర్యూహెచ్ఎస్ వీసీ కరుణాకర్‌రెడ్డి, ఎంఎన్‌జే డైరెక్టర్ జయలత, నిమ్స్ డైరెక్టర్ మనోహర్, గవర్నర్ కార్యదర్శి సురేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దుమ్ముగూడెం వద్ద బరాజ్


మొదటిపేజీ తరువాయి...


రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోయాలని సీఎం నిర్ణయించారు. మిడ్‌మానేరుకు మూడు టీఎంసీలు లిఫ్టు చేసి, అక్కడినుంచి మల్లన్నసాగర్‌కు రెండు టీఎంసీలను ఎత్తిపోయాలని నిర్ణయించారు. ఈ రెండు పనులకు కూడా నెలాఖరులోగా టెండర్లు పిలవాలని అధికారులను సీఎం ఆదేశించారు. దుమ్ముగూడెం బరాజ్ నిర్మాణం, మిడ్‌మానేరుకు మూడు టీఎంసీల నీటిని లిఫ్టుచేసే పనులకు మొత్తం రూ.13,500 నుంచి రూ.14,000 కోట్లు ఖర్చవుతుందని అంచనావేశారు. తదుపరి మంత్రివర్గ సమావేశంలో ఈ రెండు పనులకు సంబంధించి ఆమోదం తీసుకోవాలని సీఎం నిర్ణయించారు.

### నీటిపారుదలశాఖ అంతా ఒకటే విభాగం

మేజర్, మీడియం, మైనర్ అనే తేడాలేకుండా రాష్ట్రంలో నీటిపారుదలశాఖ అంతా ఒకటే విభాగంగా పనిచేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. రాష్ట్రాన్ని ఆరు లేదా ఏడు ఇరిగేషన్ జోన్లుగా విభజించుకోవాలని, ఒక్కో జోన్‌కు ఒక్కో ఈఎన్సీ ఇంచార్జిగా వ్యవహరించి, తన పరిధిలో నీటిపారుదల వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించాలని కోరారు. నీటిపారుదలశాఖ ముఖ్య అధికారులంతా రాబోయే కొద్దిరోజుల్లోనే రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించుకుని, తెలంగాణ సమగ్ర నీటిపారుదల విధానాన్ని ఖరారుచేయాలని చెప్పారు. ఈ వర్క్‌షాపులోనే రాష్ట్రంలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాల్వలు, లిఫ్టులు, చెరువులకు సంబంధించిన అన్ని వివరాలతో సమగ్రజాబితా తయారుచేయాలని కోరారు. అన్ని ప్రాజెక్టులు, పంపుహౌస్‌లు, లిఫ్టులు, కాల్వలు, చెరువుల నిర్వహణకు అవసరమైన వ్యూహాన్ని, మాన్యువల్స్‌ను అదే వర్క్‌షాపులో ఖరారుచేయాలని చెప్పారు. సాగునీటి వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన నిధులను బడ్జెట్లోనే కేటాయించనున్నట్టు సీఎం వెల్లడించారు.

### విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేయండి

దుమ్ముగూడెం వద్ద జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్మించడానికి, కాళేశ్వరం నుంచి మూడు టీఎంసీలు ఎత్తిపోయడానికి అనుగుణంగా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లుచేయాలని విద్యుత్‌శాఖ అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. అన్ని ప్రాజెక్టుల వద్ద అదనంగా ఇంపెల్లర్స్, పంపుసెట్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఉంచాలని కోరారు. నీటిపారుదల విధానం, ఇన్వెంటరీ, నిర్వహణ వ్యూహం ఖరారైన తర్వాత, రాష్ట్రస్థాయి నీటిపారుదల సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు.

## సాగర్ ఆయకట్టుకు గోదావరి నీళ్లు

**కృష్ణానదిలో** నీటిప్రవాహం లేనిసమయంలో నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీరందించే ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. మిడ్‌మానేరుకు మూడు టీఎంసీల నీళ్లు వస్తాయి కాబట్టి.. పుష్కలమైన నీరు అందుబాటులో ఉంటుంది. కాళేశ్వరం ద్వారా వచ్చే నీటితో బస్వాపూర్ రిజర్వాయర్ నింపి, అక్కడి నుంచి షామీర్‌పేట వాగు, మూసీ నది, ఆసిఫ్ నహర్‌కు నీటిని తరలించాలని, ఉదయ సముద్రాన్ని బైపాస్‌చేసి పానగల్ వాగులో కలుపాలని నిర్ణయించారు. అక్కడి నుంచి నేరుగా నాగార్జునసాగర్ ఆన్‌లైన్ రిజర్వాయర్ అయిన పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌కు నీటిని చేర్చాలని సీఎం చెప్పారు. కృష్ణానదిలో నీటిప్రవాహం లేని సమయంలో ఈ విధంగా గోదావరి నీటిని నాగార్జునసాగర్ ఆయకట్టుకు అందించాలన్నారు. ఈ పనులపై సంపూర్ణ అవగాహన వచ్చేందుకు నీటిపారుదలశాఖ అధికారులు, రిటైర్డ్ ఇంజినీర్లు త్వరలోనే ఈ ప్రాంతాల్లో పరిశీలించాలని కోరారు. గోదావరి బేసిన్‌లో మల్లన్నసాగర్ వద్ద, కృష్ణాబేసిన్‌లో పాలమూరు ఎత్తిపోతల పథకం వద్ద నీటిపారుదలశాఖ అధికారులు సమావేశాలు నిర్వహించుకోవడానికి అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, జెన్‌కో, ట్రాన్స్‌కో చైర్మన్ డీ ప్రభాకర్‌రావు, సీఎం ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, ముఖ్యకార్యదర్శి స్మితా సబర్వాల్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఈఎన్సీలు మురళీధర్‌రావు, హరిరాం, వెంకటేశ్వర్లు, బీ నాగేంద్రరావు, సీఈలు, ఎస్ఈలు, జెన్‌కో డైరెక్టర్ వెంకట్రాజం, ట్రాన్స్‌కో డైరెక్టర్లు సూర్యప్రకాశ్, నర్సింగ్‌రావు, నీటిపారుదలశాఖ సలహాదారు పెంటారెడ్డి, రిటైర్డ్ ఇంజినీర్లు శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రమౌళి, వెంకట్రామారావు, ఇంద్రసేనారెడ్డి, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావుదేశ్‌పాండే పాల్గొన్నారు.



## ఉల్లి @ రూ.190

ఆల్‌టైం రికార్డు ధర

**మలక్‌పేట:** ఉల్లిగడ్డ ధరలు ఆకాశాన్నంటాయి. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డుస్థాయిలో ధరలు పెరిగాయి. గురువారం హైదరాబాద్‌లోని మలక్‌పేట మార్కెట్‌లో హోల్‌సేల్‌గానే ఉల్లిగడ్డ కిలోకు రూ.150 ధర పలికింది. రిటైల్ మార్కెట్‌లో రూ.180- 190 అమ్ముతున్నారు. గతేడాది ఉల్లిగడ్డకు కనీస మద్దతు ధరలు లభించకపోవటంతో ఈసారి మహారాష్ట్ర, కర్ణాటకతోపాటు తెలుగు రాష్ట్రాల్లో రైతులు సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా తగ్గించడం, సాగుచేసిన కొద్దిపాటి విస్తీర్ణంలో వర్షాలకు పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గిపోవడంతో ధరలకు రెక్కలొచ్చాయి. మామూలు రోజుల్లో మలక్‌పేట మార్కెట్‌కు నిత్యం 30 వేల నుంచి 40 వేల బస్తాలు, సీజన్‌లో 50 వేల నుంచి 60 వేల బస్తాల ఉల్లిగడ్డ దిగుమతి అయ్యేది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మార్కెట్‌కు ఈ నెల 3న 4,761 బస్తాలు, 4న 4,014 బస్తాలు, 5న 3,150 బస్తాల ఉల్లిగడ్డ మాత్రమే దిగుమతి అయింది. మేలురకం ఉల్లిగడ్డ క్వింటాల్ రూ.11,000 నుంచి రూ.15,000 ధర పలుకగా, మధ్యరకం రూ.7 వేల నుంచి రూ10 వేలు, నాసిరకం రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ధర పలికింది.

# చట్టాల్ని మార్చాల్సిందే

దిశ ఘటనలో నాకూ భావోద్వేగాలున్నాయి ■ కానీ.. చట్టపరంగానే వారికి శిక్ష పడుతుంది

- ఏడేండ్లయినా నిర్భయ నిందితులను ఉరితీయలేదు
- కసబ్‌ను ఉరితీయడానికి ఎన్నేండ్లు పట్టిందో చూశాం
- చట్టాలు తగిన విధంగా లేకపోవడమే ఇందుకు కారణం
- సివిల్ సర్వీసెస్ అధికారుల శిక్షణ ముగింపు సమావేశంలో మంత్రి కేటీఆర్



సివిల్ సర్వీసెస్ అధికారుల శిక్షణ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో సీనియర్ అధికారులు ఏపీవీఎన్ శర్మ, బీపీ ఆచార్య, హర్‌ప్రీత్‌సింగ్ ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దిశ ఘటనలో అందరిలాగే తనకూ భావోద్వేగాలున్నాయని, కానీ చట్టపరంగానే దోషులకు శిక్ష పడుతుందని పురపాలక, ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రజలు సంయమనంతో వాస్తవ పరిస్థితులను అర్థంచేసుకోవాలని కోరారు. ఎంసీఆర్‌హెచ్చార్డీలో సివిల్ సర్వీసెస్ 94 ఫౌండేషన్ అధికారుల శిక్షణ ముగింపు సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోర్సును పూర్తిచేసుకున్న అధికారులకు ధ్రువపత్రాలు అందజేశారు. దిశ కేసులో దోషులకు త్వరగా శిక్షపడేలా చూస్తామని మంత్రి స్పష్టంచేశారు. దిశ ఘటన చాలా దారుణమైనదని, ఈ ఘటన పట్ల దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయని అన్నారు. 'నిందితులపై తక్షణం చర్యలు తీసుకోవాలని చాలామంది డిమాండ్ చేశారు. వారిని ఉరితీయాలని ఎంపీలు పార్లమెంటు వేదికగా నినదించారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు ఆ ఆవేశం, ఆవేదన ఉంటాయి. నాకూ అదే ఉన్నది. ఢిల్లీలో 2012లో సామూహిక లైంగికదాడికి గురైన నిర్భయ కేసులో ఇప్పటికీ నిందితులను ఉరితీయలేదు. ఒక బాల నేరస్థుడిని విడుదలచేశారు. దేశంలోనే అతిపెద్ద ఉగ్రవాద చర్యకు పాల్పడిన అజ్మల్‌కసబ్ ఉరికి ఎంత సమయం పట్టిందో అందరికీ తెలుసు. మీరంతా వెంటనే చర్యలు తీసుకోవాలని అనుకోవచ్చు.. కానీ ప్రస్తుత చట్టాలు అందుకు తగినట్టులేవు. వాటిని మార్చాలి' అని కేటీఆర్ అన్నారు. దిశ ఘటనలో నలుగురు నిందితులను తుదముట్టించాలని తనకూ ఉన్నదని, కానీ ప్రభుత్వంలో ఉన్నాం కాబట్టి.. ప్రజలు కోరినట్టు వారిని ఉరితీయలేమన్నారు. అధికారులుగా మీరంతా వాస్తవాలు గ్రహించి, రాజ్యాంగబద్ధంగా నిబంధనలను అనుసరించాల్సి ఉంటుందని చెప్పారు.

### ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలి

సివిల్ సర్వీసెస్ అధికారులు ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి కేటీఆర్ కోరారు. సమస్యలపట్ల వేగంగా స్పందించే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. రాజకీయాల్లోకి రాకముందు తానొక ప్రైవేట్ ఉద్యోగినని, తెలంగాణలో అప్పటి పరిస్థితులు, త్యాగాలు తనను రాజకీయాల్లోకి తీసుకువచ్చాయని చెప్పారు. డెబ్బై ఏండ్ల స్వతంత్ర దేశంలో ఇప్పటికీ వేల గ్రామాల్లో తాగునీరు, కరంట్, రోడ్ల సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికీ చాలా ఇండ్లకు మరుగుదొడ్లు లేవన్నారు. యువ సివిల్ సర్వీసెస్ అధికారులు ఈ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. దేశంలో పేదవర్గాలకు విద్య, వైద్యం ఇంకా అందటం లేదని, ఈ వర్గాల్లో సాధికారత కల్పించి, అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. మనది అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమని, మన సివిల్ సర్వీసెస్ అధికారులు ప్రజాసమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు. సర్వీసులో చేరిన ఆరేడేండ్లకే మైండ్‌సెట్ మారుతున్న అధికారులున్నారంటూ.. ఎన్నేండ్లయినా పాజిటివ్‌గా ఉన్న అధికారులను తన అనుభవంలో కొంతమందినే చూశానని తెలిపారు. సర్వీసులో చేరాక అధికారిక కార్యక్రమాలకే పరిమితంకాకుండా.. ఆ ప్రాంతానికి పెట్టుబడులు వచ్చేలా, కంపెనీలు స్థాపించేలా, ఉపాధి కల్పించేలా పనిచేయాలని కోరారు. అధికారులు ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఉండాలని, ఎప్పటికప్పుడు సెల్ఫ్ మోటివేషన్‌తో పనిచేయాలని సూచించారు. కార్యక్రమం లో గవర్నర్ సలహాదారు ఏపీవీఎన్ శర్మ, ఎంసీఆర్‌హెచ్చార్డీ డైరెక్టర్ జనరల్, బీపీ ఆచార్య, అడిషనల్ డైరెక్టర్ జనరల్ హర్‌ప్రీత్‌సింగ్ పాల్గొన్నారు.

## హైదరాబాద్ రోడ్ల అభివృద్ధి


మొదటిపేజీ తరువాయి...


ప్రారంభమవుతాయన్నారు. ఐదేండ్లపాటు రోడ్ల నిర్వహణ బాధ్యత వారిపైనే ఉంటుందని, పైప్‌లైన్లు, కేబుళ్లు, డ్రైనేజి తవ్వకాలు, మరమ్మతులేకాకుండా పునరుద్ధరణ పనులు కూడా సంబంధిత ఏజెన్సీ ద్వారానే చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఏజెన్సీలు చేపట్టే పనులకు ప్రభుత్వంతోపాటు జీహెచ్ఎంసీ, పోలీసు యంత్రాంగం పూర్తిగా సహకరిస్తాయని భరోసా ఇచ్చారు. కమర్షియల్ ఏరియాల్లోని సెట్‌బ్యాక్ స్థలాలను కూడా ఫుట్‌వేలకు వినియోగించనున్నట్టు మంత్రి తెలిపారు.

### మహిళల భద్రతకు ప్రత్యేక దృష్టి

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. టోల్‌ఫ్రీ నం-100కు విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. వైన్‌షాపుల చుట్టపక్కల మద్యం తాగే వారిపై చర్యలు తీసుకోవాలని, సదరు వైన్‌షాపులను మూసివేయాలని ఆదేశించారు. పార్కులు, ఖాళీజాగాలు అసాంఘికశక్తులకు అడ్డాలుగా మారకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జూబ్లీ బస్‌స్టేషన్ (జేబీఎస్) నుంచి ఫలక్‌నుమా వరకు లోయర్ ట్యాంక్‌బండ్, అబిడ్స్, అఫ్జల్‌గంజ్, చార్మినార్ తదితర పర్యాటక ప్రాంతాలను కలుపుకొంటూ నార్త్-సౌత్ మొబిలిటీ కారిడార్ పేరుతో సరికొత్త కారిడార్ అభివృద్ధికి సన్నాహాలు చేస్తున్నట్టు మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ కారిడార్‌ను ఫ్రెంచ్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ఈ మార్గంలోని రోడ్లు, ట్రాఫిక్ పరిస్థితి, ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు తదితర అంశాలను అధ్యయనం ద్వారా గుర్తించనున్నట్టు తెలిపారు. పర్యాటక ప్రాంతాల అనుసంధానం వల్ల ఆయా స్థలాలకు పర్యాటకులు మరింత సులభంగా చేరుకునే వీలు కలుగుతుందన్నారు. 2020 ఫిబ్రవరిలో సమగ్ర అధ్యయన నివేదిక సిద్ధమవుతుందని, దానిని ప్రభుత్వం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.



బుద్ధభవన్‌లో జీహెచ్ఎంసీ, పోలీసు, వాటర్‌బోర్డు, విద్యుత్ తదితర విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

### నగరానికి నాణ్యమైన మంచినీటి సరఫరా

దేశంలో ఏ మహానగరంలో లేనివిధంగా హైదరాబాద్‌లో నాణ్యమైన మంచినీటిని సరఫరా చేస్తున్నట్టు మంత్రి కేటీఆర్ చెప్పారు. నీటిలభ్యత విషయంలో ఇతర నగరాలతో పోల్చుకుంటే సుదూరంలో ఉన్న కృష్ణా, గోదావరి నదులతోపాటు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ల నుంచి నీటిని తీసుకువచ్చి శుద్ధిచేస్తూ.. ఔటర్ రింగురోడ్డు గ్రామాల వరకు రాజీపడకుండా రక్షితనీటిని అందిస్తున్నామని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న కొండపోచమ్మ, కేశవాపూర్ రిజర్వాయర్లు పూర్తయితే నగరానికి ఇక మంచినీటికి ఢోకా ఉండబోదని కేటీఆర్ స్పష్టంచేశారు. నగరంలోని ఏ ప్రాంతానికైనా మంచినీటి సరఫరాకు నిర్మించిన రింగ్‌మెయిన్‌తోపాటు రూ.280 కోట్లతో మరో రింగ్‌మెయిన్ నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఏ కాలమైనా నీటికొరత లేని మహానగరంగా హైదరాబాద్ రూపొందుతుందని అభిప్రాయపడ్డారు. ఓఆర్ఆర్ వరకు సీవరేజ్ వ్యవస్థను జీహెచ్ఎంసీ నుంచి జలమండలికి అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. మూడు నెలలు జలమండలి, జీహెచ్ఎంసీ సిబ్బంది సంయుక్తంగా సీవరేజ్ నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. జలమండలి ఆదాయం పెంచుకుని ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు నూతన సంస్కరణలను తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో మేయర్ బొంతు రామ్మోహన్, మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం సత్యనారాయణ, డైరెక్టర్లు ఎల్లాస్వామి, డీ శ్రీధర్‌బాబు, అజ్మీర కృష్ణ, పీ రవి, వాసుదేవనాయుడు, వీఎల్ ప్రవీణ్‌కుమార్‌లతోపాటు సీజీఎంలు పాల్గొన్నారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.36 గంటలకు

సూర్యాస్తమయం: 5.33 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం దశమి శుక్రవారం ఉదయం 6.35 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఉత్తరాభాద్ర రాత్రి 10.57 వరకు, తదుపరి రేవతి, అమృతఘడియలు: సాయంత్రం 5.36 నుంచి 7.23 వరకు, రాహుకాలం: ఉదయం 10.42 నుంచి మధ్యాహ్నం 12.04 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.47 నుంచి 9.31 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.26 నుంచి 1.09 వరకు, వర్జ్యం: ఉదయం 9.33 నుంచి 11.20 వరకు.

### లోకం పోకడ





# మహిళా సంక్షేమానికి సహకరించండి

- కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి మంత్రి సత్యవతి రాథోడ్ విజ్ఞప్తి
- డోర్నకల్ జంక్షన్‌ను అభివృద్ధిచేయాలి
- కేంద్రరైల్వే మంత్రి పీయూష్‌కు వినతిపత్రం





రైల్వే మంత్రి పీయూష్‌గోయల్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీలు కవిత, బండా ప్రకాశ్, బడుగుల లింగయ్య, కేంద్రమంత్రి స్మృతి ఇరానీని సన్మానిస్తున్న దృశ్యం.

**హైదరాబాద్/మహబూబాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం సహకరించాలంటూ ఢిల్లీలో కేంద్ర మంత్రులు స్మృతి ఇరానీ, పీయూష్‌గోయల్‌ను రాష్ట్ర స్త్రీ శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. గురువారం ఢిల్లీ వెళ్లిన ఆమె, కేంద్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి స్మృతిఇరానీని కలిసి మహిళా సంక్షేమానికి సహకరించాలని విజ్ఞప్తిచేశారు. 11 నుంచి 14 ఏండ్లలోపు బాలికలకు పోషకాహారం అందిస్తున్న కేంద్రం, 18 ఏండ్ల వరకు వర్తించేలా వెసులుబాటు కల్పించాలన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల పరిధిలో తొలిదశలో 15 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఇవ్వాలని కోరగా.. ఐదు మంజూరయ్యాయని, మిగిలినవి కూడా కేటాయించాలని కోరారు. మహిళల సమస్యలకు పరిష్కారం చూపే సఖి కేంద్రాలు 31 జిల్లాల్లో ఉన్నాయని, కొత్తగా ఏర్పడిన రెండు జిల్లాల్లో, అధిక జనాభా ఉన్న హైదరాబాద్‌లో మరో రెండు కేంద్రాలను ఏర్పాటుచేయాలని కోరారు. భేటీబచావో.. భేటీ పడావో తెలంగాణలోని ఎనిమిది జిల్లాల్లోనే కేంద్రం అమలుచేస్తున్నదని, మిగిలిన 25 జిల్లాలకు విస్తరించాలని విజ్ఞప్తిచేశారు. జువైనల్ చట్టం కింద శిశుసంరక్షణ కోసం రెండు చిల్డ్రన్స్‌హోమ్స్ మంజూరుచేయాలని కోరారు. శిశువుల సమగ్ర వికాసం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఒంటరి మహిళలకు పెన్షన్లు, కేసీఆర్ కిట్లు, ఆరోగ్యలక్ష్మి, మహిళల పేరిట రిజిస్ట్రేషన్లు, రేషన్‌కార్డులు వంటి పథకాలను అమలుచేస్తున్నామని వివరించారు.

### డోర్నకల్ నుంచే క్రూ లాబీ నిర్వహించాలి

మహబూబాబాద్ జిల్లాలో ప్రసిద్ధ రైల్వే జంక్షన్‌గా విలసిల్లిన డోర్నకల్‌ను అభివృద్ధి చేయాలని కేంద్ర రైల్వే మంత్రి పీయూష్‌గోయల్‌ను మంత్రి సత్యవతి కోరారు. డోర్నకల్ జంక్షన్‌లో క్రూ లాబీ ఉన్నప్పటికీ, విజయవాడ నుంచి బీట్ మార్పులు చేస్తున్నారని, దీనివల్ల సంస్థకు భారంతోపాటు ఉద్యోగులకు పనిగంటలు ఎక్కువై అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. సంస్థకు, ఉద్యోగులకు మేలు జరుగాలంటే క్రూ లాబీని డోర్నకల్ నుంచి నిర్వహించాలని, రన్నింగ్ స్టాఫ్ కోసం క్వార్టర్లు నిర్మించాలని విజ్ఞప్తిచేశారు. మంత్రి వెంట ఎంపీలు మాలోత్ కవిత, బండా ప్రకాశ్, బడుగుల లింగయ్య, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి జగదీశ్వర్, తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు ఉన్నారు.



గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దంపతులను కలిసి తమ కూతురు వివాహానికి ఆహ్వానిస్తున్న సీఎస్ ఎస్కే జోషి దంపతులు

## పీఈటీ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్- ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఫలితాలను టీఎస్‌పీఎస్సీ విడుదలచేసింది. గుర్తించిన 370 పోస్టులకుగాను 364 పోస్టులను భర్తీచేయగా, వివిధ క్యాటగిరీల్లో ఉన్న ఆరు పోస్టులకు అర్హతగల అభ్యర్థులు లభించని కారణంగా ఎంపికచేయలేదని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన ఎంపిక జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇంటర్ పరీక్షల దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మార్చిలో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల కోసం చేసుకున్న దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఇంటర్‌బోర్డు అవకాశం కల్పించింది. తప్పులు సరిచేసుకునేందుకు ఈ నెల 15 వరకు అవకాశం కల్పిస్తున్నట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్‌జలీల్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. పరీక్షల కోసం ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న విద్యార్థుల వివరాలు ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని తెలిపారు. ప్రిన్సిపాళ్లు, ప్రాంతీయ ఇంటర్మీడియట్ విద్యాధికారులు, నోడల్ అధికారుల సహాయంతో తప్పులు సవరించుకొనేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. సదరు విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను సంబంధిత అధికారులకు చూపించాలని, పూర్తి వివరాలకు tsbie.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వెల్లడించారు.



# పౌరుల భద్రతపై భరోసా

- అన్ని జిల్లాలోనూ పోలీసుల అవగాహన కార్యక్రమాలు
- డయల్ 100, 181, 112పై విస్తృత ప్రచారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పౌరుల భద్రతపై పోలీసులు మరింతగా అప్రమత్తమవుతున్నారు. 'ఆపద' అని ఫిర్యాదు అందగానే .. బాధితులకు వీలైనంత త్వరగా రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 'దిశ' ఘటన నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మహిళలు, చిన్నారుల భద్రతపై తీసుకోవాల్సిన చర్యలపై హోంమంత్రి మహమూద్‌అలీ నేతృత్వంలో మంత్రుల బృందం బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో గుర్తించిన16 కీలకాంశాలపై గురువారం నుంచే క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభమయ్యాయి.వీటిపై అన్నిజిల్లాల పరిధుల్లోఅవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆపదలో ఉన్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. డయల్ 100కి సమాచారమివ్వడం, ఇందుకు సంబంధించిన యాప్స్‌పై పాఠశాలలు, కళాశాలల్లో షీటీమ్స్ బృందాలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్రైమ్స్ అడిషనల్ డీసీపీ షికాగోయల్ ఓయూ విద్యార్థులతో సమావేశమయ్యారు. కరీంనగర్‌లో సీఐ మాధవి ఎమర్జెన్సీ యాప్స్‌పై అవగాహన కల్పించారు.

### క్షేత్రస్థాయిలో పెరిగిన దృష్టి

రవాణా సదుపాయాలు, ఆటోలు, క్యాబ్‌లలో డయల్ 100,181,1098, 112 నంబర్లను ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే సీపీ అంజనీకుమార్ నేతృత్వంలో హైదరాబాద్‌లో క్యాబ్ సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేసి ఆదేశా లు జారీచేశారు. షీటీమ్స్ ఉన్నతాధికారులు జీహెచ్ఎంసీ సిబ్బందితో సమావేశమయ్యారు. నారాయణపేట్ ఎస్పీ డాక్టర్ చేతన అన్నిగ్రామాల్లో 'నీ నేస్తం' పేరిట ఫిర్యాదు బాక్స్‌లను ఏర్పాటుచేయిస్తున్నారు. 'దిశ' ఘటన జరిగిన తొండుపల్లి గ్రామంలోనూ పోలీసులు షీటీమ్స్, చైల్డ్ లేబర్, బాల్యవివాహాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియాలోనూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

### హైవేలపై భారీ వాహనాల పార్కింగ్ బంద్

వారాంతపు సెలవురోజుల్లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 24/7 డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. హైవేలపై భారీ వాహనాలు నిలుపకుండా ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టాలని సూచించారు.

## డయల్ 100కు కాల్.. ఇద్దరు సేఫ్

**ఖిలావరంగల్ (వరంగల్ అర్బన్):** డయల్ 100కు వచ్చిన సమాచారంతో పోలీసులు గురువారం ఇద్దరి ప్రాణాలను రక్షించారు. వరంగల్‌లో కుటుంబకలహాలతో ఆత్మహత్య చేసుకునేందుకు ఓ యువతి ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లింది. కుటుంబ సభ్యులు డయల్ 100కు ఫోన్ చేయడంతో వరంగల్ ఏసీపీ ఎస్ఎస్ పాణి ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పీఎస్‌ల ఇన్‌స్పెక్టర్లు, బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. జీఆర్పీ పోలీసుల సహకారంతో రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫాం చివర(కాజీపేట వైపు)న పట్టాలపై ఉన్న యువతిని రక్షించి కుటుంబసభ్యులకు అప్పగించారు. హైదరాబాద్‌లోని చిలకలగూడ పీఎస్ పరిధిలో ఖాన్ అనే ఒకవ్యక్తి ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు గుర్తించిన అతడి భార్య.. గురువారం మధ్యా హ్నం 12.38కి డయల్ 100కు ఫోన్‌చేశారు. పోలీసులు 12.45కి అక్కడికి చేరుకుని, తలుపులు పగులగొట్టి అతడ్ని కాపాడారు. రెండ్రోజుల క్రితం మంచిర్యాలజిల్లా లక్సెట్టిపేట మండలం తిమ్మాపూర్ యువతిని సైతం కాపాడారు.

# కస్టడీలోకి దిశ నిందితులు!

- ధ్రువీకరించని పోలీసు అధికారులు
- దిశ కేసు దర్యాప్తులో అంతా గోప్యం
- దర్యాప్తు అంశాలు లీక్‌కాకుండా జాగ్రత్తలు
- ఘటన స్థలాల్లో మరోసారి తనిఖీలు
- లారీ క్యాబిన్ నుంచి సూక్ష్మ ఆధారాలు సేకరణ



దిశ మృతదేహాన్ని తరలించిన లారీలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ కేసు దర్యాప్తులో పోలీసులు అంతా గోప్యత పాటిస్తున్నారు. రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితులను చర్లపల్లి జైలునుంచి బుధవారం అర్ధరాత్రి తర్వాత కస్టడీలోకి తీసుకున్నట్టు వార్తలు వచ్చినా.. పోలీసు అధికారులు మాత్రం ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించడం లేదు.మరోవైపు నిందితులను జైలులోనే విచారిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నప్పటికీ.. వారిని రహస్య ప్రాంతానికి తరలించినట్టు కూడా తెలుస్తున్నది. అర్ధరాత్రి కస్టడీలోకి తీసుకోగానే ముందుగా క్రైమ్ రీ కన్‌స్ట్రక్ట్ చేసిన పోలీసులు నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు తొండుపల్లి టోల్‌ప్లాజా వద్ద దాచిపెట్టిన సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. దేశవ్యాప్తంగా ప్రాధాన్యమున్న కేసు కావడం, శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలోనే కేసు దర్యాప్తును రహస్యంగా ఉంచుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు దర్యాప్తులో గోప్యత పాటించాలని కానిస్టేబుల్‌స్థాయి నుంచి ఉన్నతాధికారి వరకు ఆదేశాలు వెళ్లినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. దిశ కేసు దర్యాప్తుకు శంషాబాద్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డి నేతృత్వంలో మొత్తం 10 బృందాలు పనిచేస్తున్నాయి. కేసులో ప్రాథమిక ఆధారాల నుంచి కోర్టు విచారణ వరకు అవసరమైన ప్రతి అంశాన్ని ఈ బృందాలు సేకరిస్తున్నాయి. కీలకమైన సాక్షుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తున్నాయి.

### సూపర్‌లైట్స్‌తో ఆధారాలు సేకరణ

దిశ కేసులో గురువారం క్లూస్ టీం కంటికి కనిపించని సూక్ష్మఆధారాలను సేకరించింది. ఇందుకోసం ప్రత్యేకంగా సూపర్ లైట్స్ (హై ఇంటెన్సివిటీ లైట్స్)ను వినియోగించారు. మృతదేహాన్ని తరలించిన లారీక్యాబిన్‌లోని ఒక మూలను సుమారు గంటపాటు శోధించి అతి సూక్ష్మమైన ఆధారాలను సేకరించారు. వాటిని విశ్లేషణ కోసం ఫోరెన్సిక్‌కు పంపించాయి. సూపర్ లైట్స్‌తో క్లూస్‌ను శోధించడానికి సంబంధించి హైదరాబాద్‌లో ఇది మూడోకేసు. ఉప్పల్‌లో బాలుడి నరబలి కేసులో మొదటిసారి వినియోగించగా.. రెండోసారి మేడ్చల్ పరిధిలో ఆరేండ్ల బాలిక హత్య కేసులో కీలక ఆధారాలను సేకరించారు. దిశ కేసులో ఫోరెన్సిక్ నివేదిక అత్యంత కీలకం కానున్నది. ఇందులో డీఎన్‌ఏ ఆనవాళ్లు లభిస్తే.. నిందితుల డీఎన్‌ఏతో సరిపోలుస్తారు. అది మ్యాచ్ అయితే వారిని పక్కాగా దోషులుగా నిరూపించవచ్చు. సాధారణంగా అయితే ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు ఇచ్చేందుకు కనీసం నెల సమయం పడుతుంది. అయితే కేసు తీవ్రత దృష్ట్యా రోజుల్లోనే నివేదికలు ఇచ్చిన సందర్భాలున్నాయి. హైదరాబాద్‌లో గతంలో ఒక జవాన్ ఇద్దరు యువతులపై ఆత్యాచారం కేసులో కేవలం 24 గంటల్లోనే ఎఫ్ఎస్ఎల్ నివేదిక వచ్చింది. ఇప్పటి దిశ కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కావడం, మరోవైపు పోలీసు బృందాలు అన్ని అంశాలపై దృష్టి సారించిన నేపథ్యంలో ఈ కేసులోనూ ఎఫ్ఎస్ఎల్ నివేదిక త్వరగానే వచ్చే అవకాశాలున్నాయని అధికారులు చెప్తున్నారు.




## మరో యువకుడి అరెస్టు



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఫేస్‌బుక్‌లో దిశపై అనుచిత వ్యాఖ్యలను చేసిన మరో యువకుడిని సైబర్ క్రైం పోలీసులు గురువారం అరెస్టుచేశారు. ఏపీలోని గుంటూరు జిల్లాకుచెందిన అమర్‌నాథ్ సరూర్‌నగర్ కొత్తపేట ఆర్టీసీకాలనీలో ఉంటూ మెడికల్‌షాపులో పనిచేస్తున్నాడు. రెండేండ్ల క్రితం అమర్‌నాథ్ పేరుతో ఫేస్‌బుక్ ఖాతా తెరిచిన అతడికి అందులో స్మైలీనాని పరిచయమయ్యాడు. దిశ ఘటనపై నాని అసభ్యకరమైన పదాలతో ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా అమర్‌నాథ్‌కు మెసేజ్‌ను పంపాడు. దీనిని విస్తృతంగా ప్రచారం చేయాలంటూ అమర్‌నాథ్‌ను రెచ్చగొట్టడంతో అతడు ఆ సమాచారాన్ని ఫేస్‌బుక్‌లో పోస్టుచేశాడు. దీనిపై ఫిర్యాదు అందడంతో సైబర్‌క్రైం పోలీసులు గురువారం అమర్‌నాథ్‌ను అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చారు.

# పుట్టినరోజు బహుమతి కావాలి

- ఎంపీ సంతోష్‌కుమార్ ఆసక్తికర ట్వీట్
- మొక్క నాటుతూ దిగిన సెల్ఫీ షేర్‌చేయాలని విజ్ఞప్తి




ఎంపీ సంతోష్ చేసిన ట్వీట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తనకు పుట్టినరోజు బహుమతి కావాలంటూ రాజ్యసభ సభ్యుడు సంతోష్ గురువారం ఆసక్తికరమైన ట్వీట్‌చేశారు. ఒక మొక్కను నాటుతూ దిగిన సెల్ఫీని బహుమతిగా పంపించాలని విజ్ఞప్తిచేశారు. హరితహారం స్ఫూర్తితో గ్రీన్ ఇండియా చాలెంజ్ ఉద్యమాన్ని ప్రారంభించిన ఎంపీ సంతోష్.. డిసెంబర్ 7న పుట్టినరోజు సందర్భంగా మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'నేలంతా పచ్చగా ఉంటే.. మనుషులంతా చల్లగా ఉంటారనే సీఎం కేసీఆర్ మాటలతో స్ఫూర్తిపొంది.. గతేడాది గ్రీన్ ఇండియా చాలెంజ్ ఉద్యమాన్ని ప్రారంభించాం. ఇప్పుడు మిత్రులను, శ్రేయోభిలాషులందరినీ భాగస్వాములను చేసేందుకు నా పుట్టినరోజు బహుమతి కోరుతున్నాను. మొక్కను నాటుతూ దిగిన సెల్ఫీని బహుమతిగా పంపించాలని విజ్ఞప్తిచేస్తున్నాను. మీరు మొక్క నాటుతూ దిగిన సెల్ఫీలతో ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సప్ నిండిపోయేలా చేస్తారని ఆశిస్తున్నాను' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. వాట్సప్ 8790909999, ట్విట్టర్ @MPsantoshtrs, ఫేస్‌బుక్ Santoshkumar.joginipally వివరాలను పంచుకొన్నారు. ఎంపీ విజ్ఞప్తికి స్పందించిన నెటిజన్లు తమవంతుగా మొక్కలు నాటి ఫొటోలు షేర్‌చేస్తామని రీట్వీట్ చేస్తున్నారు. కాగా, నిజామాబాద్ కలెక్టర్ ఆర్ఎం రావు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఈడీ సత్యనారాయణ గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా గురువారం మొక్కలు నాటారు.



హైదరాబాద్‌లో మొక్కనాటి నీళ్లుపోస్తున్న హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఈడీ సత్యనారాయణ



నిజామాబాద్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్ ఆర్ఎం రావు



ఖైరతాబాద్‌లోని ప్లానింగ్, స్టాటిస్టికల్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో పాల్గొన్న ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కే రామకృష్ణారావు

# పక్కాగా గణాంకాల సేకరణ

- దిక్సూచిగా స్టాటిస్టికల్-2020 ఇయర్‌బుక్
- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో సేకరించే అన్నిశాఖల గణాంకాలు ప్రభుత్వంతో సహా ప్రతిఒక్కరికీ ఉపయోగపడేలా ఉండాలని, ఈ సమాచారాన్ని కరదీపికలా రూపొందించాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ సూచించారు. గురువారం ఖైరతాబాద్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్లానింగ్, స్టాటిస్టికల్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఏటా అసెంబ్లీ సమావేశాలకు ముందు స్టాటిస్టికల్ బుక్ రూపొందించడం ఆనవాయితీగా వస్తున్నదని, ఈ సారి స్టాటిస్టికల్-2020 ఇయర్‌బుక్ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు దిక్సూచిగా ఉండేలా సిద్ధంచేయాలని కోరారు. సూక్ష్మంగా పరిశీలన, లోతైన విశ్లేషణ, సంపూర్ణ అవగాహనతో సీఎం కేసీఆర్ పాలనాపరమైన నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్టాటిస్టికల్-2020 ఇయర్‌బుక్ సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కే రామకృష్ణారావు మాట్లాడుతూ ప్లానింగ్, స్టాటిస్టికల్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఇతరశాఖలతో సమన్వయం చేసుకొని సమగ్ర సమాచారాన్ని సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్లానింగ్ డైరెక్టర్ షేక్ మీరా, స్టాటిస్టికల్ డైరెక్టర్ ఏ సుదర్శన్‌రెడ్డి, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ ఏడీ శ్రీనివాస్‌రెడ్డి, నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ డైరెక్టర్ శ్రీకాంత్ గోవర్ధనం, సేజిస్ ప్రతినిధి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# దేవికారాణి ఆస్తులు రూ. 100 కోట్లు

- హైదరాబాద్, తిరుపతి చిత్తూరుల్లో విస్తరించిన ఆస్తులు
- ఏసీబీ సోదాల్లో బయటపడ్డ పదులకొద్దీ డాక్యుమెంట్లు
- దేవిక, ఆమె భర్త గురుమూర్తిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు
- గురుమూర్తి అరెస్ట్.. చంచల్‌గూడ జైలుకు తరలింపు
- ఇండ్లు, ఫ్లాట్లు, బహుళ అంతస్తుల భవనాలు, స్థలాలు, విల్లాలు..
- బంగారం, వెండి ఆభరణాలు, ఎఫ్‌డీలు, ఎన్‌డీలు..
- బహిరంగ మార్కెట్‌లో రూ. కోట్ల విలువచేసే స్థిరాస్తులు
- అక్రమార్జనతో కొన్న ఆస్తుల వివరాలు సేకరించిన ఏసీబీ
- షేక్‌పేట్‌లో విల్లా.. విలువ: రూ.3.80 కోట్లు
- సోమాజిగూడలో ఫ్లాట్.. విలువ: రూ.1.27 కోట్లు
- హైదరాబాద్‌లో 16 దుకాణాలు.. విలువ: రూ.3.85 కోట్లు
- నిర్మాణ సంస్థల్లో సెక్యూరిటీ డిపాజిట్లు.. విలువ:6.63 కోట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.100 కోట్లు.. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ మందుల కొనుగోలు స్కాంలో కీలక నిందితురాలు, ఐఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణి కూడబెట్టిన స్థిరాస్తుల విలువ ఇది. తన పేరిట, తన కుటుంబసభ్యుల పేరిట దేవికారాణి కొన్న ఆస్తుల చిట్టాను ఏసీబీ అధికారులు విప్పుతున్నారు. కేవలం స్థిరాస్తుల విలువే బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్ల వరకు ఉంటుందని.. ఇతర వస్తువులు, ఆభరణాలను లెక్కలోకి తీసుకుంటే ఇది మరింత పెరుగుతుందని అధికారులు చెప్తున్నారు. ఆదాయానికి మించి పెద్దమొత్తంలో ఆస్తులు కూడబెట్టినట్టు విశ్వసనీయ సమాచారం లభించడంతో దేవికారాణి, ఆమె భర్త.. రిటైర్డ్ సివిల్ సర్జన్ డాక్టర్ గురుమూర్తిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదుచేశారు. బుధవారం గురుమూర్తిని అరెస్టుచేసి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏసీబీ అధికారులు ఈ నెల 3వ తేదీన హైదరాబాద్‌లోని దేవికారాణి ఇంటితోపాటు ఆమె బంధువుల ఇండ్లలో.. తిరుపతి, కడపలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఆస్తులకు సంబంధించిన అనేక కీలక పత్రాలను స్వాధీనంచేసుకున్నారు. వీటిలో స్థిరాస్తుల విలువ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన ప్రకారం రూ.15 కోట్లు ఉన్నప్పటికీ.. బహిరంగ మార్కెట్‌లో రూ.వంద కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ డాక్యుమెంట్లతోపాటు ఖరీదైన వస్తువులను స్వాధీనంచేసుకున్నారు. వీటితోపాటు పీఎంజే జ్యువెలరీలో రూ.7.3 కోట్ల విలువైన ఆభరణాలు కొన్నట్టు గుర్తించారు.



గురుమూర్తి



దేవికారాణి

### ఏసీబీఅధికా రులుసే కరించినడా క్యుమెంట్లలో పొందుపరిచిన వివరాల ప్రకారం దేవికారాణి ఆస్తుల వివరాలు

- హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని షేక్‌పేట్ గ్రామంలో రూ.3.80 కోట్ల విలువైన విల్లా
- హైదరాబాద్ సోమాజిగూడలోని ఆర్ఆర్ఎస్ టవర్స్‌లో రూ. 1.27 కోట్ల విలువైన ఫ్లాట్
- హైదరాబాద్ షేక్‌పేట్‌లోని ఆదిత్య ఎంప్రెస్ టవర్స్‌లో రూ.2.65 లక్షల విలువైన మూడు ఫ్లాట్లు
- తిరుపతి, చిత్తూరులో రూ.కోటి విలువైన బహుళ అంతస్తుల భవనాలు
- హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని లక్ష్మిగూడలో రూ.6 లక్షల విలువ చేసే ఇండిపెండెంట్ ఇల్లు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో కలిపి మొత్తం 11 ఓపెన్ ప్లాట్లు. వీటివిలువ రూ.42.54 లక్షలు
- తెలంగాణలోని ఏడు ప్రాంతాల్లో 32.85 ఎకరాల వ్యవసాయ భూమి. వీటి విలువ రూ.88.47 లక్షలు
- హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో రూ.3.85 కోట్ల విలువచేసే మొత్తం 16 కమర్షియల్ దుకాణాలు
- విశాఖపట్నం మధురవాడలో రూ.12 లక్షల విలువైన ఇండిపెండెంట్ ఇల్లు
- నిర్మాణసంస్థల్లో రూ.6.63 కోట్ల విలువైన సెక్యూరిటీ డిపాజిట్లు
- నారాయణగూడ ఇండియన్ బ్యాంక్‌లో రూ.34 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు
- వివిధ బ్యాంకుల్లోని 23 ఖాతాల్లో కలిపి రూ.1.13 కోట్ల నగదు బ్యాలెన్స్
- ఇంట్లో గృహోపకరణాల విలువ రూ. 38 లక్షలు
- దేవికారాణి నివాసంలో రూ.25.72 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు
- దేవికారాణి నివాసంలో రూ.8.40 లక్షల నగదు స్వాధీనం
- ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువుల విలువ రూ.7 లక్షలు.
- రూ.20 లక్షల విలువచేసే ఇన్నోవా క్రిస్టా కారు స్వాధీనం
- రూ.60 వేల విలువైన మోటర్‌బైక్

# సౌకర్యాలున్న స్కూళ్లలోనే టెన్త్ పరీక్షలు

- పాత, శిథిల భవనాల్లో అనుమతించేది లేదు
- ప్రభుత్వ ఆధీనంలోని పాఠశాలలకు ప్రాధాన్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పదోతరగతి పరీక్షాకేంద్రాలు విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు బీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. విద్యార్థులు వార్షిక పరీక్షలను నేలపై కూర్చొని రాసేలా ఉండవద్దని.. సరిపడా గదులు, బెంచీలు ఉన్న పాఠశాలల్లోనే పరీక్షాకేంద్రాలు ఏర్పాటుచేయాలని స్పష్టంచేశారు. ఈ మేరకు సుధాకర్ మార్గదర్శకాలు విడుదలచేశారు. తగిన సౌకర్యాలున్న పాఠశాలల్లో మాత్రమే పరీక్షాకేంద్రాలకు అనుమతివ్వాలని.. ఇతర స్కూళ్లలో తప్పనిసరిగా ఇవ్వాల్సివస్తే అక్కడ అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేయించాలని తెలిపారు. పరీక్షాకేంద్రాలకు అనుమతిచ్చేముందు డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు తమ పరిధిలోని పాఠశాలలల్లో సౌకర్యాలను స్వయంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని స్పష్టంచేశారు. విద్యార్థులకు అవసరమైన గదులు, సరిపడా బెంచీలు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ తదితర మౌలిక వసతులు ఉంటేనే పరీక్షాకేంద్రానికి అనుమతివ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలో కొనసాగే పాఠశాలలకే ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయాలని, ఇవి అందుబాటులో లేకుంటే ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ఎయిడెడ్ స్కూళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

# రైతులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

- రైతుబంధు కింద రూ.10వేల ఆర్థికసాయం
- కేంద్రం నదుల అనుసంధాన గ్రిడ్లపై దృష్టి సారించాలి
- వాణిజ్య పంటలకు ప్రోత్సాహం అందించాలి
- లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు





**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటున్నదని, దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతుబంధు పథకం కింద ఎకరాకు రూ.పదివేల ఆర్థికసాయం చేస్తున్నారని టీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వర్‌రావు తెలిపారు. గురువారం లోక్‌సభలో పంటనష్టం- రైతులపై ప్రభావం చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ వరదలు వచ్చినప్పుడు రైతులు తీవ్రస్థాయిలో పంట నష్టపోతున్నారని అన్నారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు అందక.. బ్యాంకురుణాలు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇబ్బందులన్నింటినీ ఎదుర్కొని పండించిన పంటను మార్కెట్‌కు తీసుకువస్తే మద్దతు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా అమలుచేస్తున్నారని తెలిపారు. నేషనల్ హైవే గ్రిడ్ తరహా నదుల అనుసంధాన గ్రిడ్లు తీసుకురావాలని కేంద్రాన్ని కోరారు. వాణిజ్య పంటలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నదని, పామాయిల్‌కు మద్దతు ధర కల్పించాలని అన్నారు. చెరుకు పరిశ్రమల్లో ఇథానల్‌కు మంచి ధర కల్పించిన విధంగా దానికి అనుబంధంగా ఏర్పాటు చేసుకున్న విద్యుత్ పరిశ్రమల బెయోమాస్‌కు మంచి ధర కల్పించాలని కోరారు. రైతులు పండించిన పంటలు దళారుల బారిన పడకుండా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు విస్తృత పరచాలని చెప్పారు. దేశంలో రైతు సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఇండియన్ కిసాన్ పాలసీని తీసుకురావాలన్నారు.

### నిమ్జ్‌కు నిధులు కేటాయించాలి: రంజిత్‌రెడ్డి

తెలంగాణలోని ప్రతిపాదిత జాతీయ పెట్టుబడులు, ఉత్పత్తుల తయారీకేంద్రానికి నిధులు కేటాయించాలని ఎంపీ రంజిత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. గురువారం లోక్‌సభలో ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమాధానమిచ్చారు. జహీరాబాద్‌లో ఏర్పాటుచేయనున్న నిమ్జ్ కోసం ఇప్పటికే అనుమతులు ఇచ్చామని, ఫార్మాసిటీ ఏర్పాటుకు తుది అనుమతుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తున్నట్టు గోయల్ తెలిపారు. నిమ్జ్‌లో మౌలిక వసతులు అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ రూ.500 కోట్ల సాయం కోరారని పేర్కొన్నారు. ఆ వినతిని పరిశీలించిన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ రూ.3 కోట్లు విడుదల చేసిందని.. డీపీఐఐటీకి ఉన్న పరిమితుల దృష్ట్యా అంతకుమించి ఆర్థికసాయం అందించలేదని స్పష్టంచేశారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎల్కతుర్తి-సిద్దిపేట, రుద్రారం- మెదక్ హైవేలకు నంబర్ కేటాయించాలని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి కోరారు.

# ఆర్థిక క్రమశిక్షణతోనే అభివృద్ధి

- దుబారాను తగ్గించడమంటే.. ఆదాయాన్ని సృష్టించడమే
- వస్తు డిమాండ్ పెరగాలంటే నిరుద్యోగం పోవాలి
- కంపెనీలలో సీఎఫ్‌వోలదే కీలకపాత్ర
- సీఎఫ్‌వో కాంక్లేవ్-2019 సదస్సులో ఆర్థికమంత్రి హరీశ్‌రావు




ఐటీసీ కాకతీయ హోటల్‌లో సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎఫ్‌వో కాంక్లేవ్-2019 కార్యక్రమంలో మాటాడుతున్న మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్థిక క్రమశిక్షణతోనే రాష్ట్రమైనా, కంపెనీ అయినా అభివృద్ధి సాధిస్తుందని ఆర్థికమంత్రి టీ హరీశ్‌రావు అన్నారు. దుబారాను తగ్గించడమంటే ఆదాయం సృష్టించడంతో సమానమని తెలిపారు. గురువారం ఐటీసీ కాకతీయ హోటల్‌లో సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎఫ్‌వో కాంక్లేవ్-2019 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కంపెనీలలో ముఖ్య ఆర్థికఅధికారి (సీఎఫ్‌వో)ల పాత్ర అత్యంత కీలకమైనదన్నారు. తాను కూడా రాష్ట్రానికి సీఎఫ్‌వో లాంటివాడినేనన్నారు. కంపెనీ ఎదుగుదలకోసం సీఎఫ్‌వోలు పనిచేయాలని సూచించారు. యాజమాన్యం మెప్పుకోసం కాకుండా కంపెనీ అభివృద్ధికోసం సీఎఫ్‌వోలు తీసుకొనే నిర్ణయాలు ఉండాలన్నారు.నీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్నప్పుడు నిధులను వేగంగా ఖర్చుచేసి ప్రాజెక్టులను నిర్మించాలన్న తపన ఉండేదని, ఇప్పుడు ఆర్థికశాఖ మంత్రిగా తనపాత్ర మారిందని పేర్కొన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ జీడీపీ తగ్గిపోతున్న ఈ సమయంలో నిధుల వినియోగం, ఆర్థిక వనరుల సమకూర్పు కీలకమైన అంశాలన్నారు. పారిశ్రామిక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, పరిశ్రమలకు దన్నుగా నిలుస్తుందన్నారు. ఐదేండ్లుగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం ఎన్నో అవార్డులు సాధిస్తున్నదని పేర్కొన్నారు. టీఎస్ఐపాస్‌తో పారిశ్రామికరంగాన్ని ఆకట్టుకోగలిగామని, దేశంలో అతి పెద్దదైన మెగా టెక్స్‌టైల్ పార్క్, ఫార్మాసిటీ, మెడికల్ డివైస్ పార్క్ వంటివి త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతున్నాయని వెల్లడించారు. కార్పొరేట్ రంగానికి కేంద్రం పన్ను తగ్గించడం వల్ల కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అయిందని తెలిపారు. కొత్తగా పరిశ్రమలు పెట్టేవారికి బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణాలివ్వాలన్న నిబంధన ఉపయోగకరమని చెప్పారు. కొన్ని కంపెనీలు డిమాండ్ లేనికారణంగా ఉత్పత్తుల సరఫరా తగ్గిందని ఆందోళన చెందుతున్నాయని.. ఇందుకు కారణం కొత్త పరిశ్రమలు రాకపోవడమేనని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. కంపెనీలు పెట్టి పెద్ద ఎత్తున నిరుద్యోగాన్ని నివారిస్తే.. కొనుగోలుశక్తి పెరగడంతోపాటు ఉత్పత్తులకు డిమాండ్‌కూడా పెరుగుతుందని తెలిపారు.



రోగ నిర్ధారణ పరీక్ష తప్పు అయితే, చికిత్స కూడా నిరుపయోగమవుతుంది. ఆ క్రమంలో రోగి చనిపోవచ్చు. దేశ ఆర్థికపరిస్థితి విషయంలోనూ బీజేపీ అలాగే ప్రవర్తిస్తున్నది. ఏడేండ్లు అవుతున్నా దేశ ఆర్థిక దుస్థితి పట్ల బీజేపీకి సరైన విధానమంటూ లేదు. బీజేపీవన్నీ తప్పుడు నిర్ణయాలు, చర్యలే.

**పి.చిదంబరం, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి**

బీజేపీ తలపెట్టిన ప్రస్తుత పౌరసత్వ సవరణ బిల్లుకు బీఎస్పీ వ్యతిరేకం. బిల్లులోని విషయాలను మరోసారి పరిశీలన కోసం పార్లమెంటరీ కమిటీకి పంపాలి. ఇది అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగసూత్రాలకు వ్యతిరేకం. బలవంతంగా దేశంపై బిల్లును రుద్దవద్దు. అలా చేయటమంటే విభజన రాజకీయాలకు పాల్పడటమే.

**మాయావతి, బీఎస్పీ అధినేత్రి**



**చరిత్రలో నేడు**



**1756**

భారత్‌లోని పుల్తా ప్రాంతాన్ని ఆక్రమించిన రాబర్ట్ క్లైవ్ నేతృత్వంలోని బ్రిటిష్ సేనలు.

**1956**

దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలాతో పాటు 156 మంది అరెస్టు.





**1988**

స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో అమెరికా యూదులను కలిసి చర్చించిన పాలస్తీనా నేత యాసర్ అరాఫత్.

ఐదు విడుతల్లో జరుగుతున్న జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ ప్రతిపక్షాలు గెలుపు కోసం సర్వశక్తులనూ ఒడ్డుతున్నాయి. 2019 లోక్ సభ ఎన్నికల్లో కనబర్చిన ఆధిపత్యాన్ని బీజేపీ నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నది. కానీ అలాంటి పరిస్థితులేవీ కనిపించటం లేదు. మరోవైపు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు బీజేపీని నిలువరించేందుకు సకల శక్తులనూ మొహరిస్తున్నాయి.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లో 2012 జూన్ 28 రాత్రి జరిగాయని చెబుతున్న ఎన్‌కౌంటర్లు ఏకపక్ష కాల్పులని ప్రభుత్వం నియమించిన జస్టిస్ వి.కె.అగర్వాల్ న్యాయవిచారణ కమిషన్ తేల్చి చెప్పింది. ఆ క్రమంలో చనిపోయారని చెబుతున్న 17 మంది కూడా స్థానిక సాధారణ గిరిజనులేనని తెలిపింది.అంతేకాకుండా ఆ పోస్ట్‌మార్టం రిపోర్టులు, గాయాలను బట్టి చూసినా ఎదురుకాల్పులు జరిగిన ఆనవాళ్లు లేవని తెలుస్తున్నదని కమిషన్ పేర్కొన్నది. అలాగే ఈ చర్యలో పోలీసుల అత్యుత్సాహం, అవగాహన లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నదని పేర్కొనటం గమనార్హం.

**ది హిందూ**



# నాటో ఎటు?

ప్రచ్ఛన్న యుద్ధకాలంలో పశ్చిమ దేశాల భద్రతకు కీలకపాత్ర పోషించిన ఉత్తర అట్లాంటిక్ ఒప్పంద సంస్థ (నాటో) ఏర్పడి డెబ్బయి ఏండ్లయిన సందర్భంగా ఈ కూటమి భవిష్యత్తు, పాత్ర విషయమై చర్చ మొదలైంది. ఈ సంస్థకు ఏడు పదులు నిండిన సందర్భంగా సభ్యదేశాల అధినాయకులు లాంఛనంగా లండన్‌లో ఇటీవల సమావేశమైనప్పుడు సభ్యుల మధ్య విభేదాలు మరింత బహిరంగమయ్యాయి. ఇతర సభ్యదేశాల నాయకుల అపహాస్యానికి గురైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకొని వెనక్కి వెళ్ళిపోయారు. ఈ సమావేశం నాటోకు దిశానిర్దేశం చేయడానికి ఏర్పాటైన కీలక సమావేశం కాదు. ఎప్పుడూ జరిగే వార్షిక సదస్సు కాదు కనుక నిర్దిష్ట చర్చలు జరుగలేదు. డెబ్బయేండ్లయిన సందర్భంగా కలుసుకోవడానికే పరిమితమైంది. కానీ ఆ సందర్భంగానైనా వారిలో కొంతయినా సౌహార్దత వ్యక్తం కాకపోవడమే విశేషం. మొదట్లో నాటో పట్ల బాధ్యత లేకుండా వ్యవహరించిన ట్రంప్ మళ్ళా ఇటీవలే ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే నాటోను నడిపించడానికి యూరప్ దేశాలు తమ వాటా సొమ్మును పెంచాలని ఆయన పట్టుబడుతున్నారు. అమెరికా ఎక్కువభారం మోయడం అవసరమా అనే భావన ఆయనలో ఇంకా రగులుతూనే ఉన్నది. సమావేశాలకు కొద్దిరోజుల ముందే ఫ్రాన్స్ అధ్యక్షుడు నాటోను 'బ్రెయిన్ డెడ్' అంటూ అభివర్ణించారు. ఇది పరోక్షంగా అమెరికా నాయకత్వంపై విమర్శ. కెనడా అధ్యక్షుడు జస్టిన్ ట్రుడో, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ తమ సంభాషణలో ట్రంప్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ నవ్వుకోవడం యథాలాపంగా జరిగినప్పటికీ, వాస్తవ పరిస్థితికి అద్దం పడుతున్నది.

**అమెరికా బలహీనపడుతున్న నేపథ్యంలో భిన్న ధ్రువ ప్రపంచం రూపుదిద్దుకుంటున్నది. ఉగ్రవాదం నుంచి నిరంకుశ దేశాల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని పైకి చెప్పుకుంటున్నప్పటికీ, పారిశ్రామిక దేశాలకు వాటి వ్యాపార ప్రయోజనాలు, ఆధిపత్యమే ప్రధానమనేది స్పష్టం. పారిశ్రామిక దేశాలు వర్ధమాన దేశాలపై తమ ఆర్థిక విధానాలను రుద్దుతూనే ఉన్నాయి. రాజకీయంగా ఐక్యరాజ్యసమితిలో వాటి పెత్తనం సాగుతూనే ఉన్నది. ఇకసైనికంగా నాటో మరింత బలపడటం వల్ల వర్ధమాన దేశాలకు నష్టమే తప్ప లాభమేమీ లేదు.**

1950 మొదలుకొని 1980 దశకం చివరి వరకు సాగిన ప్రచ్ఛన్న యుద్ధం, ఆ కాలపు అవసరాలు వేరు. నాటో ఆ కాలపు అవసరానికి పుట్టింది, ఆ అవసరాలను తీర్చింది. రెండవ ప్రపంచయుద్ధంలో హిట్లర్ కూటమి ఓడిపోవడంతోనే ఒకవైపు సోవియెట్ యూనియన్, మరోవైపు అమెరికా-బ్రిటన్ తమ ప్రాబల్యాన్ని పరిరక్షించుకోవడానికి, విస్తరించుకోవడానికి ప్రయత్నాలు సాగించాయి. హిట్లర్ సైన్యాలను తుదముట్టించడంతోనే, ఆ దేశం తూర్పు, పశ్చిమ జర్మనీలుగా రెండు అగ్రరాజ్యాల ప్రాబల్యంలో చీలిపోయిందంటే రెండు కూటములు తమ లక్ష్యాల కోసం ఎంతవేగంగా పావులు కదిపాయో అర్థం చేసుకోవచ్చు. కమ్యూనిస్టు విస్తరణను కట్టడి చేసేందుకు అమెరికా పశ్చిమ యూరప్ దేశాలతో కలిసి 1949లో నాటో కూటమిని ఏర్పాటుచేసుకున్నది. పెట్టుబడిదారీ దేశాల విస్తరణను అరికట్టి కమ్యూనిస్టు దేశాల భద్రత, ప్రాబ ల్య విస్తరణకు 1955లో సోవియెట్ యూనియన్ వార్సా కూటమిని ఏర్పాటుచేసింది. ఇవి సైనిక కూటములే అయినప్పటికీ సైద్ధాంతిక పునాదులు కలిగి ఉన్నాయి. రెండు అగ్రరాజ్యాల నాయకత్వంలో ప్రాబల్య సమతుల్యానికి ఈ కూటములు దోహదపడ్డాయి. ఈ రెండు శిబిరాలు అంతర్జాతీయ రాజకీయాలను ప్రభావితం చేశాయి. తూర్పు, పశ్చిమ యూరప్ మధ్య రెండుపక్షాలు క్షిపణులను మోహరించుకున్నాయి. ఏ క్షణాన భూగోళంపై ఎక్కడ యుద్ధం ప్రజ్వరిల్లుతుందో అనే భయాలు కూడా వ్యక్తమయ్యాయి. 1991లో సోవియెట్ యూనియన్ కుప్పకూలడంతో ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిపోయింది. దీంతో నాటో ప్రాధాన్యం కూడా తగ్గిపోయింది. ఏకైక అగ్రరాజ్యంగా ఏర్పడిన అమెరికాకు యూరప్ భద్రత కోసం తాము నాటో భారాన్ని మోయడమేమిటనే అభిప్రాయం కలుగుతున్నది.

ప్రపంచ చరిత్రలోనే అత్యంత బలమైన భద్రతా కూటమి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడానికి అంతర్జాతీయ పరిస్థితులు కొంత కారణం. సభ్యదేశాల ప్రయోజనాలు మారిపోవడం మరో కారణం. కాలానుగుణంగా నాటో కూటమిని తీర్చిదిద్దుకోవడం సాధ్యమవుతుందా అనే ప్రశ్న మిగిలే ఉన్నది. యూరప్‌లోని ఉత్తర ప్రాంత దేశాలకు రష్యా చొచ్చుకురావడం పట్ల భయాందోళనలున్నాయి. దక్షిణాది దేశాలకు పశ్చిమాసియా పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆఫ్ఘనిస్థాన్, లిబియా, ఇరాక్ మొదలైన దేశాలపై దాడుల పట్ల అమెరికాకున్న ఆసక్తి యూరప్ దేశాలకు లేదు. చైనా ప్రబలశక్తిగా ఎదుగుతున్న క్రమం అమెరికాకు ఆందోళనకరంగా ఉన్నది. అయితే యూరప్ దేశాల స్పందన ఇదేస్థాయిలో లేదు. అమెరికా బలహీనపడుతున్న నేపథ్యంలో భిన్న ధృవ ప్రపంచం రూపుదిద్దుకుంటున్నది. ఉగ్రవాదం నుంచి నిరంకుశ దేశాల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని పైకి చెప్పుకుంటున్నప్పటికీ, పారిశ్రామిక దేశాలకు వాటి వ్యాపార ప్రయోజనాలు, ఆధిపత్యమే ప్రధానమనేది స్పష్టం. పారిశ్రామిక దేశాలు వర్ధమాన దేశాలపై తమ ఆర్థిక విధానాలను రుద్దుతూనే ఉన్నాయి. రాజకీయంగా ఐక్యరాజ్యసమితిలో వాటి పెత్తనం సాగుతూనే ఉన్నది. ఇకసైనికంగా నాటో మరింత బలపడటం వల్ల వర్ధమాన దేశాలకు నష్టమే తప్ప లాభమే మీ లేదు. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో వర్ధమాన దేశాలు ఈ రెండు కూటములకు దూరంగా ఉంటూ అలీన వేదికను ఏర్పాటుచేసుకున్నాయి. ఇప్పుడు నాటో బలహీనపడటం వర్ధమాన దేశాలకు అనుకూలపరి ణామమే.

**జనగళం**

## టూరిజానికి పెద్దపీట వేయాలె

తెలంగాణ చారిత్రక కట్టడాలకు, ప్రకృతి రమణీయతకు నిలయం. తెలంగాణలో అనేక చారిత్రక, ప్రకృతి పర్యాటక కేంద్రాలెన్నో ఉన్నాయి. వాటిలో రామప్ప గుడి, లక్నవరం చెరువు, వేయి స్తంభాల గుడి, ఏటూరునాగారం అభయారణ్యం, భువనగిరి కోట, కొలనుపాక, నాగార్జునసాగర్, పిల్లలమర్రి లాంటివెన్నో దర్శనీయ స్థలాలున్నాయి. ఇవేగాక ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు బాసర, వేములవాడ, రాజరాజేశ్వర స్వామి, కొమురవెళ్లి, ఏడుపాయల ఇంకా అనేకం ఉన్నాయి. ఇక హైదరాబాద్‌లోని పర్యాటక ప్రదేశాలు ప్రపంచ ప్రసిద్ధి గాంచినవి ఎన్నో ఉన్నాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో పర్యాటకం కూడా ఎంతో అభివృద్ధి చెందటానికి అవకాశం ఉన్నది. ఇప్పటికే గతంతో పోలిస్తే దేశీ, విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2014లో విదేశీ పర్యాటకుల సంఖ్య 75,171 ఉంటే, 2017నాటికి అది 2,51,846కు చేరుకున్నది. అలాగే స్వదేశీ సందర్శకుల సంఖ్య కూడా 2014లో సుమారు ఏడు కోట్లు ఉండగా, అది 2017 నాటికి 9 కోట్లకు పైగా చేరుకున్నది. దీంతో పర్యాటకరంగ అభివృద్ధి దిశను తెలుసుకోవచ్చు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో పర్యాటకరంగ అభివృద్ధికి కృషిచేయాల్సి ఉన్నది. దర్శనీయ స్థలాలన్నింటిని కలుపుతూ సకల సౌకర్యాలతో కూడిన బస్సులతో పాటు, రైలు ప్యాకేజీని ప్రకటించి ప్రోత్సహించాలి. పర్యాటకులకు అన్నిరకాల సౌకర్యాలు, భద్రతను కల్పించి ప్రోత్సహించినప్పుడే పర్యాటక రంగం ఆశించినవిధంగా అభివృద్ధి చెందుతుంది. ఇవ్వాళ అన్నిరంగాల్లో దూసుకుపోతున్న తెలంగాణ పర్యాటక రంగంలోనూ తనదైన ప్రత్యేకతను చాటుకోవాలి. అభివృద్ధికి సూచికగా పర్యాటకరంగాన్ని కూడా పరిగణించాల్సిన అవసరం ఉన్నది.

**- జె.అజయ్‌కుమార్, విజయనగర్‌కాలనీ, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**న్యాయం**



**మంగారి రాజేందర్**

# విచారణకు నిర్ణీత వ్యవధి

**దర్యాప్తు విషయంలోనే కాదు, కేసు విచారణలో కూడా ఎలాంటి కాలయాపన జరుగకూడదన్నది శాసనకర్తల ఉద్దేశం. అందుకని కేసు విచారణకు సంబంధించిన నిబంధన 309కి కూడా మార్పులను తీసుకొనివచ్చారు. ఈ మార్పులు తీసుకువచ్చిన నిబంధన ప్రకారం.. చార్జిషీట్ దాఖలైన తేదీ నుంచి రెండు మాసాల్లోగా కేసు విచారణ పూర్తిచేయాల్సిన బాధ్యత న్యాయమూర్తుల మీద వుంటుంది. ఒకవేళ అలా చేయకుండా పోయి అనవసర వాయిదాలు ఇస్తే ఆ న్యాయయూర్తుల మీద శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు అఖిల్ జావెద్ కేసులో చెప్పింది.**

దేశంలో ఏదైనా 'దిశ' లాంటి సంఘటన జరుగగానే కఠినమైన చట్టాలు తీసుకొనిరావాల్సిన అవసరం ఉందన్న డిమాండు తరచూ వినిపిస్తుంటుంది. అదేవిధంగా లైంగికదాడులకు పాల్పడిన వ్యక్తులను అప్పుడే ఎన్‌కౌంటర్ చేయాలని కూడా చాలామంది అంటూ వుంటారు. నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని కూడా చాలామంది డిమాండు చేస్తూ ఉంటారు. మీడియా దానికి వత్తాసు పలుకుతూ వుంటుంది. న్యాయపరిపాలన వ్యక్తుల డిమాండును బట్టి జరుగదు. దానికి ఒక పద్ధతి వుంది. రాజ్యాంగం వుంది. శాసనాలు ఉన్నాయి. వాటి ప్రకారం జరుగుతాయి.

అయితే ప్రజల ఆక్రోషంలో, డిమాండులో బాధ వుంది. వేదన వుంది. కోపం వుంది. దానికి ప్రధానమైన కారణం కేసుల విచారణల్లో జాప్యం. తుది నిర్ణయం వెలువడటానికి అనేక సంవత్సరాలు పడుతుంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిర్భయ కేసులోనే ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. ఈ నేపథ్యంలో హేయమైన నేరాలు జరిగినప్పుడు అలాంటి డిమాండ్లు రావడం సహజమే.

నిర్భయ సంఘటన తరువాత చట్టాల్లో చాలా మార్పులు వచ్చాయి. అయినా జాప్యం జరుగుతున్నది. దీనికి కారణం ఏమిటీ? ఇదీ చాలా మంది అడుగుతున్న ప్రశ్న. కాగ్నిజబుల్ నేరం (మెజిస్ట్రేట్ అనుమతి లేకుండా ముద్దాయిని అరెస్టు చేసే అధికారం) కేసుల్లో సమాచారం అందగానే పోలీసులు ఎఫ్ఐఆర్‌ను విడుదల చేసి కేసు దర్యాప్తు చేపట్టాలి. ఆ సంఘటన తమ అధికార పరిధిలో జరిగిందా లేదానన్న అంశంతో సంబంధం లేకుండా పోలీసులు ఈ చర్యలు తీసుకోవాలి. నాన్ కాగ్నిజబుల్ నేరాల్లో మాత్రం ఆ నేరం పోలీసుల అధికార పరిధిలో జరుగాలి. మెజిస్ట్రేట్ అనుమతి అవసరం. కాగ్నిజబుల్ నేరాలకు ఇది అవసరం లేదు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 154 ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది. 1974 లో కొత్త క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ విషయాన్ని స్వాతి బెహరా (1976) కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిర్భయ కేసు తర్వాత ఈ జీరో ఎఫ్ఐఆర్' భావన అందరి దృష్టిని ఆకర్షించింది. అయినా పోలీసులు వివిధ కారణాల వల్ల కేసులను నమోదు చేయకుం డా బద్‌నాం అవుతున్నారు. బాధితులు నష్టపోతున్నారు.

యాసిడ్ దాడులు, మహిళలపై లైంగికదాడుల వంటి నేర సమాచారాలను మహిళా పోలీసు అధికారులు నమోదుచేసే ఎఫ్ఐఆర్‌లను విడుదల చేయాలి. మానసిక వైకల్యం, శారీరక వైకల్యం వున్న మహిళలపై ఈ నేరాలు జరిగితే, మహిళా పోలీసు అధికారి బాధితురాలి ఇంటికివెళ్లి ప్రథమ సమాచారాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. అంతేకాదు, దాన్ని వీడియో కూడా తీయించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాలలో ఆమె స్టేట్‌మెంట్‌ను జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌తో సాధ్యమైనంత త్వరగా నమోదు చేయించాల్సి ఉంటుంది.

మహిళలపై లైంగికదాడుల కేసుల దర్యాప్తును సత్వరం ముగించాల్సిన బాధ్యత దర్యాప్తు అధికారిపై ఉంటుంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 173 (1ఎ) ప్రకారం ప్రథమ సమాచారం అందిన రెండు మాసాల్లోగా ఈ దర్యాప్తును పూర్తిచేసి చార్జిషీట్ (పోలీస్ రిపోర్టు)ను దాఖలు చేయాల్సి వుంటుంది. నిర్భయ కేసు తర్వాత చట్టంలో ఈ మార్పును తీసుకొని వచ్చారు. లైంగికదాడి ఆరోపణలున్న కేసుల్లో దర్యాప్తు వెంటనే పూర్తికావాలని, అది ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు మాసాలకు మించకూడదని శాసనకర్తల ఉద్దేశం. ఈ నిబంధనను ఎంతమంది పోలీసులు పాటిస్తున్నారన్నది పైఅధికారులు చూడాలి.

దర్యాప్తు విషయంలోనే కాదు, కేసు విచారణలో కూడా ఎలాంటి కాలయాపన జరుగకూడదన్నది శాసనకర్తల ఉద్దేశం. అందుకని కేసు విచారణకు సంబంధించిన నిబంధన 309కి కూడా మార్పులను తీసుకొనివచ్చారు. ఈ మార్పులు తీసుకువచ్చిన నిబంధన ప్రకారం.. చార్జిషీట్ దాఖలైన తేదీ నుంచి రెండు మాసాల్లోగా కేసు విచారణ పూర్తిచేయాల్సిన బాధ్యత న్యాయమూర్తుల మీద వుంటుంది. ఒకవేళ అలా చేయకుండా అనవసర వాయిదాలు ఇస్తే ఆ న్యాయయూర్తుల మీద శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు అఖిల్ జావెద్ కేసులో చెప్పింది. కేసు విచారణ రోజు తరువాత రోజు జరుగాలి. ఒకవేళ వాయిదా ఇవ్వాల్సి వస్తే అందుకు సంతృప్తికరమైన కారణాలను న్యాయమూర్తి పేర్కొనాల్సి ఉంటుంది. ఈ మార్పులన్నీ 21.4.2018 నుంచి అమల్లోకి వచ్చాయి.

లైంగికదాడి లాంటి కేసుల దర్యాప్తు రెండు మాసాల్లో పూర్తిచేసి చార్జిషీట్‌ను దాఖలు చేయాలి. మెజిస్ట్రేట్ ఎలాంటి జాప్యం లేకుండా కేసును సెషన్స్ కోర్టుకు పంపించాలి. అంటే సమిట్ చేయాలి. చార్జిషీట్ దాఖలైన తేదీ నుంచి రెండు మాసాల్లోగా కేసు విచారణ పూర్తిచేసి తీర్పును ప్రకటించాల్సిన బాధ్యత సెషన్స్ న్యాయమూర్తిపై వుంటుంది. ఇంతవరకు బాగానే వుంది. మరీ జాప్యం ఎందుకు జరుగుతుందీ అన్న ప్రశ్న వస్తుంది. నిబంధనలు వుండటంతోనే సరిపోదు, వటి అమలు జరుగాలి. అమలు జరిగే విధంగా పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ చర్యలు తీసుకోవాలి.

**లైంగికదాడి లాంటి కేసుల దర్యాప్తు రెండు మాసాల్లో పూర్తిచేసి చార్జిషీట్‌ను దాఖలు చేయాలి. మెజిస్ట్రేట్ ఎలాంటి జాప్యం లేకుండా కేసును సెషన్స్ కోర్టుకు పంపించాలి. అంటే సమిట్ చేయాలి. చార్జిషీట్ దాఖలైన తేదీ నుంచి రెండు మాసాల్లోగా కేసు విచారణ పూర్తిచేసి తీర్పును ప్రకటించాల్సిన బాధ్యత సెషన్స్ న్యాయమూర్తిపై వుంటుంది. ఇంతవరకు బాగానే వుంది. మరీ జాప్యం ఎందుకు జరుగుతుందీ అన్న ప్రశ్న వస్తుంది. నిబంధనలు వుండటంతోనే సరిపోదు, వటి అమలుజరుగాలి. అమలు జరిగే విధంగా పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ చర్యలు తీసుకోవాలి.**

ఇక్కడితో అయిపోలేదు. ఈ నిర్ణీత కాలవ్యవధి (టైమ్ ఫ్రేమ్) పోలీసులకు, సెషన్స్ కోర్టులకు మాత్రమే ఉంది. కానీ హైకోర్టు, సుప్రీంకోర్టులకు లేదు. ఈ కారణంగా కూడా కేసు అప్పీళ్ల, రివిజన్ల విచారణలు సంవత్సరాల కొద్దీ జరుగుతున్నాయి. శిక్షలకు సంబంధించి తీసుకొచ్చిన సవరణలు నా దృష్టిలో సరిగ్గానే వున్నాయి. జీవిత ఖైదు విధించినప్పుడు గతంలో మాదిరిగా కాకుండా అతని తుది జీవితం వరకు సామూహిక లైంగికదాడి కేసులో విధించే విధంగా మార్పులు తీసుకొని వచ్చారు. హైకోర్టు, సుప్రీంకోర్టులకు కూడా టైమ్‌ఫ్రేమ్‌ను ఏర్పాటు చేసేవిధంగా మార్పులు తీసుకొని రావాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ విషయం గురించి ప్రజల నుంచి ఒత్తిడి రావాలి. అప్పుడే శాసనకర్తలు తమ దృష్టిని ఈ టైమ్‌ఫ్రేమ్ మీద కేంద్రీకరిస్తారు. ఆ విధంగా మార్పులు తీసుకొని రానంతవరకు ఈ కేసుల విచారణ అంతులేకుండా కొనసాగుతుంది. బాధితులు, వారి తల్లిదండ్రులు, సమాజం ఆందోళనకు గురవుతూనే ఉంటుంది. మళ్లీ ఏదైనా సంఘటన జరుగగానే బహిరంగంగా ఉరితీయాలి. ఎన్‌కౌంటర్లు చేయాలి అన్న డిమాండ్లు వస్తూనే ఉంటాయి. దాని వల్ల పోలీసుల మీద, రాజ్యం మీదా ఒత్తిడి పెరిగి న్యాయపాలన విఘాతం ఏర్పడే అవకాశం ఉంది.

ఇక శిక్షల విషయానికి వస్తే ఎంత శిక్ష విధించాం అన్నదానికన్నా ముఖ్యం శిక్షపడిందా లేదా అన్నది ప్రధానమైన అంశం. అరుదైన కేసుల్లో అరుదైన వాటిల్లోనే కోర్టులు మరణశిక్షలను విధిస్తున్నాయి. కేసును విచారించిన కోర్టు మరణశిక్షను విధించినప్పటికీ అది అరుదైన వాటిలో అరుదైనది కాకపోవడం వల్ల హైకోర్టు ఆ శిక్షలను జీవిత ఖైదుగా మారుస్తున్నాయి.

ఉరిశిక్ష అనేది చనిపోయే స్థితిలో ఉంది. ఉరిశిక్ష పడిన కేసుల్లోని చాలామంది నిందితులు అమాయకులుగా తరువాత బయటపడుతుంది. ఇది మనదేశంలోని సంగతి కాదు. అమెరికాలోన సంగతి. మన దేశంలో కూడా ఆ మధ్య ఉరిశిక్షను సుప్రీంకోర్టు ముగ్గురికి విధించింది. అదే సుప్రీంకోర్టు ఆ తరువాత వాళ్లు అమాయకులని తేల్చింది. ఇలాంటి పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. సంపూర్ణ సాక్ష్యం లభించడం అన్ని కేసుల్లో జరుగదు.

అందుకని శిక్ష పడటం ముఖ్యం. అది అత్యంత అవసరం.

*(వ్యాసకర్త: గతంలో జిల్లా సెషన్స్ జడ్జిగా, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులుగా పనిచేశారు.)*

**స్థానికసంస్థలు**



**ఎ.శ్యామ్‌కుమార్**

# ప్రత్యేక కార్యక్రమ స్ఫూర్తి

తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీల ప్రగతిని పరుగులు పెట్టిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి దోహదపడనున్నాయి. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1993, ఏప్రిల్ 24వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం లోటుపాట్లను సవరిస్తూ నూతన తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018కి రూపకల్పన చేసింది. 2018 నుంచి అమల్లోకి వచ్చిన నూతన పంచాయతీరాజ్ చట్టంలో భాగాలు 9, అధ్యాయాలు 10, సెక్షన్లు 297, షెడ్యూళ్లు 8 ఉన్నాయి. నూతన చట్టంలో కీలకమైన మార్పులు చేసి, ఆదర్శ గ్రామాలే ధ్యేయంగా పలు సవరణలను చేపట్టి నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చారు.

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పంచాయతీరాజ్ సంస్థల్లో సైతం కనిష్ఠ గ్రామాలు గరిష్ఠ పాలన అన్నరీతిలో, గతంలో 8 వేల పైన ఉన్న గ్రామాలను 12,751 గ్రామ పంచాయతీలుగా ఏర్పాటుచేసి నూతన శకానికి నాంది పలికింది. గ్రామ పంచాయతీలు స్థానిక ప్రభుత్వాలుగా వెలుగొందడానికి కావలసిన అన్నిరకాల కార్యక్రమాలను చేపట్టింది.

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలో గత చట్టంలో వలె కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా పల్లెల సుస్థిరాభివృద్ధి ధ్యేయంగా, ఉత్తమ గ్రామాలుగా రూపుదిద్దడానికి హరితహారంలో మొక్కల సంరక్షణ, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ వంటి వాటికి చోటు కల్పిస్తూ చట్టాన్ని రూపొందించి, అమలుపరుస్తున్నది. ఆదర్శ గ్రామాలుగా గతంలో ఇంటి పన్ను వందశాతం వసూలైతే, వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం చేస్తే ఆ గ్రామాలను ఆదర్శగ్రామాలుగా ఎంపిక చేసేది. కానీ నూతన చట్టం ప్రకారం పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం విరివిగా పెంపొందించడం, శ్మశానవాటిక నిర్మాణం, డంపింగ్‌యార్డ్ నిర్మాణం, మంచి కూరగాయల మార్కెట్ కలిగిఉండటం, క్రీడా మైదానం కలిగి ఉండటం లాంటివి ఏ గ్రామాల్లో అయితే ఉంటాయో వాటిని ఆదర్శ గ్రామాలుగా గుర్తిస్తారు. అందుకనుగుణంగా కార్యక్రమంలో పారిశుధ్యం నిర్వహణ పనులు, పచ్చదనం మెరుగుపరుచడంలో విరివిగా మొక్కలు నాటడం, విద్యుత్ సంబంధించిన పనులు, డంపింగ్‌యార్డ్, శ్మశానవాటికలకు స్థలాలను గుర్తించటం వంటి పనులను ప్రాధాన్యాంశాలుగా చేపడుతున్నది. రాష్ట్రంలోని 4,540 డంపింగ్‌యార్డులు ఇదివరకే ఉండగా, 7,061 గ్రామాల్లో డంపింగ్ యార్డ్ స్థలాలను గుర్తించింది. కొన్ని జిల్లాల్లో డంపింగ్‌యార్డ్ స్థలాలు గుర్తించడంతో పాటుగా గ్రామపంచాయతీ నిధులతో పనులు పూర్తిచేసి, వాడుకలోకి తెచ్చింది. ఇలా రాష్ట్రంలో చట్టంలో పేర్కొన్నవిధంగా ఆదర్శ గ్రామాలకు ప్రత్యేక కార్యాచరణతో అంకురార్పణ జరుగుతున్నది. అలాగే చట్టంలో పేర్కొన్నవిధంగా కూరగాయల మార్కెట్ క్రీడా మైదానం మినహా మిగతా అన్నింటిపై తగిన కార్యాచరణతో ముందుకు తీసుకుపోవడం వల్ల ఆదర్శ గ్రామాలుగా అవతరించనున్నాయి.

గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో పలు శాఖలతో పాటు ఆయా శాఖలు ఉద్యోగుల సమన్వయం కీలకం లేకపోతే సమన్వయ లేమితో ప్రణాళిక రూపకల్పన ప్రజా సమస్యలను సమగ్రంగా గుర్తించకపోవడం తద్వారా ప్రణాళిక అసమగ్రంగా ఉండే అవకాశం ఉంటుంది. అందుకోసం రాజ్యాంగంలో పొందుపరుచబడిన 29 అంశాలకు సంబంధించిన 18 శాఖల సమన్వయంతో ప్రణాళికలను రూపొందించవలసి ఉంటుంది. అవి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, వ్యవసాయం, రైతుల సంక్షేమం, పశువుల, డైరీ ఫిషరీస్ శాఖ, పర్యావరణం, ఫారెస్ట్ వాతావరణ మార్పులు శాఖ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ, తాగునీరు, పారిశుధ్యం శాఖ, పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, మహిళా శిశు అభివృద్ధి శాఖ, ఆహారం ప్రజా పంపిణీ శాఖ, సంస్కృతిశాఖ, ఆర్థికసేవల శాఖ, భూ వనరులు శాఖ, విద్యుత్ శాఖ, పెట్రోలియం సహజగ్యాస్ శాఖ, నవ పునరుత్పాదక శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ శాఖ, గిరిజన వ్యవహారాలు సామాజిక న్యాయం, సాధికారత శాఖల సమన్వయంతో గ్రామ సుస్థిర, సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించవలసి ఉంటుంది. అంతేకాకుండా పంచాయతీరాజ్ చట్టం, 2018 సెక్షన్ 127 ప్రకారం గ్రామ పంచాయతీకి అన్ని శాఖల గ్రామస్థాయి ఉద్యోగుల నుంచి సమాచారం తెప్పించుకునే అధికారం ఉంటుంది. గ్రామాభివృద్ధిలో అన్నిశాఖల గ్రామస్థాయి ఉద్యోగులు గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించవలసి ఉంటుంది. గ్రామ పంచాయతీ సమగ్రాభివృద్ధికి గ్రామ ప్రజల భాగస్వామ్యంతో పాటు, గ్రామస్థాయి ఉద్యోగుల సమన్వయం ఎంతో అవసరం. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి కూడా కీలకపాత్ర పోషించాలి. గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనను సమర్థవంతంగా పూర్తిచేస్తూ, వివిధశాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా ప్రణాళికల రూపకల్పన చేయాలి. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో వార్షిక ప్రణాళికతోపాటు ఐదేండ్లకు ప్రణాళికలను పూర్తిచేసింది. అంతేకాకుండా రాబోయే సంవత్సరానికి కావలసిన హరిత ప్రణాళికను కూడా తయారుచేసింది.

ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమంలో తొలుత గ్రామసభలు నిర్వహించింది. అన్ని గ్రామపంచాయతీల్లో ఈ సభలు నిర్వహించి సుమారు 40 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని గుర్తించి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తిచేసింది. ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వం రూపొందించిన పారిశుధ్య నిర్వహణ, హరితహారం, విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలను గుర్తించి, పూర్తిచేసింది. దీనికి ప్రజల భాగస్వామ్యంతో పాటు, గ్రామస్థాయి ఉద్యోగుల సమన్వయం ఎంతో అవసరం. అంతేకాకుండా చార్జ్‌డ్ వ్యయంలో భాగంగా సిబ్బంది వేతనాలు, విద్యుత్ వినియోగచార్జీలు, ట్రాక్టర్ కొనుగోళ్ల కోసం తీసుకొనే రుణాలను నెలానెలా చెల్లించేలా చార్జ్‌డ్ వ్యయానికి నిధులు కేటాయించే ప్రణాళికలను రూపొందించింది. పచ్చదనం మెరుగుపర్చేందుకు గాను గ్రామ పంచాయతీ నిధుల నుంచి 10 శాతం హరిత నిధికి కేటాయించింది. తద్వారా హరితహారం కార్యక్రమానికి సైతం నిధులు వినియోగించేలా ప్రణాళికలను తయారుచేసింది. ఇలా గ్రామపంచాయతీ ఆదాయ వనరులు, వాటిద్వారా చేపట్టవలసిన పనులను ప్రణాళికలు రూపకల్పన చేయాలి. ఆయా ప్రణాళికలను గ్రామసభలో చేపట్టడం ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేసినట్లవుతుంది. గ్రామ పంచాయతీ పరిపాలనలో ప్రజలను భాగస్వాములను చేయడం వల్ల గ్రామ పంచాయతీ పరిపాలన సజావుగా సాగుతుంది. కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ఆకాంక్షలకు అద్దంపట్టే సుస్థిరాభివృద్ధికి బాటలు పడనున్నాయి. ప్రభుత్వం పిలుపుతో అన్ని గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి గ్రామపంచాయతీలు పారిశుధ్యం నిర్వహణా కార్యక్రమాలు నిరంతరం ఇలాగే కొనసాగించాలి. ప్రత్యేక కార్యక్రమ స్ఫూర్తితో పల్లెల సర్వతోముఖాభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన బాటలు పడాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రత్యేక కార్యక్రమాన్ని ముమ్మందు చేపడితే చట్టంలో పేర్కొన్నవిధంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాలు అభివృద్ధిలో దూసుకెళ్తాయి. స్థానిక స్వపరిపాలనను సమర్థవంతంగా చేపట్టి పల్లె ప్రగతికి బాటలు పడి, ఆదర్శగ్రామాలుగా అవతరించాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు.

**గ్రామపంచాయతీ ఆదాయ వనరులు, వాటిద్వారా చేపట్టవలసిన పనులను ప్రణాళికలు రూపకల్పన చేయాలి. ఆయా ప్రణాళికలను గ్రామసభలో చేపట్టడం ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేసినట్లవుతుంది. గ్రామ పంచాయతీ పరిపాలనలో ప్రజలను భాగస్వాములను చేయడం వల్ల గ్రామ పంచాయతీ పరిపాలన సజావుగా సాగుతుంది. కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ఆకాంక్షలకు అద్దంపట్టే సుస్థిరాభివృద్ధికి బాటలు పడనున్నాయి. ప్రభుత్వం పిలుపుతో అన్ని గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి గ్రామపంచాయతీలు పారిశుధ్యం నిర్వహణా కార్యక్రమాలు నిరంతరం ఇలాగే కొనసాగించాలి. ప్రత్యేక కార్యక్రమ స్ఫూర్తితో పల్లెల సర్వతోముఖాభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన బాటలు పడాలని ప్రజలు కోరుకుంటున్నారు.**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

## అమ్మతనాన్నీ పంచుకున్నారు

ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా స్వలింగసంపర్కులైన జంట 'ఒకే' బిడ్డకు తల్లయ్యారు. బ్రిటన్‌కు చెందిన జాస్మిన్-డోనా జంట టెస్ట్‌ట్యూబ్ బేబీ ప్రక్రియ ద్వారా ఒకే బిడ్డను తమ గర్భంలో మోశారు. డాక్టర్లు ముందుగా డోనా నుంచి అండాన్ని సేకరించి ఫలదీకరణం చేశారు. తర్వాత పిండాన్ని డోనా గర్భంలోకి ప్రవేశపెట్టారు. 18 గంటల తర్వాత పిండాన్ని జాస్మిన్ గర్భంలోకి పంపించారు. తొమ్మిది నెలల అనంతరం జాస్మిన్ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.


చిన్నారితో డోనా, జాస్మిన్

## క్షమాపణ కోరిన జస్టిస్ అరుణ్ మిశ్రా



**న్యూఢిల్లీ:** తన మాటల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే వారిని చేతులు జోడించి క్షమాపణ కోరుతున్నానని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్‌మిశ్రా పేర్కొన్నారు. రెండ్రోజుల క్రితం భూసేకరణ కేసు విచారణ సందర్భంగా న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్‌ను ఉద్దేశించి కోర్టు ధిక్కారం కింద చర్య తీసుకుంటామని జస్టిస్ మిశ్రా హెచ్చరించారు. జస్టిస్‌లు అరుణ్ మిశ్రా, ఎంఆర్‌షాతో కూడిన ధర్మాసనం గురువారం సమావేశం కాగానే న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గీ, ఏఎం సింఘ్వీ, దుష్యంత్ దవే, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాకేశ్ ఖన్నా మాట్లాడుతూ, తమతో మాట్లాడేటప్పుడు ఓర్పు వహించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు జస్టిస్ మిశ్రా స్పందిస్తూ 'నేను ఎవరినైనా గాయపరిచి ఉంటే, వారిని కేవలం క్షమాపణే కోరడం లేదు..వందసార్లు చేతులు జోడిస్తున్నాను' అని చెప్పారు.

## సూర్యుడి గుట్టువిప్పుతున్న పార్కర్

కరోనాకు సంబంధించిన కీలక సమాచారం భూమికి చేరవేత



**వాషింగ్టన్:** సూర్యుడిపై పరిశోధనలకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) పంపిన వ్యోమనౌక పార్కర్.. తన పని ప్రారంభించింది. తొలిసారి సూర్యుడికి అత్యంత సమీపానికి వెళ్లిన ఈ వ్యోమనౌక.. తొలి విడుతగా సౌర పవనాలు, సౌర వాతావరణంపై అద్భుత సమాచారం భూమికి చేరవేసిందని నాసా తెలిపింది. ఈ సమాచారాన్ని విశ్లేషిస్తే సూర్యుడిపై పలు ప్రశ్నలకు జవాబు లభిస్తుందన్నది. సూర్యుడి చుట్టూ వేల కిలోమీటర్ల మేర గల 'కరోనా' ఉష్ణపొరలో సూర్యుడి ఉపరితలం కన్నా ఉష్ణోగ్రత వందల రెట్లు అధికం. కరోనాలో అక్కడక్కడా ఉండే రంధ్రాల నుంచి సౌర తుఫాన్లు వెలుపలికి వస్తుంటాయి. పార్కర్ పంపిన సమాచారాన్ని లోతుగా విశ్లేషిస్తే వీటికి సమాధానాలు దొరుకొచ్చని నాసా తెలిపింది.



# మానవమృగాల బరితెగింపు

- లైంగికదాడి బాధితురాలికి.. నిప్పు.. కోర్టుకు వెళ్తుండగా దాడి
- యూపీలోని ఉన్నావ్‌లో దారుణం
- ఒంటిపై మంటలతోనే కి.మీ దూరం పరిగెత్తిన బాధితురాలు
- ఐదుగురు నిందితుల అరెస్ట్
- బాధితురాలి పరిస్థితి అత్యంత విషమం.. ఢిల్లీకి తరలింపు


యూపీలోని ఉన్నావ్‌లో లైంగికదాడి బాధితురాలిని దుండగులు దహనం చేసేందుకు ప్రయత్నించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



**ఉన్నావ్, డిసెంబర్ 5:** లైంగికదాడికి గురై న్యాయ పోరాటం చేస్తున్న ఓ బాధితురాలు.. కోర్టుకెళ్తుండగా ఐదుగురు దుండగులు అడ్డగించి నిప్పంటించారు. ఆమె 'రక్షించండి.. రక్షించండి' అని హాహాకారాలు చేస్తూ కాలుతున్న శరీరంతోనే దాదాపు కిలోమీటర్ దూరం పరిగెత్తింది. 90% కాలిన గాయాలతో ప్రస్తుతం ఆ బాధితురాలు దవాఖానలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నది. ఈ దారుణ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో జరిగింది. ఈ దారుణానికి పాల్పడిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శివమ్ త్రివేది, శుభం త్రివేది అనే యువకులు తనపై లైంగికదాడికి పాల్పడ్డారని ఉన్నావ్‌కు సమీపంలోని ఓ గ్రామ యువతి ఈ ఏడాది మార్చిలో పోలీసులకు ఫిర్యాదుచేశారు. గతేడాది డిసెంబర్‌లో తనపై లైంగికదాడి జరిగిందని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ఇద్దరిని అరెస్ట్ చేశారు. గత నెల 25న వారు బెయిల్‌పై బయటికొచ్చారు. రాయబరేలీ కోర్టులో విచారణకు హాజరయ్యేందుకు బాధితురాలు గురువారం ఉదయం ఒంటరిగా బయలుదేరింది. దాదాపు 10 గంటల సమయంలో గ్రామం నుంచి కిలోమీటర్ దూరం వెళ్లాక నిర్మానుష ప్రాంతంలో శివమ్, శుభంతోపాటు మరో ముగ్గురు కలిసి బాధితురాలిని అడ్డగించారు. తమపై కేసు పెట్టిందనే కోపంతో ఆమెను తీవ్రంగా కొట్టి, కిరోసిన్ పోసి నిప్పంటించారు.

**కాలుతూనే కిలోమీటర్ దూరం..**

నిర్మానుష ప్రాంతంలో నిప్పుపెట్టడంతో బాధితురాలికి సాయం అందలేదు. దీంతో ఆమె 'రక్షించండి.. రక్షించండి' అని పెద్దగా హాహాకారాలు చేస్తూ.. కాలిపోతున్న శరీరంతోనే దాదాపు కిలోమీటర్ దూరం పరిగెత్తి.. సింధుపూర్ అనే గ్రామ శివారులోని ఓ ఇంటికి సమీపంలో పడిపోయింది. స్థానికులు ఆమెను గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. కొందరు గ్రామస్థులు మాత్రం.. బాధితురాలు స్వయంగా ఓ వ్యక్తి ఫోన్‌ను తీసుకొని 112 ఎమర్జెన్సీ నంబర్‌కు ఫోన్ చేసిందని, ఆ సమయంలో ఆమె శరీరంపై మంటలు కనిపించాయని చెప్పారు. పోలీసులు అక్కడికి చేరుకొని, బాధితురాలిని జిల్లా దవాఖానకు, ఆ తర్వాత లక్నోలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ దవాఖానకు తరలించారు. ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నదని డాక్టర్లు చెప్తున్నారు. 'బాలిక పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నది' అని దవాఖాన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అశుతోష్ దూమే చెప్పారు. సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ దయాశంకర్ పాఠక్ ఆమె వాంగ్మూలాన్ని సేకరించారు. గురువారం రాత్రి బాధితురాలిని విమానంలో ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ దవాఖానకు తరలించారు.శుభం, శివంతోపాటు హరిశంకర్ త్రివేది, రామ్‌కిశోర్ త్రివేది, ఉమేశ్ బాజ్‌పేయ్ తనపై దాడి చేశారని బాధితురాలు తెలిపారు. ఈ మేరకు పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు.


ఉన్నావ్ బాధితురాలిని దవాఖానకు తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

**యూపీలో ఆటవికపాలన: ప్రియాంక**

ఈ ఘటనపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ స్పందిస్తూ.. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపుతప్పుతున్నాయని, అయినా సీఎం యోగి ఆదిత్యనాథ్ అంతా ప్రశాంతంగా ఉన్నదని అబద్ధాలు చెప్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తున్నదని, బీజేపీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని, డీజీపీ రాజీనామా చేయాలని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. మరోవైపు ఈ ఘటనపై సీఎం యోగి స్పందిస్తూ.. నిందితులకు కఠిన శిక్ష విధించాలని, బాధితురాలికి మెరుగైన వైద్యమందించాలని ఆదేశించారు. జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు రేఖాశర్మ యూపీ డీజీపీ ఓపీ సింగ్‌కు లేఖ రాశారు. ఈ ఘటనపై సమగ్ర నివేదిక అందించాలని, మూడేండ్లలో మహిళలపై నేరాలు చేసి ప్రస్తుతం బెయిల్‌పై తిరుగుతున్న నిందితుల వివరాలివ్వాలని ఆదేశించారు. ఉన్నావ్ దారుణంపై రాజ్యసభ అట్టుడికిపోయింది. ప్రతిపక్షాల నిరసనతో సభను అరగంట వాయిదా వేశారు. గత నెలలో యూపీలోని సంభల్ జిల్లాలో ఓ మైనర్ బాలికపై దుండగుడు లైంగికదాడికి పాల్పడి, అనంతరం నిప్పంటించాడు. బాధితురాలు ఢిల్లీలో చికిత్స పొందుతూ మరణించింది. ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ తనపై లైంగికదాడి చేశాడని 2017లో ఉన్నావ్‌కు చెందిన ఓ యువతి ఫిర్యాదుచేసిన సంగతి తెలిసిందే.

### రాముడు కూడా ఏం చేయలేడు

ఉన్నావ్ ఘటనపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో యూపీ వ్యవసాయశాఖ మంత్రి రణవేంద్ర ప్రతాప్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ కాలంలో వంద శాతం సురక్షితమైన సమాజం సృష్టించడం రాముడికి కూడా సాధ్యం కాదంటూ వ్యాఖ్యానించారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. మంత్రి వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నాలుగేండ్ల బాలికపై..

**భోపాల్:** అభంశుభం తెలియని నాలుగేండ్ల బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడి హత్య చేశాడు. ఈ దారుణ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలో ఉన్న మావ్ పట్టణంలో ఇటీవల చోటుచేసుకొనగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కూలీలైన తన తల్లిదండ్రులతో కలిసి బాలిక ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న సమయంలో అంకిత్‌సింగ్ అనే ఓ వ్యక్తి అమెను అపహరించాడు. అనంతరం ఖాళీగా ఉన్న ఓ భవనంలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. చిన్నారి ఏడుస్తుండటంతో విషయం బయటపడుతుందనుకున్న అతడు ఆమెను చంపేశాడు. అనంతరం బాలిక మృతదేహాన్ని ఓ ప్లాస్టిక్ సంచిలో చుట్టి అక్కడే వదిలేసి పారిపోయాడు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడు డీజే సంగీతకారుడని పోలీసులు చెప్పారు.


దేశంలో పెరుగుతున్న లైంగికదాడులను నిరసిస్తూ లక్నోలో ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న మహిళలు

## బెంగాల్‌లో మరో 'దిశ'!

యువతిపై లైంగికదాడికి పాల్పడి నిప్పుపెట్టిన దుండగులు




**మాల్దా, డిసెంబర్ 5:** దేశంలో రోజురోజుకు లైంగికదాడుల ఘటనలు పెరిగిపోతున్నాయి. హైదరాబాద్‌లో 'దిశ' ఘటన మరువకముందే అలాంటి ఘటనే పశ్చిబెంగాల్‌లో జరిగింది. మాల్దా జిల్లా ఓ మామిడి తోటలో కాలిపోయిన యువతి (20) మృత దేహాన్ని గుర్తించిన రైతులు పోలీసులకు తెలిపారు. ఆ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

**రాజస్థాన్‌లో విద్యార్థినిపై..**

**జైపూర్:** రాజస్థాన్ లోని జైపూర్‌లో హోటల్ మేనేజ్మెంట్ కోర్సు విద్యార్థిని (19)పై అదే హోటల్ ఉద్యోగి అక్షయ్ లైంగికదాడికి పాల్పడ్డాడు. 'ఇటీవల కొంతమంది స్నేహితులు కలిసి హోటల్ సమీప క్లబ్‌లో చేసుకున్న విందులో పాల్గొన్న అక్షయ్ తర్వాత ఆ యువతిని హోటల్ సమీప నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు' అని తెలిపారు.

**మైనర్‌పై అఘాయిత్యం**

**సీతాపూర్:** ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలో ఈ నెల 3న ఓ మైనర్ బాలిక (15)ను రూపేశ్, యోగేంద్ర అనే వ్యక్తులు చెరుకు తోటలోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశారు. ఆమె చేతులు, కాళ్లను తాళ్లతో కట్టేసి అక్కడే వదిలేసి పోయారు. ఆమె కోసం ఆమె తల్లిదండ్రులు, గ్రామస్థులు గాలించగా చెరుకుతోటలో కనిపించింది. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

**హిమాచల్‌ప్రదేశ్‌లో..**

**సిమ్లా:** హిమాచల్‌ప్రదేశ్‌లో మైనర్‌పై మైనర్ బాలుడు లైంగికదాడి జరిపాడు. బుధవారం కులూ జిల్లా బాలిక పాఠశాలకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. నిందితుడు 10వ తరగతి విద్యార్థి అని, అతడిపై పోస్కో చట్టం కింద కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

**మాజీ ప్రేమికురాలిపై లైంగిక వేధింపులు**

**బెంగళూరు:** బెంగళూరులో ఓ వ్యక్తి యువతి (29) ని హోటల్ గదిలో బంధించి లైంగికంగా వేధించిన ఘటన ఇటీవల జరిగింది. నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆ యువతి, కిరణ్ బిశ్వకర్మ అనే వ్యక్తి ప్రేమికులు. ఇటీవల వీరి ప్రేమబంధం తెగింది. కానీ, ఆమెను మభ్యపెట్టి హోటల్‌కు తీసుకెళ్లి కొట్టి, లైంగికంగా వేధించాడు. చివరికి అతడు నిద్రలోకి జారుకున్న సమయంలో తప్పించుకున్న యువతి ఫిర్యాదు చేయడంతో పోలీసులు అరెస్టు చేశారు.

**మూగ చెవిటి మహిళపై లైంగికదాడి యత్నం**

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లోని తూర్పు బర్ద్వాన్ జిల్లాలో ఓ లారీ డ్రైవర్ మూగ చెవిటి మహిళను అపహరించి క్యాబిన్‌లో తాళ్లతో కట్టేసి లైంగికదాడికి యత్నించాడు. కేకలు వినిపించడంతో ద్విచక్ర వాహనంపై అటు వెళ్తున్న ఓ వ్యక్తి.. డ్రైవర్‌ను కిందకు దిగాలన్నాడు. దీంతో డ్రైవర్ లారీని స్టార్ట్ చేసి వేగంగా ముందుకెళ్లాడు. ఆ వ్యక్తి ఇచ్చిన సమాచారంతో సదరు లారీని దాదాపు 15 కి.మీ. మేర వెంబడించి డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.


మైసూరులోని హున్సూరులో బారులుదీరిన ఓటర్లు

## కర్ణాటక ఉప ఎన్నికల్లో 66 శాతం పోలింగ్

**బెంగళూరు:** కర్ణాటకలో బీఎస్ యడియూరప్ప సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వానికి కీలకంగా భావిస్తున్న 15 అసెంబ్లీ స్థానాల్లో గురువారం పోలింగ్ ముగిసింది. 66.59% మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పలు స్థానాల్లో 2018 అసెంబ్లీ ఎన్నికల కంటే తక్కువ పోలింగ్ నమోదైంది. హోస్‌కోట్‌లో గరిష్ఠంగా 90.44%, అత్యల్పంగా కేఆర్ పురాలో 43.25% ఓటింగ్ నమోదైంది. కాంగ్రెస్, జేడీఎస్‌లకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, జూలైలో కుమారస్వామి సారథ్యంలోని జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ సర్కార్ పతనానికి కారణమైన 17 మంది ఎమ్మెల్యేలపై అప్పటి స్పీకర్ రమేశ్ కుమార్ అనర్హత వేటేయడంతో ఈ ఉప ఎన్నికలు అనివార్యమయ్యా యి. వీరిపై అనర్హత వేటు పడటంతో మైనారిటీలో పడ్డ కుమారస్వామి సర్కార్ పతనమై.. యడియూరప్ప సారథ్యంలో బీజేపీ ప్రభుత్వం కొలువు దీరింది. అయితే ఆయన ప్రభుత్వ మనుగడకు మరో ఆరుగురు ఎమ్మెల్యేలు అవసరం. ఈ 15 స్థానాల్లో కనీసం ఆరు స్థానాల్లో బీజేపీ గెలుపొందాల్సి ఉన్నందున ఈ ఎన్నికలకు ప్రాధాన్యం ఏర్పడింది.

## ట్రంప్‌కు పదవీగండం!

- చివరిదశకు చేరుకున్న అభిశంసన ప్రక్రియ
- ఈ పరీక్షలో నెగ్గుతాం: ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు పదవీగండం పొంచి ఉన్నది. ఆయన అభిశంసన ప్రక్రియ తుది దశకు చేరుకున్నది. ట్రంప్ తన విస్తృత అధికారాలను దుర్వినియోగం చేశారని, జాతీయ భద్రతను బలహీనం చేశారని, ఎన్నికల వ్యవస్థకు హాని కలుగజేశారని ఆరోపిస్తూ అమెరికా ప్రతినిధుల సభలో ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీ అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని స్పీకర్ నాన్సీ పెలోసి గురువారం సభాధ్యక్షుడికి సిఫారసు చేశారు. 'అమెరికా అధ్యక్షుడు మాకు మరో మార్గంలేకుండా చేశారు' అని ఆమె ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రతినిధుల సభలో డెమోక్రాటిక్ పార్టీకి మెజార్టీ ఉన్న నేపథ్యంలో తీర్మానం ఆమోదం పొందడం లాంఛనమేనని నిపుణులు చెప్తున్నారు. ఇదే జరిగితే అమెరికా చరిత్రలో అభిశంసనను ఎదుర్కొన్న మూడో అధ్యక్షుడిగా ట్రంప్ నిలువనున్నారు. 'మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. ట్రంప్ మరోసారి అక్రమంగా ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారు' అని నాన్సీ పేర్కొన్నారు. డెమోక్రాట్ల నిర్ణయాన్ని ట్రంప్ ఖండించారు. 'ఇదో దుస్సంప్రదాయం. ఇకపై అమెరికా అధ్యక్షుడిని బెదిరించేందుకు అభిశంసనను ఓ ఆయుధంగా వాడుకుంటారు. ఈ పరీక్షలో మేం నెగ్గుతాం' అని ట్రంప్ ట్వీట్ చేశారు.

## సివిల్స్‌లో ప్రాంతీయ భాషల హవా

**న్యూఢిల్లీ:** చాలా మంది అభ్యర్థులు ప్రాంతీయ భాషల్లో సివిల్స్ పరీక్షలు రాసి విజయం సాధిస్తున్నారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ రాజ్యసభలో తెలిపారు. 2018 సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 327 మంది ప్రాంతీయ భాషలను ఎంచుకొని విజయం సాధించారని చెప్పారు. యూపీలోని బలియా ఎంపీ వీరేంద్ర సింగ్ మాట్లాడుతూ వాహన రంగంలో మందగమనం ఉన్నదనడం సరికాదదన్నారు. ఒకవేళ ఇదే నిజమైతే రోడ్ల మీద ట్రాఫిక్ జాంలు ఎందుకు సంభవిస్తున్నాయని ప్రశ్నించారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో 106 రోజులపాటు తీహార్ జైలులో ఉండి బెయిల్‌పై విడుదలైన పీ చిదంబరం గురువారం రాజ్యసభకు హాజరయ్యారు. చర్చ అనంతరం రాజ్యసభ 'పన్నుల చట్టం సవరణ బిల్లు-2019'కి ఆమోదం తెలిపింది. మరోవైపు ప్రభుత్వం పార్లమెంట్‌లో పౌరసత్వ సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో దీనిపై కార్యాచరణ రూపొందించేందుకు 12 ప్రతిపక్ష పార్టీలు గురువారం సమావేశమై చర్చించాయి.

# ప్రధాని మౌనం ప్రభుత్వం గందరగోళం

- అయోమయంలో దేశ ఆర్థిక స్థితి
- చిదంబరం విమర్శలు
- తనపై నమోదైన కేసులో న్యాయమే గెలుస్తుందని వ్యాఖ్య


కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న చిదంబరం

**న్యూఢిల్లీ:** దేశంలో నెలకొన్న ఆర్థిక మాంద్యంపై కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం దేశ ఆర్థిక స్థితిపై అసమర్థంగా, కశ్మీర్‌పై అహంకారంగా వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నా ప్రధాని నోరు మెదపడం లేదని, ప్రభుత్వం తీవ్ర గందరగోళంలో ఉన్నదన్నారు. కేంద్ర మంత్రులు బుకాయింపులతో బడాయిలకు పోతున్నారని చెప్పారు. దాదాపు 106 రోజులు తీహార్ జైలులో గడిపిన చిదంబరం బుధవారం విడుదలైన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో, తిరిగి పార్లమెంట్ వద్ద గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వరుసగా గత ఆరు త్రైమాసికాల్లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)ని చూస్తే 8, 7, 6.6, 5.8, 5, 4.5గా నమోదైందని, దేశ ఆర్థిక పరిస్థితికి ఈ గణాంకాలు అద్దం పడుతున్నాయన్నారు. ఈ ఏడాది ఐదు శాతం జీడీపీతో ముగిస్తే అది అదృష్టమేనన్నారు. 'ప్రజల వద్ద డబ్బు లేక వారి కొనుగోలు శక్తి తగ్గింది. అనిశ్చితి, భయంతో వారిలో ఆకలి చచ్చిపోయింది' అని అన్నారు. ప్రజల నుంచి డిమాండ్ పెరిగే వరకూ ఉత్పత్తి పెరుగదన్నారు. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ఈ ప్రభుత్వం అసమర్థతతో గందరగోళాన్ని ఎదుర్కొంటున్నదని విమర్శించారు. నోట్ల రద్దు, లోపభూయిష్టమైన జీఎస్టీ, పన్ను ఉగ్రవాదం, స్వదేశీ వస్తు రక్షణ విధానం, నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రధానమంత్రి కార్యాలయంలో కేంద్రీకృతం కావడం వంటి వాటి విషయంలో ఈ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ సమర్థించుకుంటున్నదని దుయ్యబట్టారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏడు నెలలు గడిచిపోయినా బీజేపీకి చీమ కుట్టనట్టయినా లేదన్నారు. ఆర్థిక స్థితిని పుంజుకునేలా చేయగల ఆర్థిక మేధావులను ప్రభుత్వం వెలివేసిందన్నారు. యూపీఏ ప్రభుత్వం 2004-2014 మధ్య 14 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడవేసిందని.. కానీ ఎన్డీయే ప్రభుత్వం 2016 నుంచి కొన్ని లక్షల మందిని పేదరికంలోకి నెట్టిందని చిదంబరం ధ్వజమెత్తారు. మాంద్యం నుంచి ఆర్థిక వ్యవస్థను ఇప్పటికైనా బయటపడవేయవచ్చని, కానీ ఈ ప్రభుత్వానికి ఆ సామర్థ్యం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాన్ని విమర్శించడానికి ప్రజలు భయపడుతున్నారా? అని ప్రముఖ పారిశ్రామికవేత్త రాహుల్ బజాజ్ కేంద్ర హోంమంత్రిని ప్రశ్నించడాన్ని విలేకరులు ప్రస్తావించగా, 'అవును అంతటా భయాందోళనలు నెలకొన్నాయి. మీడియా కూడా భయం గుప్పిట్లోనే ఉంది' అని చిదంబరం పేర్కొన్నారు.

**నా ఆలోచనలన్నీ కశ్మీరీలపైనే**

జైలు నుంచి విడుదల కాగానే కశ్మీర్‌లోని 75 లక్షల మంది గురించే ఎక్కువగా ఆలోచించానని చిదంబరం చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 4 నుంచి కశ్మీరీల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారన్నారు. ప్రభుత్వం తనను అడ్డుకోకుంటే.. జమ్ముకశ్మీర్‌ను సందర్శిస్తానని తెలిపారు. కశ్మీర్‌పై ప్రభుత్వం దురుద్దేశపూరితంగా వ్యవహరించిందన్నారు. అక్కడి రాజకీయ నేతలపై ఏ అభియోగాలు లేకపోయినా నిర్బంధంలో ఉంచిందని,వారి స్వేచ్ఛ కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**బెయిల్ నిబంధనల ఉల్లంఘన: బీజేపీ**

కాంగ్రెస్ నేత చిదంబరం బెయిల్ నిబంధనలను ఉల్లంఘించారని బీజేపీ ఆరోపించింది. బెయిల్ విడుదలైన మరునాడే మంత్రిగా తన రికార్డు నిష్కళంకంగా ఉన్నదని చిదంబరం చేసిన వ్యాఖ్యలు బెయిల్ నిబంధనలను ఉల్లంఘించడమేనన్నది. ఆర్థిక మంత్రి గా ఉన్నప్పుడు ఆయన అవినీతి పాల్పడ్డారన్నదే ఆయనపై నమోదైన కేసు అని బీజేపీ గుర్తు చేసింది. తాను నిష్కళంకుడినని తనకు తాను సర్టిఫికెట్ ఇచ్చుకుంటున్నారని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ విమర్శించారు.

### చెక్కబల్లపై నిద్రతో శారీరకంగా బలపడ్డా

జైలు జీవితం తనలో మరింత ఆత్మ స్థైర్యం నింపడంతోపాటు శారీరకంగానూ బలపడ్డానని చిదంబరం చెప్పారు. తాను తీహార్ జైలులో గడపడం వల్ల తన మెడ, నడుము, వెన్నెముక పటిష్ఠం అయ్యాయని చెప్పారు. దిండు లేకుండా చెక్క బల్లపై పడుకోవడంతో మెడ, వెన్నెముక, నడుము బలపడుతాయన్నారు. బెయిల్ నిబంధనలను దృష్టిలో ఉంచుకున్న చిదంబరం.. తన కేసు విషయమై మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. కోర్టులు న్యాయం చేస్తాయని, అంతిమంగా న్యాయమే గెలుస్తుందన్నారు. మంత్రిగా తన రికార్డు, తన ఆత్మసాక్షి తేటతెల్లగా ఉన్నాయన్నారు. ఈ విషయం తనతో కలిసి పనిచేసిన అధికారులకు, వాణిజ్యవేత్తలకు, తనను పరిశీలించిన జర్నలిస్టులకు కూడా తెలుసునన్నారు. తాము ప్రతీకార రాజకీయాలకు పాల్పడబోమని స్పష్టం చేశారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో అరెస్టయిన చిదంబరానికి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

## పెరల్ హార్బర్‌లో కాల్పులు

- ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు.. నిందితుడి ఆత్మహత్య
- ఘటనాస్థలంలోనే ఉన్న వాయుసేన అధిపతి భదౌరియా సురక్షితం


కాల్పుల్లో గాయపడిన వ్యక్తిని దవాఖానకు తరలిస్తున్న సిబ్బంది

**హవాయి/న్యూఢిల్లీ:** అమెరికాలోని హవాయిలో గల చారిత్రక పెరల్ హార్బర్‌లో ఓ అమెరికా సైనికుడు జరిపిన కాల్పుల్లో ఇద్దరు పౌరులు మరణించగా, మరొకరు గాయపడ్డారు. తర్వాత నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుడు భారత వైమానిక దళాధిపతి భదౌరియా అక్కడే ఉన్నారు. భారత బృందమంతా సురక్షితమని వైమానికదళ అధికారులు తెలిపారు. పెరల్‌హార్బర్‌లో నిర్వహిస్తున్న పసిఫిక్ దేశాల వైమానిక దళాధిపతుల సమావేశంలో (పీఏసీఎస్-2019) పాల్గొనేందుకు భదౌరియా అక్కడికి వెళ్లారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు అమెరికా నౌకాదళ సెయిలర్ ఒకరు ముగ్గురు కూలీలపై కాల్పులు జరిపి, నిందితుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. 1941 డిసెంబర్ 7న జపాన్ సైన్యం పెరల్‌హార్బర్‌పై దాడిచేయడంతో రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొంటున్నట్టు అమెరికా ప్రకటించింది. ఆ దాడికి గుర్తుగా ఈ నెల 7న ప్రత్యేక కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతుండగా కాల్పులు జరిగాయి.

## ఉల్లి.. లొల్లి!

- పెరిగిన ధరలపై పార్లమెంట్‌లో, బయట దుమారం


ఉల్లిగడ్డల కోసం పాట్నాలో బారులుదీరిన ప్రజలు

**న్యూఢిల్లీ:** ఆకాశాన్నంటుతున్న ఉల్లిగడ్డల ధరలు ఓవైపు సామాన్యుడిని హడలగొడుతుంటే.. మరోవైపు ఈ అంశం పార్లమెంట్‌లో, బయట రాజకీయ దుమారం రేపుతున్నది. 'నేను ఉల్లిగడ్డలు ఎక్కువగా తినను' అంటూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ బుధవారం చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు గురువారం ఢిల్లీలో ఉల్లిధర రూ.109 పలికింది. ఈ నేపథ్యంలో గురువారం పార్లమెంట్‌లో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఉల్లిగడ్డల లొల్లి నడిచింది. ఈ సంవాదం ఎలా ఉన్నదంటే..

- ఆర్థిక మంత్రి ఉల్లిగడ్డలు ఎక్కువగా తినొద్దని సూచిస్తున్నారు. మరి ఆమె అవొకాడో పండ్లు తింటుందా?. ఉల్లి కొరతను కేంద్రం ముందుగానే అంచనావేసి, వెంటనే చర్యలు చేపట్టాల్సింది. **– పీ చిదంబరం**
- మా ప్రభుత్వం అమలుచేస్తున్న ఉజ్వల, జన్‌ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు పేదల కోసం కాదా?. ఉల్లి ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. 2012లో బియ్యం ధరలు విపరీతంగా పెరిగినప్పుడు 'వాటర్ బాటిల్ కోసం రూ.20 ఖర్చు చేసే స్థోమత ఉన్న పట్టణవాసులు కూడా బియ్యం ధరల పెరుగుదల గురించి అనవసర హడావుడి చేస్తున్నారు' అంటూ అప్పటి ఆర్థికమంత్రి (చిదంబరం) వ్యాఖ్యానించారు. 2005లో ప్రజలు బ్యాంకుల్లోని తమ డబ్బు విత్‌డ్రా చేసుకున్నా పన్ను విధించారు. **– నిర్మలా సీతారామన్, ఆర్థిక మంత్రి**
- మీరు (నిర్మల) ఉల్లిగడ్డలు తింటారా? లేదా? అని ఎవరూ అడుగలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ ఎందుకు తడబడుతున్నదని అడుగుతున్నాం. **– రాహుల్‌గాంధీ**
- యూపీలోనూ ఉల్లిగడ్డలు బాగా పండుతాయి. కావాలంటే ప్రతిపక్ష నేతలకు రూ.25కు కిలో చొప్పున లారీ లోడు ఉల్లిగడ్డలు అందించేందుకు సిద్ధంగా ఉన్నా. **– వీరేంద్ర సింగ్ మస్త్, బలియా ఎంపీ**
- నేను శాఖాహారిని. నేను ఇప్పటివరకు ఉల్లిగడ్డలు తినలేదు. కాబట్టి నాలాంటివాడికి మార్కెట్‌లో ఉల్లిగడ్డల పరిస్థితి ఎలా తెలుస్తుంది. **– అశ్విని దూబే, కేంద్ర సహాయ మంత్రి**

## అది 'అంతిమ తీర్పు' కాదు

శబరిమల ఆలయంలోకి మహిళల అనుమతిపై సుప్రీంకోర్టు వ్యాఖ్య


శబరిమలలో భద్రతను తనిఖీ చేస్తున్న పారామిలిటరీ సిబ్బంది

**న్యూఢిల్లీ:** కేరళలోని శబరిమలలోగల అయ్యప్ప గుడిలోకి 50 ఏండ్లలోపు మహిళల ప్రవేశానికి అనుమతినిస్తూ గతేడాది ఇచ్చిన తీర్పు 'అంతిమ తీర్పు' కాదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టంచేసింది. ఆ కేసుపై ఇప్పుడు ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం విచారణ జరుపనుందన్నది. బిందు అమ్మిని అనే భక్తురాలు అయ్యప్ప గుడిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా కొందరు అడ్డుకున్నారని, ఇది కోర్టు తీర్పును ధిక్కరించడమేనని సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ తెలిపారు. దీనిపై చీఫ్ జస్టిస్ ఎస్ఏ బోబ్డే సారథ్యంలోని ధర్మాసనం స్పందిస్తూ, 2018లో ఇచ్చిన తీర్పు అంతిమం కాదని, దీని పరిశీలనకు ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి ఇటీవలే నివేదించామని, దానిపై ఇంకా తుది తీర్పు వెలువడలేదని పేర్కొంది. శబరిమల ఆలయంపై ఇచ్చిన చారిత్రక తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గత నవంబర్‌లో నాటి చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపి.. 2018లో ఇచ్చిన తీర్పును సమీక్షించేందుకు ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటుచేయాలని 3:2 మెజారిటీతో నిర్ణయించింది.



పీఏసీ చైర్మన్ అక్బరుద్దీన్ ఒవైసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్పీకర్ పోచారం, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి. చిత్రంలో మంత్రి నిరంజన్‌రెడ్డి కూడా ఉన్నారు.

## అసెంబ్లీ కమిటీల్లో భిన్నమైనది పీఏసీ

ఆయా శాఖల ఖర్చు లెక్కగట్టడం కమిటీ ప్రధాన విధి

స్పీకర్ పోచారం, మండలి చైర్మన్ గుత్తా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వాల పనితీరు పారదర్శకంగా ఉండాలని, ఇష్టారీతిన ఖర్చుచేయడం కుదరదని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ భవనంలోని కమిటీహాల్‌లో జరిగిన అసెంబ్లీ ప్రభుత్వ లెక్కల కమిటీ (పీఏసీ) సమావేశంలో పోచారం మాట్లాడారు. పీఏసీ కమిటీకి ప్రతిపక్ష నేతను చైర్మన్‌గా నియమించడం ఆచారమని, ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్‌గా నియమితులైన అక్బరుద్దీన్ ఒవైసీకి శుభాకాంక్షలు తెలిపారు. పీఏసీ శాసనసభలో మిగిలిన కమిటీలన్నింటి కంటే భిన్నమైనదని పేర్కొన్నారు. సభలో పెట్టిన బడ్జెట్‌కు అనుగుణంగా ఆయాశాఖలు ఖర్చుచేస్తున్నాయా? లేదా? అని పరిశీలించి పీఏసీ.. ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుందని తెలిపారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఏసీ రెగ్యులర్‌గా ప్రభుత్వశాఖలతో సమావేశమవుతూ, ఖర్చుచేసిన నిధుల వివరాలతోపాటు సలహాలు, సూచనలు అందించాలని చెప్పారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఏసీ కీలకమైనదేకాక ఎంతో బాధ్యతాయుతమైన కమిటీ అన్నారు. ప్రభుత్వం చేసే ఖర్చును ప్రశ్నించే అధికారం పీఏసీ ద్వారా ప్రతిపక్ష నేతకు ఉంటుందని చెప్పారు. అక్బరుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పీఏసీ సభ్యులు జైపాల్‌యాదవ్, రమావత్ రవీంద్రకుమార్, డీ శ్రీధర్‌బాబు, సండ్ర వెంకట వీరయ్య, బిగాల గణేశ్‌గుప్తా, గడ్డిగారి విఠల్‌రెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గాదరి కిషోర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సయ్యద్ జాఫ్రీ, డీ రాజేశ్వర్‌రావు, డిప్యూటీ అకౌంట్ జనరల్ సంతోష్ దాస్రే, అసెంబ్లీ డిప్యూటీ సెక్రటరీ పాల్గొన్నారు. ఈసం దర్భంగా పీఏసీ చైర్మన్, సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.


**తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్**
రిజిస్టర్డ్ కార్యాలయం: 6-3-655/1/A, సివిల్ సప్లయ్స్ భవన్, సోమాజిగూడ, హైదరాబాద్-82

No.Mktg/M2/3899/2019-20 సవరణ Dt: 05-12-2019

తేది.05-12-2019 రోజున ప్రచురించబడిన టెండరులో 6,00,000 మెట్రిక్ టన్నుల ముడి బియ్యం మరియు 37,500 మెట్రిక్ టన్నుల ఫ్రైన్స్ రూపంలో 1,50,000 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం మరియు 1,12,500 మెట్రిక్ టన్నుల ముడి బియ్యం సరఫరాగా ప్రచురించబడినది. దీనిని ఈ క్రింది విధంగా సవరించి చదువవలెను. "6,00,000 మెట్రిక్ టన్నుల ముడి బియ్యం మరియు 1,50,000 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం (37,500 మెట్రిక్ టన్నుల ఫ్రైన్స్, 1,12,500 మెట్రిక్ టన్నుల ముడి బియ్యం రూపంలో) సరఫరా కొరకు ఈ-బిడ్డింగ్ పిలువబడం జరిగినది". మిగతా సమాచారంలో ఎటువంటి మార్పు లేదు. Sd/-, VC & Managing Director



**తెలంగాణ ప్రభుత్వం**
**ప్రాంతీయ అధికారి కార్యాలయం PR నల్గొండ**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

NIT.No. PR/101 to 107/2019-20 తేది: 29.11.2019

పనుల సంఖ్య: (7). పనుల పేరు: దిగువ సంతకందారు పరిధిలోని కోదాడ ఆఫ్ రేవూర్ PWD రోడ్డు, R/F రాఘవాపురం నుండి రేవూర్ R&B రోడ్డు, R/F NH9 ముకుందపురం నుండి ఏకలప్యనిపేట్, R/F కొత్తగూడెం నుండి గొండ్రియాలపై BT ఏర్పాటు మరియు ఇతర సివిల్ పనులు **మొత్తం ECV: రూ. 8.09 కోట్లు.** టెండర్ల డౌన్‌లోడ్ ప్రారంభ తేది, సమయం: 16.12.2019 టెండర్ల డౌన్‌లోడ్ ముగింపు తేది, సమయం: 23.12.2019. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in దర్శించండి. ఇ-మెయిల్ ID: seprnlgd@gmail.com

సం/- ప్రాంతీయ అధికారి, ప్రాంతీయ కార్యాలయం PR నల్గొండ

DIPR RO. No. 1866-DP/CL/Advt/1/2019-20, Dt: 05/12/2019



**తెలంగాణ ప్రభుత్వం**
**అటవీ శాఖ**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**

T.No. 01/2019-20/A4, తేది: 04.12.2019

పనుల సంఖ్య: (4) పనుల పేరు: దిగువ సంతకందారు పరిధిలోని అమ్రాబాద్ డివిజన్ యొక్క పటవర్లపల్లి, ఈగలపెంట సెక్షన్, సోమచెల్మ సెక్షన్ యొక్క మద్దిమడుగు మరియు అమ్రాబాద్ వద్ద ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ మరియు బీట్ ఆఫీసర్ కొరకు రెసిడెన్షియల్ క్వార్టర్ నిర్మాణం. **మొత్తం ECV: రూ. 1.13 కోట్లు.** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్: 09.12.2019న మ. 1.00 గం|| నుండి. టెండరు దాఖలు కొరకు చివరి తేది: 27.12.2019న మ. 1.00 గం|| వరకు. సాంకేతిక బిడ్ తెరుచుట: 27.12.2019న మ. 3.30 గం||. ధర బిడ్ తెరుచుట: 27.12.2019న సా. 4.00 గం||. తదుపరి వివరాలను https://tender.telangana.gov.in నుండి పొందవచ్చును.

సం/- జిల్లా అటవీ అధికారి, నాగర్‌కర్నూల్

DIPR RO. No. 1865-DP/CL/Advt/1/2019-20, Dt: 05/12/2019



**తెలంగాణ ప్రభుత్వం**
**రోడ్లు మరియు భవనాల శాఖ (NHW)**
**e- ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

NIT No.15(1 to 5)/SE(R&B)NH/NH 563/KNR/1-5/2019-20 తేది: 04-12-2019.

పనుల సంఖ్య(5) పనుల పేరు:1 కరీంనగర్ జిల్లాలో 2019-20సం|| కొరకు కి.మి. 63/1-8, 64/1-4, 64/6-65/2, 65/5-66/0, 66/1-5, 66/6-8, 66/9-67/0, 67/7-69/0, 69/1-69/4, 69/5-9 వరకు NH 563కు ER (జగిత్యాల-కరీంనగర్-వరంగల్ రోడ్). 2.కరీంనగర్ జిల్లాలో 2019-20 సం||కొరకు కి.మి. 70/3-5, 71/4-5, 71/8-72/3, 72/5-9, 73/2-6, 73/8-74/2, 75/0-2, 75/5-76/2, 77/1-4, 77/7-8 వరకు NH 563కు ER (జగిత్యాల-కరీంనగర్-వరంగల్ రోడ్). 3.కరీంనగర్ జిల్లాలో 2019-20 సం||కొరకు కి.మి. 78/1-9, 79/2-3, 79/5-7, 79/9-80/0, 80/1-4, 80/5-7, 80/9-81/3, 81/5-8, 82/2-5, 82/7-83/0, 83/7-84/0 వరకు జగిత్యాల - కరీంనగర్-వరంగల్ రోడ్‌కు ER. 4. కరీంనగర్ జిల్లాలో 2019-20 సం|| కొరకు కి.మి. 84/1-6, 85/1-2, 85/5-8, 86/3-4, 86/5-9, 91/8-10, 95/1-5, 97/2-4, 97/7-10, 98/1-5, 99/0-2, వరకు జగిత్యాల-కరీంనగర్ - వరంగల్ రోడ్ వరకు ER. 5. కరీంనగర్ జిల్లాలో 2019-20 సం||కొరకు కి.మి. 93/0-94/0, 96/0-8, 100/0-2 100/4-8 వరకు జగిత్యాల - కరీంనగర్ - వరంగల్ రోడ్‌కు ER. NIT యొక్క తదుపరి వివరాలను తేది: 07-12-2019న మ|| 3.00 గం|| నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ మార్కెట్ ప్లేస్ అనగా "www.tender.telangana.gov.in" వద్ద చూడవచ్చు.

DIPR R.O.No. 1867-DP/CL/ Advt/1/2019-20, Dt: 05/12/2019 సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) NH సర్కిల్, కరీంనగర్.



**TELANGANA STATE**
**BOARD OF INTERMEDIATE EDUCATION**
**'VIDYA BHAVAN', NAMPALLY, HYDERABAD**

Tender No. : 923/C-26/OMR/2019-20 Dated : 05-12-2019

**TENDER NOTIFICATION**

The Secretary, Telangana State Board of Intermediate Education, Hyderabad desires to select a Printing Agency for **Printing and supplying of OMR Bar-coded Sheets for the year 2019-20** (Intermediate Public Examinations, March 2020 & Intermediate Public Advanced Supplementary Examinations, May 2020). The Bidders willing to participate in this tender may visit e-procurement portal. **https://tender.telangana.gov.in**

| PARTICULARS | DETAILS |
|---|---|
| Date of commencement of Tender | 06-12-2019 (from 1:00 P.M.) |
| Date of Pre-Bid conference | 09-12-2019 (at 11:30 A.M.) |
| Last date for submission of Bid on e-portal | 20-12-2019 (before 3.00 P.M.) |

Sd/- Sri Syed Omer Jaleel, I.A.S., Secretary



**RITES లిమిటెడ్**
(భారత ప్రభుత్వరంగ సంస్థ) CIN నం. L74899DL1974GOI007227
ప్రాంతీయ ప్రాజెక్ట్ కార్యాలయం (దక్షిణం) సికింద్రాబాద్

**ఇ-టెండర్లు కోరుతూ ప్రకటన**

క్లయింట్ TS GENCO తరఫున, జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) RPO-సికింద్రాబాద్, RITES లిమిటెడ్ వారు దిగువ పని కోసం రెండు ప్యాకెట్ విధానంలో ఆన్‌లైన్ పర్సంటేజీ రేట్ బిడ్లు కోరుతున్నారు. **NIT No. RITES/SC/BTPS/EW/మణుగూరు/2019-20 తేది: 5-12-2019. పని పేరు: (4x270MW) BTPS, మణుగూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోసం రైల్వే సైడింగ్ మరియు మార్షలింగ్ యార్డ్ కోసం వంతెనల నిర్మాణం మరియు ఫార్మేషన్ (కటింగ్ & ఒడ్డు వేయుట)లో మట్టి పని. అంచనా వ్యయం: రూ.** 29,97,26,830.05. **బయానా: రూ.** 60,94,537/-, **పూర్తి చేయు కాలం:** 9 నెలలు. **బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం:** 27-12-2019న 10.30గం.లు.

బిడ్ ఫారాలు మరియు ఇతర వివరాలను వెబ్‌సైట్: **https://etenders.gov.in/eprocure/app** నుండి పొందవచ్చును.

అనుబంధం/సవరణ ఏవైన వుంటే ఆన్‌లైన్‌లో మాత్రమే వుంచబడతాయి.



**ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయము**
**పరిపాలనా కార్యాలయం : రాజేంద్రనగర్, హైదరాబాద్-30**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**
**NIT No. 11/PJTSAU/EO/TA/2019-20, తేది: 05-12-2019**
**10 నం.ల పనులు, ECV-రూ. 1073.95 లక్షలు**

| | |
|---|---|
| బిడ్ దాఖలు ప్రారంభ తేది మరియు సమయం | 06-12-2019న సా. 5.00 గం. |
| బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం | 20-12-2019న సా. 5.00 గం. |
| ధర బిడ్ తెరుచు తేది (క్రమ సంఖ్య 01 నుండి 09 కొరకు) | 21-12-2019న ఉ. 11.30 గం. |
| సాంకేతిక బిడ్ తెరుచు తేది (క్రమ సంఖ్య 10 కొరకు) | 21-12-2019న ఉ. 11.30 గం. |
| ధర బిడ్ తెరుచు తేది (క్రమ సంఖ్య 10 కొరకు) | 23-12-2019న ఉ. 11.30 గం. |

సంప్రదించు అధికారి : **ఎస్టేట్ అధికారి**
సంప్రదించు వివరాలు: **040-24015315 & 040-24015011** Extn:**347**
తదుపరి వివరాల కొరకు **https://tender.telangana.gov.in** దర్శించగలరు

సం/ ఎస్టేట్ అధికారి



**తెలంగాణ ప్రభుత్వం**
**జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, యాదాద్రి భువనగిరి**

**SHORT TENDER**

**టెండర్ నోటీస్ నెం.సి/01/సి.యం.గిరివికాసం/2019** **తేది : 05.12.2019**

యాదాద్రిభువనగిరి జిల్లా, డి.ఆర్.డి.ఓ, డి.ఆర్.డి.ఏ, సి.యం. గిరివికాసం పథకము అమలులో భాగంగా షార్ట్ టెండర్ ప్రక్రియ ద్వారా సబ్‌మెర్సిబుల్ పంప్‌సెట్‌లు సరఫరా చేయుటకు ఉత్పత్తి/ సప్లయిదారుల నుండి ధరఖాస్తులు కోరబడుచున్నవి.

రూ. 2,500/- (రూపాయలు రెండు వేల ఐదువందలు నాన్ రిఫండబుల్) డి.డి రూపంలో డి.ఆర్.డి.ఓ, డి.ఆర్.డి.ఏ, యాదాద్రిభువనగిరి గారి పేరున చెల్లించి క్రింద చూపబడిన తేదిలలో కార్యాలయ వేళలో ధరఖాస్తు ఫారంను పొందవచ్చును. **EMD** రూ. 1,00,000/-ల డి.డి ని డి.ఆర్.డి.ఓ, డి.ఆర్.డి.ఏ, యాదాద్రి భువనగిరి గారి పేరు మీద తీసి అప్లికేషన్‌తో పాటు సమర్పించగలరు. (1) టెండర్ షెడ్యూల్ జారీ చేయు తేది : 06.12.2019 (2) టెండర్ షెడ్యూల్ జారీ చేయుటకు చివరి తేది : 16.12.2019 సా. 2 :00 గం|| వరకు (3) టెండర్ షెడ్యూల్ సమర్పించుటకు చివరి తేది : 16.12.2019 సా. 3:00 గం|| వరకు (4) టెండర్ షెడ్యూల్ తెరుచు తేది: 16.12.2019 సా. 4:00 గం|| వరకు. ఇతర వివర ములకు ఫోన్ నెం. 9121210706.

సం/- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి
డి.ఆర్.డి.ఏ, యాదాద్రి భువనగిరి.


## జపాన్ వర్సిటీలతో ఐఐటీహెచ్ ఒప్పందాలు

**కంది:** రాబోయే రోజుల్లో భూకంపాల నివారణ, డాక్టోరల్ అంశాలపై ఎలా కలిసికట్టుగా పనిచేయాలనే విషయాలపై ఐఐటీ హైదరాబాద్ జపాన్ దేశంలో నాలుగు యూనివర్సిటీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నది. జపాన్ పర్యటనకు వెళ్లిన ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి.. ఆ దేశానికి చెందిన ఎర్త్‌క్వేక్ డిజాస్టర్ మిటిగేషన్ రీసెర్చ్, గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సైఇతామా యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెటీరియల్ సైన్స్ అనే నాలుగు వర్సిటీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందాల వల్ల తమ పరిశోధనలో కొంతభాగాన్ని జపాన్‌లో కొనసాగించడానికి ఐఐటీహెచ్ విద్యార్థులకు వీలవుతుందన్నారు. భవిష్యత్‌లో డాక్టోరల్ ప్రోగ్రాంను కలిగి ఉండటానికి ఇది దోహదపడుతుందని, విద్యార్థులు రెండు సంస్థల డాక్టోరల్ డిగ్రీలతో ప్రయోజనం పొందుతారని చెప్పారు. భూకంప నిరోధక భవనాల నిర్మాణాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం, పరిశోధనల్లో నాణ్యతను పెంచడానికి ఒప్పందాలను కుదుర్చుకున్నట్టు వివరించారు.



జపాన్ ప్రతినిధితో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

హన్మకొండలోని వెయ్యిస్తంభాల దేవాలయంలో ఈ నెల 15 నుంచి 21 వరకు జరిగే అతి రుద్రయాగం, సుదర్శన హోమానికి రావాలని త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్‌స్వామిని యాగ నిర్వాహకులు గురువారం ఆహ్వానించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు, తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, బ్రాహ్మణ సంఘం నాయకులు అవధానుల మోహన్‌శర్మతోపాటు పలువురు జీయర్ స్వామిని కలిశారు.
-హైదరాబాద్, నమస్తే తెలంగాణ





# బీసీలకు ఆత్మగౌరవం

- కులసంఘ భవనాలకు వేలకోట్ల విలువైన స్థలాలు
- బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్
- భవన నిర్మాణాల్లో కుల పెద్దలకు భాగస్వామ్యం
- ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి



రంగారెడ్డి జిల్లా కోకాపేటలో 13 కులాల ఆత్మగౌరవ భవనాలకు కేటాయించిన స్థలాలను పరిశీలిస్తున్న మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నారదాసు, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్/మణికొండ, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి రాష్ట్రంలో బీసీలపై చిన్నచూపు ఉండేదని, సీఎం కేసీఆర్ పాలనలో వెనుకబడిన కులాలు ఆత్మగౌరవంతో బతుకుతున్నాయని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కోకాపేటలో 13 కులాల ఆత్మగౌరవ భవనాలకు కేటాయించిన స్థలాలను మంత్రులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. బీసీల ఆత్మగౌరవం పెంచడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ హైదరాబాద్ శివారులో రూ.మూడు వేల కోట్ల విలువైన స్థలాలను బీసీ కులసంఘాల ఆత్మగౌరవ భవనాలకోసం ఇచ్చారని చెప్పారు. 80 ఎకరాల భూమి, భవనాల నిర్మాణానికి రూ.80 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 50 శాతానికిపైగా ఉన్న బీసీలను ఉమ్మడిరాష్ట్రంలోని ప్రభుత్వాలు ఓటుబ్యాంకులా చూశాయని, ఇప్పుడా పరిస్థితి లేదని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ బీసీ కులవృత్తులను ప్రోత్సాహిస్తున్నారని పేర్కొన్నారు. బీసీ కులాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణంలో కులసంఘాల పెద్దలను, అధికారులను భాగస్వాములను చేస్తామని చెప్పారు. భవనాలకు కావాల్సిన ఏర్పాట్లన్నీ చేద్దామని మంత్రి కేటీఆర్ చెప్పారని శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. ఆత్మగౌరవ భవనాలను వివాహ వేడులకు, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా, విద్యార్థుల వసతి గృహాలుగా, హైదరాబాద్ వచ్చినపుడు ఉండేలా నిర్మించాలని సీఎం కేసీఆర్ సూచించారని వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదికను ముఖ్యమంత్రికి అందజేస్తామని, ఈ ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. భవనాల పరిశీలనలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, జలవనరుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్, బీసీ సంక్షేమశాఖ కమిషనర్ అనితారాజేంద్రన్, అదనపు కార్యదర్శి సైదా, రాజేంద్రనగర్ ఆర్డీవో చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ దవాఖానలో బాలుడి కిడ్నాప్!

ప్రత్యేక బృందాలతో గాలింపు



దీపక్ (ఫైల్)

**సికింద్రాబాద్, నమస్తే తెలంగాణ:** గాంధీ దవాఖానలో ఏడాదిన్నర బాలుడు కిడ్నాపయ్యాడని కలకలం రేగింది. కుటుంబసభ్యులు కిడ్నాప్ అంటుండగా.. పోలీసులు మాత్రం తప్పిపోయాడని చెప్తున్నారు. మౌలాలికి చెందిన తుకారాం ఓ నేరంలో చంచల్‌గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. అతని భార్య రాధిక, ఏడాదిన్నర కుమారుడు దీపక్‌తో గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న బంధువును చూడటానికి వచ్చారు. బంధువులతోపాటు దవాఖానలోని వెయిటింగ్ రూమ్‌లోనే ఉంటున్నారు. గురువారం తెల్లవారుజామున 4 గంటల నుంచి దీపక్ కనిపించకుండా పోయాడు. గుర్తుతెలియని వ్యక్తులు తన కుమారుడిని కిడ్నాప్ చేశారని తల్లి రాధిక చిలుకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. సీసీ కెమెరాల పుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు.

# కారులో మంటలు.. మహిళ సజీవ దహనం

- తప్పించుకున్న మృతురాలి భర్త, ఇద్దరు పిల్లలు
- కర్ణాటకలోని మన్నెకెళ్లి వద్ద ఘటన



కర్ణాటకలోని బీదర్ జిల్లా నిర్ణ చౌరస్తా సమీపంలో హైవేపై కాలిపోతున్న కారు



ప్రమాదం నుంచి బయటపడిన ఉదయ్‌కుమార్, పిల్లలు జీవన్‌కుమార్, గగన్‌కుమార్

**జహీరాబాద్, నమస్తే తెలంగాణ:** కారులో మంటలు వ్యాపించి ఓ మహిళ సజీవ దహనమైన విషాద ఘటన కర్ణాటకలోని బీదర్ జిల్లా మన్నెకెళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం చోటుచేసుకున్నది. మన్నెకెళ్లి ఎస్సై సునీత వెల్లడించిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున కర్ణాటకలోని హుమ్నాబాద్ నుంచి కారులో ఉదయ్‌కుమార్, అతని భార్య కల్యాణి (39), పిల్లలు జీవన్‌కుమార్ (10), గగన్‌కుమార్ (8) హైదరాబాద్‌కు బయలుదేరారు. ఉదయం 7:30 గంటలకు జాతీయ రహదారిపై నిర్ణ చౌరస్తా వద్దకు చేరుకోగానే కారులో పొగలువచ్చాయి. ఉదయ్‌కుమార్ రోడ్డు పక్కన కారును నిలిపి బాయ్‌నెట్ లేపి చూస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించి కారులో ఉన్న కల్యాణి (39) సజీవ దహనమయ్యారు. ఉదయం చలి ఎక్కువగా ఉండటంతో కారులో ఉన్న ఏసీలో వేడితో పొగలు వచ్చాయి. మృతురాలి భర్త, ఇద్దరు కుమారులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. కల్యాణికి వెన్నెముక నొప్పి ఉండటంతో ఆయుర్వేద మందుల కోసం మహారాష్ట్రలోని ఉద్గిర్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాత్రి కావడంతో హుమ్నాబాద్‌లో కారులోనే నిద్రించారు. గురువారం ఉదయం కారులో హైదరాబాద్‌కు ప్రయాణం కాగా, మన్నెకెళ్లి శివారులో ఈ ప్రమాదం జరిగింది. మృతురాలి స్వస్థలం ఏపీలోని కృష్ణా జిల్లా మచిలీపట్నంగా తెలుస్తున్నది.

## బాల్స్‌రూపంలో బంగారం స్మగ్లింగ్

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుకున్న డీఆర్‌ఐ అధికారులు
- 1.4 కిలోల బంగారం స్వాధీనం





గురువారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డీఆర్‌ఐ అధికారులు స్వాధీనం చేసుకున్న బాల్స్‌రూపంలోని బంగారం.. టేప్ అతికించిన బాల్స్ బంగారం

**శంషాబాద్:** సినీఫక్కీలో బంగారాన్ని బాల్స్‌గా చుట్టి స్మగ్లింగ్‌కు యత్నించిన ముగ్గురిని డీఆర్‌ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు గురువారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 48,49,062 లక్షల విలువ చేసే 1.4 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబై నుంచి హైదరాబాద్ వస్తున్న ఎయిర్ ఇండియా ఎయిర్‌లైన్స్ విమానం ఏఐ50లో ముగ్గురు ప్రయాణికులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా టేప్‌తో చుట్టిన నాలుగు బాల్స్‌లో బంగారం పట్టుబడింది. నిందితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.



గురువారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

## యాసంగికి ఎరువుల అంచనాలు

ఉల్లిసాగు పెంపుపై దృష్టి సారించాలి: మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాసంగిలో అవసరమైన ఎరువుల అంచనాలను రూపొందించాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. యాసంగి ఎరువుల నిల్వ, పత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నిర్వహణ, విత్తన సరఫరాపై గురువారం వ్యవసాయ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. యాసంగి సీజన్ అవసరాలకు అనుగుణంగా ఈ నెల చివరి నాటికి 2.25 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను బఫర్‌స్టాక్‌గా ఉంచాలని మంత్రి సూచించారు. ఉల్లిసాగు పెంపుపై దృష్టి సారించాలని, రైతులను ప్రోత్సహించేందుకు సబ్సిడీ ఉల్లి విత్తనాలు ఇచ్చే ఆలోచన ఉన్నట్టు మంత్రి తెలిపారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, కమిషనర్ రాహుల్‌బొజ్జా, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ భాస్కరాచారి, తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత శాటిలైట్ ఫోన్‌తో చిక్కిన అమెరికన్



**శంషాబాద్:** నిషేధిత శాటిలైట్ ఫోన్ కలిగి ఉన్న ఓ అమెరికన్‌ను గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. అమెరికాకు చెందిన రాబర్ట్‌స్కాట్ (50) యూఎస్‌ఏ యాపిల్ కంపెనీ సేఫ్టీ మేనేజర్. అతడు హైదరాబాద్ నుంచి సింగపూర్ వెళ్లేందుకు ఎయిర్‌పోర్టు వచ్చాడు. సీఐఎస్‌ఎఫ్ భద్రతాధికారులు అతడిని సోదాచేయగా భారత్‌లో నిషేధించిన శాటిలైట్ ఫోన్ లభించింది. ఆ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని ఆర్జీఐఏ పోలీసులకు అతడిని అప్పగించారు.

## ఎస్‌ఆర్‌ఎం వర్సిటీకి స్వచ్ఛ ర్యాంకింగ్ అవార్డు

**కాట్టాంకులత్తూరు:** తమిళనాడు కొట్టాంకులత్తూరులోని ఎస్‌ఆర్‌ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ రెసిడెన్షియల్ యూనివర్సిటీ క్యాటగిరీలో ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నుంచి స్వచ్ఛ ర్యాంకింగ్ అవార్డు గెలుచుకున్నది. ఢిల్లీలోని ఏఐసీటీఈ ప్రధాన కార్యాలయంలో ఈ నెల మూడున జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఆర్ సుబ్రమణ్యం నుంచి ఎస్‌ఆర్‌ఎం ఐఎస్టీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్ సేతురామన్, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ జీ అగస్టియన్ మణిరాజ్ పాండ్యన్, ఢిల్లీ ఎన్సీఆర్ క్యాంపస్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్ విశ్వనాథం అవార్డు అందుకున్నారు. ఏఐసీటీఈలోని 6,900 వర్సిటీల్లో క్లీన్, స్మార్ట్ క్యాంపస్ అవార్డుల్లో ఎస్‌ఆర్‌ఎం ఐఎస్టీ మూడోస్థానంలో నిలిచింది.

# భారీగా కల్తీ నెయ్యి స్వాధీనం



కల్తీనెయ్యిని పట్టుకున్న మీర్‌పేట పోలీసులు

**బడంగ్‌పేట, నమస్తే తెలంగాణ:** పోలీసుల దాడిలో గురువారం కల్తీ నెయ్యి పట్టుబడింది. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ రాఘవేంద్రకాలనీలో కల్తీ నెయ్యి తయారీ కేంద్రంపై పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో రూ.2.5 లక్షల విలువగల కల్తీ నెయ్యి నిల్వలను స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దాడుల సందర్భంగా 26 టన్నుల కల్తీ నెయ్యితోపాటు మరో 10 టిన్నుల కల్తీ నూనెను పట్టుకున్నారు. 15 కేజీల క్యాన్లలో రుచిగోల్డ్ పామాయిల్ పేరుతో ఉన్న డబ్బాలు సీజ్ చేశారు. కృష్ణా జిల్లాకు చెందిన శ్రీనివాసు కొంతకాలంగా ఇల్లు అద్దెకు తీసుకొని జిల్లెలగూడ రాఘవేంద్రకాలనీలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నాడు. మూడు రోజుల నుంచి శ్రీనివాస్ అందుబాటులో లేడని, అతని కలిసి పనిచేసే మోహనకృష్ణను విచారిస్తున్నామని, కల్తీ నెయ్యిని స్వీట్‌షాపులకు సరఫర చేస్తున్నారని తెలిపారు. ఫుడ్ కంట్రోల్ అధికారులకు సమాచారం ఇచ్చామని, కల్తీ సరుకులను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపుతున్నామని మీర్‌పేట సీఐ తెలిపారు.



గురువారం విద్యుత్ సౌధలో టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెలంగాణ విద్యుత్ ఇంజినీర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం

## అగ్రస్థానంలో మన విద్యుత్‌సంస్థలు

- టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు
- టీఈఈఏ కార్యవర్గ ప్రమాణం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** విద్యుత్ ఉద్యోగుల సమిష్టి కృషితోనే తెలంగాణ విద్యుత్‌సంస్థలు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయని టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు చెప్పారు. గురువారం ఖైరతాబాద్‌లోని విద్యుత్‌సౌధలో నిర్వహించిన తెలంగాణ విద్యుత్ ఇంజినీర్ల అసోసియేషన్ (టీఈఈఏ) నూతన కార్యవర్గ ప్రమాణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభాకర్‌రావు హాజరయ్యారు. టీఈఈఏ అధ్యక్షుడు ఎన్ శివాజీ, ప్రధాన కార్యదర్శి ఏ రామేశ్వరశెట్టి, కార్యనిర్వాహక అధ్యక్షుడు బీ తిరుపతయ్య, ముఖ్య సలహాదారు సురేందర్‌రెడ్డి, కోశాధికారి వెంకట్రామయ్య, మిగతా సభ్యులతో సీఎండీ ప్రమాణం చేయించారు.

## ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం

టీఎన్జీవో అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



రవీందర్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక వాతావరణంలోనే సమస్యలు పరిష్కారమవుతాయని టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు. ఏడాదికాలంగా ఉద్యోగులసమస్యలు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై స్పందించకపోవడంతో క్షేత్రస్థాయి ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. నాంపల్లి టీఎన్జీవోభవన్‌లో గురువారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముందుగా దిశ, తాసిల్దార్ విజయారెడ్డికి నివాళులర్పించారు. పదవీవిరమణ వయస్సు పెంచాలని కోరారు. సమావేశంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, అసోసియేట్ ప్రెసిడెంట్ రేచల్, కోశాధికారి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మణ్.. ఒళ్లు దగ్గరపెట్టుకో

- మంత్రి కేటీఆర్‌పై పిచ్చి ప్రేలాపనలు వద్దు
- రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి చూపింది
- లెక్కలు తెప్పించుకో.. చర్చకు మేం సిద్ధం: విప్ బాలరాజు, ఎమ్మెల్యే కిశోర్ సవాల్



మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు. చిత్రంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌ను ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే గాదరి కిశోర్ హెచ్చరించారు. ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోతున్నా బీజేపీకి బుద్ధిరావటం లేదని విమర్శించారు. గురువారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో నిర్వహించిన మీడియా సమావేశంలో బాలరాజు, కిశోర్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి నిధుల విడుదలలో కేంద్రం మొండిచేయి చూపిందన్న మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు వందశాతం వాస్తవమని స్పష్టంచేశారు. నిజాలు గుర్తించలేని స్థితిలో ఉన్న లక్ష్మణ్ కంటి దవాఖానకు వెళ్లాలని సూచించారు. కేటీఆర్‌పై లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 'నీ స్థాయికి మా నాయకుడు కేటీఆర్ అవసరం లేదు. మేం ఇద్దరం చర్చకు వస్తాం. తెలంగాణ ఎంత అభివృద్ధి చెందింది. అందులో కేంద్రం సాయం ఎంతనే అన్ని లెక్కలు తెప్పించుకొని సిద్ధంగా ఉండు' అని సవాల్ విసిరారు. మంత్రి కేటీఆర్‌పై పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్రానికి నిధుల విడుదల, విభజన హామీలను అమలులో కేంద్రం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. యూరియా కొరత ఉన్నదని రాష్ట్రాన్ని అప్రతిష్ఠపాల్జేసే ప్రయత్నం చేశారని, వెయ్యి కిలోమీటర్ల జాతీయ రహదారికి సాంకేతిక అనుమతులు ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవికి ఉంటుందో, ఊడుతుందో అనే ఆందోళనలో ఉన్న లక్ష్మణ్ పిచ్చిగా మాట్లాడుతున్నారని, ఉన్న పదవిని కాపాడుకొనేందుకు నోటికొచ్చినట్టు వ్యాఖ్యలుచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## పల్లెప్రగతి ప్రణాళిక నిరంతరం సాగాలి

- పరిశుభ్రత, పచ్చదనంపై సమీక్ష
- కలెక్టర్లకు పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావు ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పల్లెప్రగతిలో పూర్తిచేసిన పనులపై గ్రామాలవారీగా పరిశీలన చేస్తున్నామని, పచ్చదనం, పరిశుభ్రత అంశాలన్నీ యథావిధిగా కొనసాగాలని పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ రఘునందన్‌రావు ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత లక్ష్యంగా సెప్టెంబర్ 6 నుంచి అక్టోబర్ 5వ తేదీవరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించిన 30 రోజుల పల్లెప్రగతి ప్రణాళిక నిరంతరం కొనసాగాలని సూచించారు. పల్లెప్రగతి అంశంపై కమిషనర్ అయా విభాగాల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. గ్రామాలవారీగా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కల ఎదుగుదలను పరిశీలించాలని, సరిగా ఎదుగని, చనిపోయిన మొక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. వాటి స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. ఇప్పటివరకు అందిన నివేదికల ప్రకారం రాష్ట్రంలో 79 శాతం మొక్కలు బతికాయని, దీన్ని మరింత పెంచేలా స్థానికంగా బాధ్యత తీసుకోవాలన్నారు.

# అయ్యప్పదీక్షలో ఉన్న విద్యార్థిపై టీచర్‌దాడి

- ఉద్దేశపూర్వకంగానే కొట్టారని అయ్యప్పస్వాముల ఆరోపణ
- నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఘటన


విద్యార్థి గాయాన్ని చూపుతున్న అయ్యప్పస్వాములు

**ఖానాపూర్:** అయ్యప్ప దీక్షలో ఉన్న విద్యార్థిపై ఓ ఉపాధ్యాయురాలు చేయిచేసుకున్నారు. ఈ ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని నిస్సి పబ్లిక్ స్కూల్‌లో గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న అశ్విత్‌రెడ్డి అనే విద్యార్థి అయ్యప్ప దీక్షలో ఉన్నాడు. గురువారం ఉదయం తరగతిలో టీచర్ కొట్టడంతో విద్యార్థి వీపు, చేతులు, భుజాలు ఎర్రగా కందిపోయాయి. విషయం తెలుసుకున్న అయ్యప్ప స్వాములు అశ్విత్‌రెడ్డిని పరామర్శించి, దాడిని ఖండించారు. మాల వేసుకున్నాడనే కారణంతో బాలుడిపై దాడి చేశారని ఆరోపిస్తూ వారు ఖానాపూర్ తాసిల్దార్ నారాయణ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, విద్యార్థిని కావాలని కొట్టలేదని, తరగతి గదిలో తోటి విద్యార్థిని పెన్నుతో గాయపరిచినందుకే టీచర్ మందలించారని పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాలత వివరణ ఇచ్చారు.

# ఎస్సారార్‌కు తరలుతున్న జలాలు

- గాయత్రి పంపుహౌస్‌లో మళ్లీ రెండు మోటర్లు ప్రారంభం
- ఐదు టీఎంసీల వరకు ఎత్తిపోసే అవకాశం


కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్ డెలివరీ సిస్టర్న్ ద్వారా వస్తున్న జలాలు

**రామడుగు/కాళేశ్వరం:** కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ శివారులోని గాయత్రి పంప్‌హౌస్‌లో కాళేశ్వరం జలాల ఎత్తిపోతలు గురువారం మళ్లీ ప్రారంభమయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 11.30 గంటలకు ఒకటో పంప్‌ను, మధ్యాహ్నం 12 గంటలకు మూడో పంప్‌ను అధికారులు ప్రారంభించారు. గాయత్రి పంప్‌హౌస్‌లో ఒక్కో మోటర్ 3,500 క్యూసెక్కుల చొప్పున మొత్తం ఏడువేల క్యూసెక్కుల జలాలను ఎత్తిపోస్తున్నట్టు అధికారులు తెలిపారు. మోటర్లు ప్రారంభం కాగానే డెలివరీ సిస్టర్న్ ద్వారా గ్రావిటీ కాల్వలోకి చేరిన జలాలు సుమారు 5.7 కిలోమీటర్ల దూరంలో శ్రీరాములపల్లి వద్ద ఉన్న వరద కాల్వలోకి చేరుకున్నాయి. అక్కడి నుంచి శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ వైపు పరుగులు పెట్టాయి. ఈ జలాశయంలో ఇప్పటికే 20 టీఎంసీలు నిల్వ ఉండగా మరో ఐదు టీఎంసీల వరకు నీటి సరఫరా కొనసాగే అవకాశం ఉన్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

**ఐదు మోటర్ల ద్వారా పంపింగ్..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం లక్ష్మి (కన్నెపల్లి) పంప్‌హౌస్‌లో గురువారం ఇంజినీర్లు ఐదు మోటర్ల ద్వారా గోదావరి జలాలను పంపింగ్ చేశారు. పంప్‌హౌస్‌లోని 1, 4, 5, 6, 8వ మోటర్ల ద్వారా 10,600 క్యూసెక్కుల నీటిని సరస్వతి (అన్నారం) బరాజ్‌కు తరలించారు. డెలివరీ సిస్టర్న్ నుంచి పైపుల ద్వారా పోసిన గోదావరి జలాలు గ్రావిటీ కెనాల్ ద్వారా సరస్వతి బరాజ్‌కు తరలుతున్నాయి. సరస్వతి బరాజ్‌లో 7.39 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.


సభలో మాట్లాడుతున్న మంత్రి ఈటల. చిత్రంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు దాసరి, కోరుకంటి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ తదితరులు

# ఆత్మస్వచ్ఛత వైపు అడుగేయాలి

- సీఎం కేసీఆర్ ఆకాంక్షలను నిజం చేసిన పెద్దపల్లి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల
- పెద్దపల్లిలో 'స్వచ్ఛత నుంచి స్వస్థత' దిశా నిర్దేశ సభ
- హాజరైన మంత్రి కొప్పుల

**పెద్దపల్లి ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** సమాజంలో ఆరోగ్యవంతులుగా నిలదొక్కుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆత్మ స్వచ్ఛత సాధన దిశగా ముందడుగు వేయాల్సిన సమయం ఆసన్నమైందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 'స్వచ్ఛత నుంచి స్వస్థత వరకు దిశానిర్దేశ' సభకు మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, కలెక్టర్ శ్రీదేవసేన, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్ హాజరయ్యారు. మంత్రి ఈటల మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్వచ్ఛత అంశంలో ముందున్న పెద్దపల్లి జిల్లా జాతీయ అవార్డులను కైవసం చేసుకుని రాష్ర్టానికి మంచి పేరును తెచ్చిపెట్టిందన్నారు.

**గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం: కొప్పుల**

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నదని ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. 30 రోజుల ప్రణాళిక కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగాల్సిన అవసరం ఉన్నదన్నారు.

# అఘాయిత్యాలను నిరోధిద్దాం

**మహిళా సంఘాలకు ప్రత్యేక అధికారాలు**

- యోచనలో రాష్ట్ర ప్రభుత్వం
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో సబ్సిడీ ట్రాక్టర్లను అందజేసి నడుపుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

**వేములవాడ, నమస్తేతెలంగాణ:** మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నిరోధానికి గ్రామాల్లోని మహిళా సంఘాలకు ప్రత్యేక అధికారాలను ఇవ్వనున్నామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎరబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. దిశ ఘటనను సీఎం కేసీఆర్ తీవ్రంగా పరిగణిస్తున్నారన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మహాలింగేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు రూ.20.84 కోట్ల రుణాలను అందజేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు గాను 30 గ్రామాలకు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ఆర్‌అండ్‌ఆర్ చింతలఠాణా కాలనీలో సంచార జాతులకు 40 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, హన్మాజిపేటలో రూ.40 లక్షలతో నిర్మించనున్న మహిళా స్వశక్తి భవనానికి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఫౌంటెయిన్, వైకుంఠ రథాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఇకపై మహిళలపై అఘాయిత్యాలు పునరావృతం కాకూడదని గ్రామాల్లోని ఐకేపీ మహిళా సంఘాలకు ప్రత్యేక అధికారాలు కట్టబెట్టేందుకు సీఎం కేసీఆర్ సమాలోచనలు చేస్తున్నారని తెలిపారు. గ్రామంలో ఇకపై రౌడీలు, జులాయిలు, ఇతరులు ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే నేరుగా వారే పోలీసులకు సమాచారం అందించే విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు వారికి ప్రత్యేక అధికారులు ఇవ్వనున్నట్టు చెప్పారు. అన్ని సంక్షేమ పథకాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యతనిస్తూ వారి గౌరవాన్ని పెంపొందించారన్నారు. స్వయం సహకార సంఘాలు, స్త్రీనిధి, మెప్మా వంటి సంఘాలకు ఒక్కో సభ్యురాలికి రూ.3 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామన్నారు. తీసుకున్న రుణంతో గ్రామీణ ప్రాంతాల్లోనే కూరగాయలు, పప్పుదినుసులు, కారం, పసుపు వంటి వస్తువులను తయారుచేసి కల్తీలేకుండా విక్రయించి లాభాలను గడించాలని సూచించారు. 30 రోజుల ప్రణాళికలో గ్రామాలను అద్దంలా తయారుచేసిన వారికి ప్రత్యేక ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, జెడ్పీ అధ్యక్షురాలు అరుణ, కలెక్టర్ కృష్ణభాస్కర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిడ్డ వరుసయ్యే బాలికపై లైంగిక దాడి

**సూర్యాపేట సిటీ:** వరుసకు బిడ్డ అయ్యే బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన ఘటన సూర్యాపేట పట్టణంలో గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ, చివ్వెంల మండలం మున్యానాయక్ తండాకు చెందిన బాణోతు శ్రీనుతో పదేండ్లుగా కలిసి ఉంటుంది. సదరు మహిళకు గతంలోనే పెండ్లి కాగా కూతురు(16) ఉన్నది. భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. కూతురు ఆరోతరగతి వరకు చదివి ఇంట్లోనే ఉంటున్నది. అప్పుడప్పుడు తల్లితో కలిసి కూలీ పనులకు వెళ్తుంటుంది. మహిళ పనికి వెళ్లిన సమయంలో బాణోతు శ్రీను సదరు బాలికతో గత పక్షం రోజులుగా అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగికంగా వేధిస్తున్నాడు. వారం రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేనిది చూసి బాలికపై దాడి చేశాడు. ఎవరికైనా చెబితే తల్లీబిడ్డ ఇద్దరినీ చంపుతానని బెదిరించాడు. బుధవారం మరోసారి లైంగిక దాడికి పాల్పడగా బాలిక తన తల్లికి చెప్పడంతో ఆమె కూతురితో కలిసి సూర్యాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సర్పంచ్ కుల బహిష్కరణ

**మిరుదొడ్డి:** ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ఓ సర్పంచ్‌ను కుల బహిష్కరణ చేసిన ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలోని బేగంపేటలో గురువారం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీ మిరుదొడ్డి మండలం బేగంపేటకు ఎన్నికలు లేకుండా సర్పంచ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకొనేందుకు గ్రామస్థులు తీర్మానించారు. ఈ మేరకు మాంకాలమ్మ గుడి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చిన గ్రామానికి చెందిన పోతారం అనసూయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సమాచారం. ఎన్నికలు పూర్తయి ఏడాది గడుస్తున్నా గుడి నిర్మాణానికి ఒప్పుకున్న రూ.5 లక్షలు ఇవ్వకపోవడంతో గురువారం సమావేశమైన సదరు కుల పెద్దలు సర్పంచ్ అనసూయను కుల బహిష్కరణ చేస్తున్నట్టు ప్రకటించారు. సదరు కులానికి చెందినవారు సర్పంచ్‌తో మాట్లాడినా, సహాయపడిన రూ.50 వేలు జరిమానా విధిస్తామని తీర్మానం చేశారు. కాగా, తాను గ్రామంలోని ఒక వర్గానికి సర్పంచ్‌ను కాదని, ఎన్నికల సమయంలో ఎవరికి డబ్బులు ఇస్తానని చెప్పలేదని సర్పంచ్ అనసూయ స్పష్టం చేశారు.


నిజామాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

# 'కాళేశ్వరం' ఇంజినీరింగ్ అద్భుతం

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**ఇందూరు:** అద్భుత ఇంజినీరింగ్ సామర్థ్యానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఉదాహరణ అని గృహనిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గోదావరి నది తెలంగాణకు వంద అడుగుల కిందికి ఉన్నప్పటికీ సీఎం కేసీఆర్ ఆలోచనతో కాళేశ్వరం నీటిని మోటర్ల ద్వారా పైకి తీసుకొచ్చి.. అసాధ్యాన్ని సుసాధ్యం చేశారన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో సైన్స్, గణిత పర్యావరణ ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారా సామాజిక సమస్యలను పరిష్కరించుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎమ్మెల్సీలు వీజీగౌడ్, ఆకుల లలిత, కలెక్టర్ రామ్మోహన్‌రావు, డీఈవో జనార్దన్‌రావు పాల్గొన్నారు.

# భూసంరక్షణ మన బాధ్యత

- భవిష్యత్ తరాలకు సారవంతమైన నేలలు అందిద్దాం
- వరితోపాటు ఇతర పంటలపైనా రైతులు దృష్టిసారించాలి
- మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి


సూర్యాపేట జిల్లా గడ్డిపల్లి కేవీకేలోని ఉత్పత్తుల ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సైదిరెడ్డి, తదితరులు

**గరిడేపల్లి:** 'జీవానికి యోగ్యమైన గ్రహం భూమి.. పంటలు పండాలంటే అది సారవంతంగా ఉండాలి.. భవిష్యత్ తరాలకు సారవంతమైన నేలలను అందించడం మన బాధ్యత' అని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రపంచ మృత్తికా దినోత్సవం కార్యక్రమాన్ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ భూ ఆరోగ్య పరిరక్షణ కోసం భావితరాలకు భూకాలుష్యంపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలోని 206 మండలాలు ఆయిల్‌పాం సాగుకు అత్యంత అనుకూలంగా ఉన్నాయన్నారు. రైతులు వరితోపాటు ఇతర పంటల సాగుపైనా దృష్టిని సారించాలని ఆయన పిలుపునిచ్చారు. మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగానే రైతులు ఎరువులను వాడాలన్నారు. కొందరు అవగాహన లేక తమ పొలాలకు నిప్పు పెడుతున్నరని, అలా చేయడం వల్ల పంటలకు ఉపయోగపడే సూక్ష్మ జీవులు నశించిపోతున్నాయన్నారు. ఇలాంటి విధానాల వల్లే ఢిల్లీలో కాలుష్యం ఏర్పడి జీవనం ఇబ్బందికరంగా మారిందని గుర్తుచేశారు. మొదట కేవీకేలో రూ.కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన విత్తన శుద్ధి కేంద్రాన్ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, సూర్యాపేట కలెక్టర్ అమయ్‌కుమార్, ఐసీఏఆర్ డైరెక్టర్ అటారీ వైజీ ప్రసాద్, డీఏవో జ్యోతిర్మయి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రజాక్ తదితరులు పాల్గొన్నారు.

# ముట్టుకోకుండా సాధ్యమా?

- మూల విరాట్టును తాకకుండా ఆరాధనలు ఎలా చేస్తారు?
- ప్రముఖ చరిత్ర పరిశోధకులు ఎస్ హరగోపాల్ స్పష్టీకరణ
- యాదాద్రిపై 'ఆంధ్రజ్యోతి' కథనం విచారకరం


ఎస్ హరగోపాల్

**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** మూలవిరాట్టును ముట్టుకోకుండా అర్చకులు ఆరాధనలు ఎలా చేస్తారని కొత్త తెలంగాణ చరిత్ర పరిశోధకులు, ప్రముఖ సాహితీవేత్త ఎస్ హరగోపాల్ అన్నారు. యాదాద్రిలో గురువారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. మూలవిరాట్టును ముట్టుకుంటారా? అంటూ ఆంధ్రజ్యోతి దినపత్రిక కథనం ప్రచురించడంపై ఆయన విచారం వ్యక్తంచేశారు. మూలవిరాట్టుకు పూజలు చేయడం, సిందూరం లేపనం చేయడం, తొలగించడం అర్చకుల విధి అని, అది ఒక సంప్రదాయమన్నారు. వీటికి సంబంధించిన నియమాలను అర్చకులు పాటిస్తారని చెప్పారు. సిందూరం దట్టంగా పొరలు పొరలుగా చేరినప్పుడు పాత సిందూరాన్ని తొలగిస్తారని, ప్రధాన మూర్తి కనిపించకుండా ఉన్నప్పుడు కూడా సిందూరాన్ని తొలగించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. ఆగమ నియమాల ప్రకారం జరిగే ప్రతి కార్యక్రమాన్ని ఆమోదించాల్సిందేనని హరగోపాల్ చెప్పారు. శ్రీశైలం, కాశీలో గర్భగుడిలో లింగాన్ని ముట్టుకొని భక్తులంతా పూజలు చేస్తారని, వైష్ణవమూర్తులకు మాత్రం వైష్ణవ సంప్రదాయం ప్రకారమే నడుచుకొంటారని తెలిపారు. మనిషి ఆలోచనలు నాస్తి ప్రతిమ నుంచి ఆస్తి ప్రతిమ వరకు పరిణమించాయన్నారు. యాదాద్రిలో సహజ గుహలో వెలిసిన నారసింహ రూపాలు ప్రసిద్ధమైనవిగా ఆయన అభివర్ణించారు. గుహలోని కొండ పగులులో ఉన్న రూపాలకు శిల్పం కనిపించదని, వాటిని స్వయంభువులుగానే ఆరాధిస్తారని చెప్పారు. యాదాద్రిలో శ్రీనారసింహుడు ఐదు రూపాల్లో స్వయంభువుగా పూజలందుకుంటున్న విషయాన్ని ఉదహరించారు. పాంచరాత్రాగమం ప్రకారం అర్చకులు నిత్య పూజాకైంకర్యాలు చేస్తారని చెప్పారు.

# ప్రపంచం మెచ్చేలా యాదాద్రి పనులు

దేవాదాయ శాఖ ఉద్యోగుల సంఘం


వెంకటేశ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచ దేశాలు మెచ్చుకునేలా పునరుద్ధరణ పనులు చేస్తున్నా యాదాద్రిపై రాద్ధాంతం చేయడం తగదని దేవాలయాల ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. ఆంధ్రజ్యోతి పత్రికలో యాదాద్రిపై వచ్చిన కథనాలను ఆ సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. దీనిపై ప్రధాన అర్చకులు స్పష్టమైన వివరణ ఇచ్చినప్పటికీ వివాదాస్పదం చేయడం సరికాదన్నారు. త్రిదండి చినజీయర్ స్వామి సూచనలను, సలహాలను పాటిస్తూ దేవాలయ పనులు అద్భుతంగా సాగుతున్నాయని చెప్పారు. నిర్మాణాలపైనే కాకుండా ఏకంగా స్వామివారి మూలవిరాట్టుకే అపచారం జరిగిందంటూ ప్రచారం చేయడం.. ఆ పత్రిక దిగజారుడుతనానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. స్వామివారికి సిందూరం తీయడంతో కొత్తగా కనిపిస్తున్నారని, దాంతో మూల విరాట్టుకు అపచారం జరిగిందని పేర్కొనడం సబబు కాదన్నారు. చాలా గ్రామాల్లో దేవతామూర్తుల విగ్రహాలకు సిందూరం తొలగిస్తారని, అర్చకులు మంత్రోచ్ఛారణతో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని, యాదాద్రిలో కూడా అదే విధంగా నిష్ఠతో చేశారని వెంకటేశ్ వివరించారు.


మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో ఆయిల్‌పాం సాగుపై గురువారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సును పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్, ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి ప్రభుత్వవిప్ బాల్క సుమన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూర్ ప్రాంత నేలలు ఆయిల్‌పాం సాగుకుఅనుకూలంగా ఉన్నాయని, ఆయిల్‌పాం పంటలతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. - చెన్నూర్, నమస్తే తెలంగాణ


దిశకు నివాళిగా జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో స్మృతివనాన్ని ఏర్పాటు చేశారు. దిశ స్మృతివనంలో గురువారం కలెక్టర్ శశాంక, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి ఆదిత్య కేశవసాయి, మార్కెటింగ్ శాఖ అధికారి పుష్ప తదితరులు మొక్కలను నాటి నివాళులర్పించారు. - జోగుళాంబ గద్వాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ

## అంతరిక్ష ప్రయోగాలు విద్యార్థులకు స్ఫూర్తి

- నిట్ రిజిస్ట్రార్ ఎస్ గోవర్ధన్‌రావు
- ముగిసిన ఇస్రో ఉత్సవాలు


మాట్లాడుతున్న గోవర్ధన్ రావు

**నిట్‌క్యాంపస్(వరంగల్ అర్బన్):** అంతరిక్ష ప్రయోగాలు, సైన్స్ ఎగ్జిబిషన్లు విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని నిట్ రిజిస్ట్రార్ గోవర్దన్‌రావు పేర్కొన్నారు. వరంగల్‌లోని జాతీయ సాంకేతిక విద్యాసంస్థ(నిట్)లో గురువారం సాయంత్రం ఇస్రో ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇస్రో ఎగ్జిబిషన్ చూసేందుకు వచ్చిన విద్యార్థుల్లో తాము కూడా నిట్, ఐఐటీ లాంటి సంస్థల్లో చదవడానికి ప్రేరణ కలిగిస్తుందని ఆయన చెప్పారు. ఇస్రో హైదరాబాద్ విభాగం జనరల్ మేనేజర్ రాజశ్రీ మాట్లాడుతూ ఇస్రో సాధించిన ఘన విజయాల పరంపరల ఎగ్జిబిట్లు అందరినీ ఆకట్టుకున్నాయని తెలిపారు. అనంతరం క్విజ్, వ్యాస రచన, పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రిజిస్ట్రార్ బహుమతులు అందజేశారు.


గురువారం ఉదయం వరంగల్ అర్బన్ జిల్లా అరెపల్లి రోడ్డులో కనిపించిన పొగ మంచు

# పగలూ వణికిస్తున్న చలి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ:** తూర్పు ఈశాన్యం నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సైతం తగ్గుముఖం పట్టడంతో మధ్యాహ్న సమయంలోనూ చలి వణుకు పుట్టిస్తున్నది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం 5.30గంటల వరకు హైదరాబాద్ నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 27.0 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 19.5 డిగ్రీల సెల్సియస్ నమోదైంది.

**చలికాలం**

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం | జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|---|---|---|
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 14.0 | 29.0 | వరంగల్ రూరల్ | 17.0 | 28.0 |
| ఆదిలాబాద్ | 14.8 | 29.3 | రాజన్న సిరిసిల్ల | 17.0 | 29.0 |
| పెద్దపల్లి | 15.0 | 28.0 | నాగర్‌కర్నూల్ | 17.2 | 27.0 |
| జగిత్యాల | 15.0 | 29.0 | సంగారెడ్డి | 17.3 | 29.4 |
| మహబూబాబాద్ | 15.0 | 29.0 | సూర్యాపేట | 18.0 | 27.0 |
| వికారాబాద్ | 15.1 | 32.2 | వరంగల్ అర్బన్ | 18.0 | 29.0 |
| మంచిర్యాల | 15.6 | 33.4 | నల్లగొండ | 18.0 | 29.0 |
| నిర్మల్ | 16.0 | 27.0 | జయశంకర్ భూపాలపల్లి | 18.0 | 29.0 |
| రంగారెడ్డి | 16.0 | 28.0 | భద్రాద్రి కొత్తగూడెం | 18.0 | 30.0 |
| మెదక్ | 16.1 | 32.0 | జనగామ | 18.1 | 26.0 |
| కరీంనగర్ | 16.2 | 32.3 | వనపర్తి | 18.2 | 32.6 |
| యాదాద్రి భువనగిరి | 17.0 | 26.0 | నిజామాబాద్ | 18.5 | 30.0 |
| కామారెడ్డి | 17.0 | 27.0 | ఖమ్మం | 19.0 | 30.0 |
| సిద్దిపేట | 17.0 | 28.0 | జోగుళాంబ గద్వాల | 19.0 | 30.0 |
| ములుగు | 17.0 | 28.0 | హైదరాబాద్ | 19.5 | 27.0 |
| | | | మేడ్చల్ | 19.5 | 27.0 |
| | | | మహబూబ్‌నగర్ | 19.6 | 28.2 |
| | | | నారాయణపేట | 19.6 | 28.2 |

సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామాన్ని 13 రాష్ర్టాలకు చెందిన ఎన్‌ఐఆర్‌డీ అధికారులు గురువారం సందర్శించారు. గ్రామంలోని ఇంకుడుగుంతలు, హరితహారం, సామూహిక గొర్రెల షెడ్లు, పందిరి సాగు, పార్కు, ప్రాథమిక పాఠశాల, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, డంపింగ్ యార్డు, వైకుంఠధామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇబ్రహీంపూర్ బాగుందని కితాబిచ్చారు. - నారాయణరావుపేట



సొంతగడ్డపై వరుస విజయాలతో ఎదురులేకుండా దూసుకెళ్తున్న టీమ్ఇండియా.. వెస్టిండీస్‌తో పొట్టిపోరుకు సిద్ధమైంది. సిరీస్‌లో భాగంగా భాగ్యనగరం వేదికగా జరుగనున్న తొలి టీ20లో బోణీ కొట్టాలని విరాట్ సేన చూస్తుంటే.. తమకు అచ్చొచ్చిన ఫార్మాట్‌లో కోహ్లీ అండ్ కోకు చెక్ పెట్టాలని కరీబియన్లు కాచుక్కూర్చున్నారు. రెండేండ్ల క్రితమే ఉప్పల్‌లో మొదటి టీ20 మ్యాచ్ జరగాల్సి ఉన్నా.. అప్పట్లో వాతావరణం సహకరించకపోవడంతో మ్యాచ్ రద్దు కాగా.. ఈ సారి ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అజారుద్దీన్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాడు. మరి పొట్టి ఫార్మాట్‌లో ధనాధన్ దరువేసి ఇన్‌స్టంట్ హీరోగా నిలిచేదెవరో.. పరుగుల వరద పారించి జయకేతనం ఎగురవేసేది ఏ జట్టో నేడు తేలనుంది.

# అల భాగ్యనగరంలో..

## నేడు భారత్, వెస్టిండీస్ మధ్య తొలి టీ20





“ మేం భారత్‌లో చాలా క్రికెట్ ఆడాం. ఆ అనుభవాన్ని వినియోగించుకొని మ్యాచ్‌లు గెలువాలనుకుంటున్నాం.
- పొలార్డ్, వెస్టిండీస్ కెప్టెన్

రాత్రి గం. 7 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి**

మహానగరం మరో బిగ్ మ్యాచ్‌కు రెడీ అయింది. ఇప్పటివరకు టెస్టులు, వన్డేలకు ఆతిథ్యమిచ్చిన ఉప్పల్ స్టేడియం.. పరుగుల పండుగ కోసం ముస్తాబైంది. వాస్తవానికి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో రెండేండ్ల క్రితమే తొలి టీ20 (2017 అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో) జరగాల్సి ఉన్నా.. నిర్వాహకుల తప్పిదాల వల్ల ఆ మ్యాచ్ రద్దైంది. మళ్లీ ఇన్నాళ్లకు భాగ్యనగర వాసులకు టీ20 మ్యాచ్ ప్రత్యక్షంగా చూసే భాగ్యం దక్కింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్, వెస్టిండీస్ మధ్య తొలి టీ20 శుక్రవారం ఇక్కడ జరుగనుంది. వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో టీ20 ప్రపంచకప్ జరుగనున్న నేపథ్యంలో.. రెండు జట్లు ఇప్పటి నుంచే మెగా టోర్నీకి రిహార్సల్స్ మొదలెట్టాయి. ఇందులో భాగంగా టీమ్ఇండియా మిడిలార్డర్‌ను చక్కబెట్టాలని చూస్తుంటే.. విండీస్ జట్టు కరీబియన్ ప్రీమియర్ లీగ్ హీరోలను సానబెట్టేందుకు యత్నిస్తున్నది. విండీస్ ప్లేయర్లకు భారత పరిస్థితులు కొత్త కాకున్నా.. దాదాపు నెలన్నర క్రితమే ఇక్కడ అడుగుపెట్టిన ఆ జట్టు స్థానిక వాతావరణాన్ని పూర్తిగా ఆకలింపు చేసుకుంది. కాకపోతే అఫ్ఘనిస్థాన్ చేతిలోనే సిరీస్ కోల్పోయిన ప్రపంచ చాంపియన్లు.. పటిష్ఠ భారత్‌కు పోటీనిస్తారా అనేది తేలాల్సి ఉంది. ముఖ్యంగా ఈ సిరీస్ లోకేశ్ రాహుల్, రిషబ్ పంత్, మనీశ్ పాండేకు కీలకం కానుంది. పొట్టి ప్రపంచకప్ ప్లానింగ్స్‌లో ఉన్న వీళ్లు స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చకపోతే జట్టులో చోటు నిలువడం కష్టమే. ఇప్పటికే బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని అంటున్న నేపథ్యంలో కుర్రాళ్లు సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతున్నారు.

**అన్ని విభాగాల్లోనూ పటిష్ఠంగా..**

శిఖర్ ధవన్ గాయం వల్ల సిరీస్ నుంచి తప్పుకోవడంతో వైస్ కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి లోకేశ్ రాహుల్ ఓపెనింగ్ చేయడం దాదాపుగా ఖాయమే. టాలెంటెడ్ ప్లేయర్‌గా ముద్రపడ్డ రాహుల్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయక చాన్నాళ్లైంది. మరి మెగాటోర్నీకి ముందు సత్తా చాటేందుకు రాహుల్‌కు ఇంతకుమించిన అవకాశం రాకపోవచ్చు. ధవన్ గైర్హాజరీలో ఎంపికైన సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గానే పరిగణిస్తామని చెప్పిన సెలెక్టర్లు.. రాహుల్‌ను తప్పించి సంజూకు చాన్స్ ఇచ్చే అవకాశాలు తక్కువే. ఈ ఫార్మాట్‌లో రాహుల్ రికార్డు కూడా బాగానే ఉంది. 31 మ్యాచ్‌ల్లో అతడు 42.74 సగటుతో 974 పరుగులు చేశాడు. ఐపీఎల్లోనూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. కానీ ఒక్క మ్యాచ్‌లో మెరువడం ఆ తరువాత జట్టుకు భారంగా మారడం అతడికి అలవాటైపోయింది. రోహిత్‌తో పాటు ఓపెనింగ్ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలంటే రాహుల్ నిలకడగా పరుగులు చేయడం ముఖ్యం. కొంతకాలంగా పేలవ ప్రదర్శన చేస్తున్నా.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో రిషబ్ పంత్ ఇంకా కొనసాగుతూనే ఉన్నాడు. క్రీజులో బ్యాట్‌తో.. వికెట్ల వెనుక గ్లౌజ్‌లతో ఏమాత్రం ఆకట్టుకోలేకపోతున్న పంత్ ఇప్పటికైన కండ్లు తెరువకుంటే.. అతడిపై వేటు పడక తప్పదు. క్రీజులోకి రాగానే భారీ షాట్లు ఆడాలని ప్రయత్నిస్తున్న పంత్.. ముందు వికెట్ విలువ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ధోనీని అనుకరించాలనే అతడి తొందరపాటు కూడా జట్టును కష్టాల్లోకి నెడుతున్నది. ఇలాగే కొనసాగితే.. కీపర్ స్థానంలో శాంసన్ దర్శనమివ్వొచ్చు. బంగ్లాతో టీ20 సిరీస్‌కు విశ్రాంతి తీసుకున్న కెప్టెన్ విరాట్ తిరిగిరావడం టీమ్ఇండియాకు కొండంత బలం చేకూర్చుతున్నది. మిడిలార్డర్‌లో శ్రేయాస్ అయ్యర్, మనీశ్ పాండేతో పాటు యువ ఆల్‌రౌండర్ శివం దూబే బ్యాటింగ్‌కు వస్తారు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా దాదాపు ఖాయమే. అయితే చాహల్‌కు తోడుగా కుల్దీప్‌ను కూడా ఆడించాలనుకుంటే జడ్డూపై వేటు తప్పకపోవచ్చు. భువనేశ్వర్‌తో పాటు షమీ, దీపక్‌లో ఒక్కరే తుది జట్టులో ఉంటారు. తాజా ఫామ్ ప్రకారం చూసుకుంటే షమీకి చోటు ఖాయమే అయినా.. అతడికి విశ్రాంతినిచ్చి దీపక్‌ను ఆడించే చాన్స్ ఎక్కువగా కనిపిస్తున్నది.

**కొత్తవారిపైనే ఆశలు..**

ఈ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ వెస్టిండీస్.. ప్రస్తుతం 10వ ర్యాంక్‌కు పడిపోయింది. దిద్దుబాటు చర్యలకు దిగిన ఆ దేశ క్రికెట్ బోర్డు.. స్టార్ ఆటగాళ్ల వెంట వెంపర్లాడకుండా.. యువ ఆటగాళ్లకు విరివిగా అవకాశాలివ్వాలని భావిస్తున్నది. ఇందులో భాగంగా.. ఈ ఏడాది కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో దుమ్మురేపిన వారిని ఈ సిరీస్‌కు ఎంపిక చేసింది. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్, డేంజర్ మ్యాన్ రస్సెల్, ఆల్‌రౌండర్లు బ్రాత్‌వైట్, బ్రేవో గైర్హాజరీలో ఫాబియన్ అలెన్, హైడెన్ వాల్ష్ జూనియర్, బ్రాండన్ కింగ్‌లపై విండీస్ బోర్డు ఆశలు పెట్టుకుంది. ఐపీఎల్ వేలానికి ఎక్కువ రోజులు లేకపోవడంతో ఈ సిరీస్‌లో మెరుపులు మెరిపించిన వారిపై ఫ్రాంచైజీల కన్ను పడటం ఖాయమే. ముఖ్యంగా రస్సెల్ లేని లోటు ఫాబియన్ భర్తీ చేయగలడని మేనేజ్‌మెంట్ నమ్ముతున్నది. బంతితోనూ, బ్యాట్‌తోనూ రాణించగల అలెన్.. సత్తాచాటితే విండీస్‌కు మరో విధ్వంసక వీరుడు దొరికినట్లే. సీనియర్లు లూయిస్, సిమన్స్, హెట్‌మైర్, రామ్‌దిన్, పొలార్డ్, హోల్డర్‌తో కూడిన లైనప్ పేపర్‌పైన బలంగానే కనిపిస్తున్నా.. అసలు మ్యాచ్‌లోకి వచ్చేసరికి ఏ మేరకు ప్రభావం చూపగలరనేదే ప్రధాన ప్రశ్న. కెప్టెన్ పొలార్డ్ జట్టును ముందుండి నడిపించాల్సిన అవసరం ఉంది.

“ రిషబ్ పంత్ ప్రతిభపై మాకు నమ్మకముంది. అతడి తప్పులను మరీ భూతద్దంలో చూడాల్సిన అవసరం లేదు. పంత్‌ను ఒంటరిని చేయడం లేదు. అతడి వెనుక మేమంతా ఉన్నాం. టీ20 ప్రపంచకప్‌నకు ముందు ఒక్క పేస్ బౌలర్ స్థానం తప్ప మిగిలిన ప్లేస్‌లు దాదాపుగా భర్తీ అయ్యాయి. ఆ ఒక్క స్థానం కోసం ఆరోగ్యకరమైన పోటీ ఉంది. ఈ ఫార్మాట్‌లో బుమ్రా, భువీ నిలకడగా రాణిస్తున్నారు. ఇప్పుడు షమీ రావడంతో అదనపు బలం చేకూరినట్లైంది. ఆసీస్ వంటి పిచ్‌లపై షమీ అత్యంత ప్రమాదకారి. దీపక్ కూడా బాగా బౌలింగ్ చేస్తున్నాడు.
- విరాట్ కోహ్లీ, భారత కెప్టెన్

**1** మరొక్క సిక్సర్ బాదితే రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో 400 సిక్స్‌లు కొట్టిన తొలి భారత బ్యాట్స్‌మన్‌గా నిలుస్తాడు.

**2** ఉప్పల్ స్టేడియంలో జరుగనున్న రెండో అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఇది. 2017 అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో తొలిసారి పొట్టి ఫార్మాట్‌లో మ్యాచ్ జరగాల్సి ఉండగా.. ఔట్‌ఫీల్డ్ సరిగ్గాలేని కారణంగా అది రద్దైంది.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** కోహ్లీ (కెప్టెన్), రోహిత్, రాహుల్, అయ్యర్, మనీశ్, పంత్, శివం, జడేజా, చాహల్, భువనేశ్వర్, దీపక్/షమీ.
**వెస్టిండీస్:** పొలార్డ్ (కెప్టెన్), లూయిస్, సిమన్స్, బ్రండన్ కింగ్, హెట్‌మైర్, రామ్‌దిన్, హోల్డర్, ఖారీ ప్పైర్/కీమో పాల్, అలెన్, హైడెన్ వాల్ష్, కాట్రెల్.

### పిచ్ వాతావరణం

రెండు రోజుల క్రితం నగరంలో చినుకులు పడటం కాస్త కలవరపెట్టినా.. శుక్రవారం వాతావరణం మ్యాచ్‌కు అనుకూలంగా ఉండనుంది. వర్షం ముప్పులేదు. గత ఐపీఎల్ మ్యాచ్‌లను పరిశీలిస్తే.. ఉప్పల్ పిచ్ బౌలింగ్‌కు అనుకూలం అనేది సుస్పష్టం. 2018 జనవరి నుంచి ఈ వికెట్‌పై తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 162 పరుగులు.

## నోబాల్ బాధ్యత థర్డ్ అంపైర్‌దే



అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) థర్డ్ అంపైర్ల పనిపెంచుతూ కొత్త నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ వేదికగా జరుగనున్న భారత్, వెస్టిండీస్ తొలి మ్యాచ్ నుంచి 'ఫ్రంట్ పుట్ నోబాల్' చెక్ చేయాల్సిన బాధ్యతను మూడో అంపైర్‌కు అప్పగించింది. 'ఇకపై నోబాల్స్‌ను గమనించాల్సిన పని థర్డ్ అంపైర్లదే. ప్రతీ బంతి గీత దాటక ముందే డెలివరీ అయిందా లేదా గమనించాల్సింది వాళ్లే. ఒకవేళ క్రీజ్ దాటినట్లు కనిపిస్తే.. ఫీల్డ్ అంపైర్‌కు సమాచారం అందించాలి. అతడు దాన్ని నోబాల్‌గా ప్రకటిస్తాడు. దీంతో మ్యాచ్ కాస్త ఆలస్యమవుతుందనే వాదనలు ఉన్నా.. కచ్చితమైన ఫలితాల కోసం దీన్ని ప్రయోగించాల్సిందే' అని ఐసీసీ తేల్చి చెప్పింది.

## మ్యాచ్‌కు భారీ భద్రతా ఏర్పాట్లు



ఉప్పల్ స్టేడియంలో గురువారం మీడియా సమావేశంలో పాల్గొన్న హెచ్‌సీఏ అధ్యక్షుడు అజారుద్దీన్, రాచకొండ సీపీ మహేష్ భగవత్ తదితరులు

**ఉప్పల్, నమస్తే తెలంగాణ:** భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య శుక్రవారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం వేదికగా జరిగే టీ20 మ్యాచ్ కోసం భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 1800 మందితో పటిష్ఠ పోలీస్ బందోబస్తు పెట్టినట్లు రాచకొండ సీపీ మహేష్ భగవత్ పేర్కొన్నారు. గురువారం స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీతో పాటు హెచ్‌సీఏ అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సీపీ భగవత్ మాట్లాడుతూ భారత్, విండీస్ మ్యాచ్ ప్రశాంతంగా జరిగేలా క్రీడాభిమానులు సహకరించాలన్నారు. బ్లాక్‌డే సందర్భంగా ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని, మత్తు పదార్థాలు పూర్తిగా నిషేధించామన్నారు. స్టేడియం ప్రాంతాలను 300 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని తెలిపారు. మ్యాచ్‌కు వచ్చే ప్రేక్షకులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత స్టేడియంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. మ్యాచ్‌కు వచ్చే ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని మెట్రో రైలు సర్వీసులను రాత్రి 1 వరకు నడుపుతామని తెలిపారు. మ్యాచ్‌కు వచ్చే ప్రేక్షకులు నిబంధనలు పాటించి, పోలీసులకు సహకరించాలని అజర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఉపాధ్యక్షుడు జాన్ మనోజ్, మల్కాజ్‌గిరి డీసీపీ రక్షితామూర్తి, అడిషనల్ డీసీపీ మనోహర్, ఉప్పల్ ఏసీపీ నర్సింహారెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రసవత్తరంగా జాతీయ రోయింగ్ టోర్నీ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** హుస్సేన్ సాగర్ వేదికగా 38వ జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. దేశంలోని దాదాపు అన్ని రాష్ర్టాలకు చెందిన రోవర్లు పోటీపడుతున్న టోర్నీలో గురువారం జరిగిన 2వేల మీటర్ల విభాగంలో మధ్యప్రదేశ్, సర్వీసెస్ జట్లు సత్తాచాటాయి. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన మధ్యప్రదేశ్, సర్వీసెస్ ఐదేసి స్వర్ణ పతకాలను తమ ఖాతాలో వేసుకున్నాయి. ఒడిశా, భారత ఆర్మీ నాలుగు రజత పతకాలు సొంతం చేసుకోగా, బీహార్‌కు ఓ స్వర్ణం, పంజాబ్‌కు ఒక రజతం, రెండు కాంస్య పతకాలు దక్కాయి. శుక్రవారం 500 మీటర్ల విభాగంలో హీట్స్, రెపిచేజ్ రౌండ్లు జరుగుతాయని, పోటీలకు ఆఖరి రోజైన శనివారం సెమీస్, ఫైనల్స్ ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## శాస్త్రి, కోహ్లీతో మాట్లాడుతా: గంగూలీ

**కోల్‌కతా:** ఆస్ట్రేలియాలో వచ్చే ఏడాది జరుగనున్న టీ20 ప్రపంచకప్ కోసం టీమ్ఇండియా ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రపంచకప్ కోసం తన వద్ద కొన్ని ఆలోచనలు ఉన్నాయని, వాటి గురించి హెడ్ కోచ్ రవిశాస్త్రి, కెప్టెన్ విరాట్ కోహ్లీతో చర్చిస్తానని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ చెప్పాడు. గురువారమిక్కడ జరిగిన ఓ టీవీ షో కార్యక్రమంలో దాదా మాట్లాడాడు. 'టీ20 క్రికెట్‌లో లక్ష్యఛేదన అద్భుతంగా చేస్తున్నప్పుడు.. మొదట బ్యాటింగ్ చేసినప్పుడు కూడా అలాంటి ప్రదర్శన కనబరచాలి. దీనిపై నాకు కొన్ని ఆలోచనలు ఉన్నాయి. కోచ్ రవిశాస్త్రి, కెప్టెన్ కోహ్లీ, మేనేజ్‌మెంట్‌తో వాటిని పంచుకుంటా. టీమ్ఇండియా కావాల్సినన్ని అంతర్జాతీయ టీ20లు ఆడకపోయినా.. ప్రపంచకప్ కోసం పూర్తి సిద్ధంగా ఉంది' అని గంగూలీ అన్నాడు. టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత్ అగ్రస్థానంలో కొనసాగుతుండడంపై జట్టును అభినందించాడు. తనకు ఆల్‌టైం బెస్ట్ సినిమా షోలే అని.. ఆ సినిమాలో అమితాబ్ బచ్చన్‌తో పాటు గబ్బర్ సింగ్ పాత్ర అంటే తనకెంతో ఇష్టమని గంగూలీ చెప్పాడు.

## ఆటను ఆటగానే చూడాలి



హర్ష భోగ్లే

**తెలుగుయూనివర్సిటీ:** బీసీసీఐలో పురుషుల ఆధిపత్యం కొనసాగుతున్నదని, మహిళలను భాగస్వామ్యం చేస్తూ అవకాశం కల్పించాల్సిన అవసరముందని ప్రముఖ వ్యాఖ్యాత హర్ష భోగ్లే అన్నాడు. సైఫాబాద్‌లోని విద్యారణ్య పాఠశాల ప్రాంగణంలో మంథన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన క్రికెట్ ఆన్, ఆఫ్ ద ఫీల్డ్ అనే అంశంపై భోగ్లే మాట్లాడాడు. 'ఆటను ఆటగానే చూడాలి, అంతే తప్పా రెండు దేశాల మధ్య యుద్ధంలా చూడవద్దన్నారు. ఐపీఎల్ వల్ల అనేక మంది యువతకు అవకాశాలు వచ్చి వెలుగులోకి వచ్చారన్నారు. క్రీడల వల్ల సంపాదనతో పాటు జీవితంలో స్థిరపడే అవకాశాలు మెరుగయ్యాయి' అని భోగ్లే అన్నాడు. ఈ సందర్భంగా ఉస్మానియాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు.

## భారత్ దూకుడు




**కఠ్మాండు (నేపాల్):** దక్షిణాసియా క్రీడల్లో భారత్ పతకాల రేసులో దూసుకెళుతున్నది. టోర్నీ నాలుగో రోజైన గురువారం మన ప్లేయర్లు రెచ్చిపోవడంతో 30 స్వర్ణాలు సహా 53 పతకాలు మన ఖాతాలో చేరాయి. దీంతో ఓవరాల్‌గా 124 (62 స్వర్ణాలు, 41 రజతాలు, 21 కాంస్యాలు) పతకాలతో భారత్ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. గురువారం జరిగిన వుషు మహిళల పోటీల్లో శాంతనోయ్ దేవి (52 కేజీలు), పూనమ్ (75 కేజీలు), దీపిక (70 కేజీలు), సుశీల (65 కేజీలు), రోషిబినా దేవి (60 కేజీలు) స్వర్ణాలు సాధిస్తే పురుషుల విభాగంలో సునీల్ సింగ్, సూరజ్ సింగ్ పసిడి పతకాలతో మెరిశారు. స్విమ్మింగ్‌లో మొత్తం 11 పతకాలుగా రాగా.. వాటిలో నాలుగు స్వర్ణాలు, ఆరు రజతాలు, ఓ కాంస్యం ఉంది . పురుషుల 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో లిఖిత్ సెల్వరాజ్ ప్రేమ (2 నిమిషాల14.67 సెకన్లు) స్వర్ణం సాధించగా.. ధనుష్ సురేశ్ (2:19.27) రజతం పట్టాడు. మహిళల 100మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో దివ్యా సతిజ, 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో అపేక్ష పడిసిని పట్టగా... 400 మీటర్ల ఫ్రీస్టైల్ రిలేలో భారత జట్టు అగ్రస్థానంలో నిలిచింది. అలాగే వెయిట్‌లిఫ్టింగ్‌లోనూ భారత్‌కు నాలుగు స్వర్ణాలు దక్కాయి. మహిళల విభాగంలో దల్‌బెహెరా (45 కేజీల లోపు), స్నేహ సోరెన్ (49 కేజీలు), బింద్యారాణి దేవి (55 కేజీలు), పురుషుల పోటీల్లో సిద్ధార్థ్ గోగోయ్ (61 కేజీలు) పసిడి పతకాలను సాధించారు. అలాగే తైక్వాండో ప్లేయర్లు అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తూ మూడు స్వర్ణాలు సహా ఆరు పతకాలతో ఆకట్టుకున్నారు. గత రెండు రోజులు 20 పతకాలతో అదరగొట్టిన మన అథ్లెట్లు.. గురువారం ఓ పసిడి సహా ఆరు పతకాలతో మెరిశారు.



దీప్తి

పంజాబ్ వేదికగా జరుగుతున్న 65వ జాతీయ పాఠశాలల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 100మీటర్ల రేసులో స్వర్ణం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్ దీప్తి

## బీడబ్ల్యూఎఫ్ అవార్డుకు సాత్విక్-చిరాగ్

**న్యూఢిల్లీ:** కొంతకాలంగా పురుషుల డబుల్స్‌లో అద్భుత ప్రదర్శన చేస్తున్న భారత ప్లేయర్లు సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి – చిరాగ్‌శెట్టి ద్వయం.. బ్యాడ్మింటన్ అంతర్జాతీయ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) 'మోస్ట్ ఇంప్రూవ్డ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు నామినేట్ అయింది. ఈ ఏడాది సంచలన ప్రదర్శనతో తమ కన్నా మెరుగైన ర్యాంకు ప్లేయర్లను ఓడించి థాయ్‌లాండ్ ఓపెన్‌ను సాత్విక్ జోడీ కైవసం చేసుకుంది. దీంతో సూపర్ 500 సిరీస్ టైటిల్ గెలిచిన భారత తొలి పురుష ద్వయంగా చరిత్ర సృష్టించింది. ఈ ఏడాది వివిధ టోర్నీల్లో 11స్వర్ణాలు, మూడు రజతాలు, నాలుగు కాంస్యాలు సాధించి అద్భుత ఫామ్‌లో ఉన్న భారత పారా షట్లర్ ప్రమోద్ భగత్ 'పురుష పారా బ్యాడ్మింటన్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు నామినేట్ అయ్యాడు. అయితే ప్రపంచ చాంపియన్ పీవీ సింధు అవార్డుకు నామినేట్ అవలేదు. మహిళల సింగిల్స్‌లో తైజూ ఇంగ్(చైనీస్ తైపీ)కు అవకాశం దక్కింది.




### పీఎంసీ స్కాంలో ఫోరెన్సిక్ నివేదిక త్వరలో

పంజాబ్ మహారాష్ట్ర సహకార(పీఎంసీ) బ్యాంకులో జరిగిన కుంభకోణంపై ప్రత్యేక ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక ఈ నెల చివరినాటికి రావచ్చునని శక్తికాంత దాస్ స్పష్టంచేశారు. సహకార బ్యాంకుల్లో జరుగుతున్న మోసాలను అరికట్టడానికి మార్గదర్శకాలు మార్చివేయాలని, అలాగే రెగ్యులేటరింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఇదివరకే కేంద్రానికి సూచించినట్లు ఆయన చెప్పారు. పీఎంసీ వద్ద రియల్టీ సంస్థ హెచ్‌డీఐఎల్ రూ.6,500 కోట్ల మేర రుణం తీసుకొని ఎగ్గొట్టిన విషయాన్ని ముంబై పోలీసులు గుర్తించారు. ఈ రుణాల్లో రూ.4,500 కోట్లు నిరర్థక ఆస్తులుగా గుర్తించారు.

### ఎన్‌బీఎఫ్‌సీలకు రుణాలు ఇవ్వండి

బ్యాంకింగేతర ఆర్థిక సేవల సంస్థలకు ప్రధాన బ్యాంకులు రుణాలు ఇవ్వండని శక్తికాంత దాస్ సూచించారు. ఆర్థిక సంక్షోభంతో మూతపడిన డీహెచ్‌ఎఫ్‌ఎల్ దివాలా ప్రకటించిన నేపథ్యంలో దాస్ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న 50 ఎన్‌బీఎఫ్‌సీలపై రిజర్వు బ్యాంక్ ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ సంస్థల ఆర్థిక లావాదేవీలు, అన్ని సక్రమంగా సాగుతున్నాయన్న దాస్..అతిపెద్ద ఎన్‌బీఎఫ్‌సీలను మూసివేయబోనివ్వమని ఆయన స్పష్టంచేశారు. గతేడాది సెప్టెంబర్ నుంచి ఎన్‌బీఎఫ్‌సీలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.



# వడ్డీరేట్లు యథాతథం

- ద్రవ్యోల్బణం ఒత్తిడితో వరుస తగ్గింపులకు బ్రేక్
- ఉల్లి సెగతో అంచనాలు తలకిందులు
- ఆర్థిక మందగమనంపై ఆందోళన
- పరపతి సమీక్షలో రిజర్వు బ్యాంక్



గురువారం ముంబైలో ద్రవ్య సమీక్ష సందర్భంగా ఆర్బీఐ గవర్నర్ దాస్‌తో డిప్యూటీ గవర్నర్లు

**ముంబై, డిసెంబర్ 5:** వడ్డీరేట్ల తగ్గింపునకు ఆర్బీఐ విరామమిచ్చింది. వృద్ధిరేటు కోసం వరుసగా రెపో, రివర్స్ రెపోలకు కోతపెట్టిన రిజర్వ్ బ్యాంక్.. ఈసారి ద్రవ్యసమీక్షలో మాత్రం ద్రవ్యోల్బణానికి ప్రాధాన్యతనిచ్చింది. మార్కెట్‌లో ఠారెత్తిస్తున్న ఉల్లిగడ్డ ధర.. ద్రవ్యోల్బణం అంచనాల్ని ఒక్కసారిగా తలకిందులు చేసేసింది. దీంతో జీడీపీ దిగజారుతున్నా పట్టించుకోని సెంట్రల్ బ్యాంక్.. ద్రవ్యోల్బణం కట్టడే లక్ష్యంగా తమ రూటును మార్చుకున్నది. కిలో ఉల్లి ధర దేశవ్యాప్తంగా సెంచరీ కొడుతున్న విషయం తెలిసిందే. దీంతో ఆర్బీఐ అప్రమత్తం కావాల్సి వచ్చింది. ఫలితంగా ఈ ఏడాది ఆరంభంలో మొదలైన రేట్ల తగ్గింపులు. ఆఖర్లో ఆగిపోయినట్లైంది. అనూహ్యంగా గతేడాది ఆర్బీఐ పగ్గాలు చేపట్టిన శక్తికాంత దాస్.. జీడీపీ బలోపేతానికి కీలక వడ్డీరేట్లను వరుసగా తగ్గిస్తూపోయిన విషయం తెలిసిందే. ఫలితంగా ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు జరిగిన ఐదు ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో రెపో రేటు 135 బేసిస్ పాయింట్లు దిగివచ్చింది. ఇటీవలికాలంలో ఎన్నడూ లేనివిధంగా ఓసారి 35 బేసిస్ పాయింట్లను తగ్గించిన సంగతీ విదితమే. కానీ వృద్ధిరేటు పుంజుకోవడం మాటటుంచితే ద్రవ్యోల్బణం కోరలు చాస్తుండటం ఆర్బీఐని కలవరపెట్టింది. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) ఐదో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఈసారి వడ్డీరేట్ల జోలికి వెళ్లకూడదని ఆరుగురు సభ్యులున్న ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ముక్తకంఠంతో తీర్మానించింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ సమీక్ష వివరాలను గురువారం ఆర్బీఐ వెల్లడించింది. కమిటీ ఏకగ్రీవ నిర్ణయం వల్లే వరుస వడ్డీరేట్ల కోతలకు బ్రేకులు పడ్డాయి. ద్రవ్య సమీక్ష అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆర్బీఐ గవర్నర్ దాస్ మాట్లాడుతూ బ్యాంకులు రుణాలపై వడ్డీరేట్లను తగ్గించి తమ నిర్ణయాల ప్రయోజనాలను ఖాతాదారులకు అందించారని ఆనందం వ్యక్తం చేశారు. ఎప్పట్నుంచో ఆర్బీఐ ఆశిస్తున్నట్లుగా రెపో ఆధారిత రుణాల వడ్డీరేట్ల విధానాన్ని బ్యాంకులు అమలుపరుచడం బాగుందన్నారు. ఇక వృద్ధిరేటు మందగమనంపై కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఆర్బీఐ పనిచేస్తున్నదని చెప్పారు. ద్రవ్యలోటు లక్ష్యాలను ప్రభుత్వం అందుకోబోదన్న దానిపై మాకు ఎలాంటి దిగులూ లేదన్నారు. డిజిటల్ కరెన్సీ జారీపై ఇప్పుడే మాట్లాడబోమన్న ఆయన ప్రైవేట్ డిజిటల్ కరెన్సీకి ఆర్బీఐ వ్యతిరేకమని, వాటిని అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పీర్ 2 పీర్ రుణదాతల కోసం రుణ పరిమితిని ఆర్బీఐ పెంచింది. ప్రస్తుతం రూ.10 లక్షలుగా ఉంటే, రూ.50 లక్షలకు పెంచింది. రూ.500 కోట్లకుపైగా ఆస్తులను కలిగి ఉన్న సహకార బ్యాంకులను సెంట్రల్ రిపాజిటరీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆన్ లార్జ్ క్రెడిట్స్ (సీఆర్ఐఎల్‌సీ) కిందకు తేవాలని ఆర్బీఐ ప్రతిపాదించింది. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నెట్ బ్యాంకింగ్ సమస్యలను ఆర్బీఐ పరిశీలిస్తున్నదని డిప్యూటీ గవర్నర్ ఎంకే జైన్ తెలిపారు.

**ద్రవ్యోల్బణం సెగ**

ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థాని (అక్టోబర్-మార్చి)కి ద్రవ్యోల్బణం అంచనాలను ఆర్బీఐ పెంచేసింది. 5.1-4.7 శాతంగా నమోదు కావచ్చన్నది. ఇంతకుముందు 3.5-3.7 శాతంగానే ఉండొచ్చని చెప్పింది. కానీ ఇటీవలికాలంలో పెరిగిన కూరగాయల ధరలు.. ద్రవ్యోల్బణానికి సెగ పెడుతున్నాయి. ముఖ్యంగా ఉల్లిగడ్డ ధర.. ఈసారి ఆర్బీఐ వడ్డీరేట్ల కోతలకు బ్రేకులు వేసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టమాట ధర కూడా ఆందోళనకరంగా ఉండటంతో ఆహార ద్రవ్యోల్బణం భయాలు ఆర్బీఐని చుట్టుముట్టాయి. ఖరీఫ్ సీజన్ ఆఖరుకల్లా మార్కెట్‌లోకి సరఫరా పెరిగితే కొంత ఉపశమనం లభించవచ్చన్న అంచనాలున్నప్పటికీ ఆర్బీఐ మాత్రం రిస్క్ తీసుకోలేదు. దీంతోనే వడ్డీరేట్ల జోలికి వెళ్లలేకపోయింది.

### 'ఆశ.. ప్రతీసారి తగ్గిస్తామనుకోవద్దు'

ద్రవ్యసమీక్ష జరిగిన ప్రతీసారి ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తుందని అనుకోవద్దంటూ దాస్ అన్నారు. అంతకుముందు వరుసగా ఐదు ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లను ఆర్బీఐ తగ్గించింది. ఈ క్రమంలో ఈసారీ వడ్డీరేట్లు తగ్గుతాయనే అంచనాలు వ్యక్తమైయ్యాయి. కానీ ఈ అంచనాలను తలకిందులు చేస్తూ ఎవరూ ఊహించని రీతిలో వడ్డీరేట్ల కోతలకు ఆర్బీఐ బ్రేకేసింది. 'అదేపనిగా వడ్డీరేట్లు తగ్గుతాయని ఆశించొద్దు' అన్నారు. అయితే బడ్జెట్ తర్వాత వడ్డీరేట్ల కోతలకు అవకాశాలున్నాయన్న సంకేతాలనిచ్చారు. అయినప్పటికీ ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతున్నందున కొంతకాలం వరకు వడ్డీరేట్ల కోతలుండవన్న అభిప్రాయాలు విశ్లేషకుల నుంచి వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ విరామ సమయంలో తాము గతంలో తగ్గించిన వడ్డీరేట్ల ప్రభావాన్ని విశ్లేషించనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ దాస్ చెప్పారు.

### ముఖ్యాంశాలు

- రెపో రేటు 5.15 శాతం వద్ద యథాతథం
- 4.90 శాతంగానే రివర్స్ రెపో రేటు
- 4 శాతం వద్ద నగదు నిల్వల నిష్పత్తి
- ఈ ఆర్థిక సంవత్సరానికి 6.1 శాతం నుంచి 5 శాతానికి క్షీణించిన జీడీపీ అంచనా
- ఇంకా కోలుకోని వినియోగ సామర్థ్యం
- ద్వితీయార్థంలో 5.1-4.7 శాతం మధ్య ద్రవ్యోల్బణం
- ఈ నెల 3 నాటికి 451.7 బిలియన్ డాలర్లకు విదేశీ మారక ద్రవ్య నిల్వలు
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 4-6 మధ్య తదుపరి ద్రవ్యసమీక్ష

### ఎవరేమన్నారు?

'ద్రవ్యోల్బణం పెరుగడం వల్లే ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గించలేకపోయింది. జీడీపీ క్షీణిస్తున్నా.. ద్రవ్యోల్బణం భయాలకే పెద్దపీట వేసింది'

**-రజ్నీశ్‌కుమార్, ఎస్బీఐ చైర్మన్**

'వడ్డీరేట్లను తగ్గించకపోవడం నిరాశను కలిగించింది. వృద్ధిరేటుకు అనుగుణంగా ఆర్బీఐ ద్రవ్యసమీక్ష కొనసాగాల్సిన అవసరం ఉన్నది'

**-సందీప్ సోమని, ఫిక్కీ అధ్యక్షుడు**

'ఈ విరామం తాత్కాలికమైనదేనని భావిస్తున్నాం. ద్రవ్యోల్బణం గణాంకాలు ఇప్పటికీ ఆర్బీఐ ఆమోదయోగ్య పరిధిలోనే ఉన్నాయి'

**-బీకే గోయెంకా, అసోచామ్ అధ్యక్షుడు**

'పెట్టుబడులకు ఊతమిచ్చే, ఉత్పత్తి విస్తరణకు ప్రోత్సాహాన్నిచ్చే విధానాలను ఆర్బీఐ అనుసరించాలి. పరిశ్రమకు రుణాలు అందాలి'

**-డీకే అగర్వాల్, పీహెచ్‌డీ చాంబర్ అధ్యక్షుడు**

'ఆర్బీఐ నిర్ణయం అసంతృప్తిని కలిగించింది. రెపో రేటును 1 శాతం తగ్గించాల్సిన అవసరం ఉన్నది. అప్పుడే గృహ రుణాలు చౌకవుతాయి'

**-నిరంజన్ హీరానందని, నరెడ్కో అధ్యక్షుడు**

'నిర్మాణ రంగం నిరుత్సాహకరంగా కొనసాగుతున్నది. మునుపెన్నడూ లేనివిధంగా గృహ రుణాల డిమాండ్ 8 శాతం దిగువకు చేరింది. ఆర్బీఐ వడ్డీరేట్లు తగ్గితే బాగుండేది'

**-అనుజ్ పూరి, అనరాక్ చైర్మన్**

### ఈసారి వృద్ధిరేటు 5 శాతమే



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ 5 శాతానికే పరిమితం కావచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. అక్టోబర్ సమీక్షలో ఇది 6.1 శాతంగా ఉండటం గమనార్హం. ఆర్థిక మందగమనం, దిగజారిన వినియోగ సామర్థ్యం, దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితుల మధ్య భారత వృద్ధిరేటు నిరాశాజనకంగానే ఉండొచ్చని సెంట్రల్ బ్యాంక్ అభిప్రాయపడింది. ఈ జూలై-సెప్టెంబర్‌లో జీడీపీ 4.5 శాతానికి పతనమైన విషయం తెలిసిందే. ఇది ఆరేండ్ల కనిష్ఠ స్థాయి. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)లో జీడీపీ 5.9-6.3 శాతంగా ఉండొచ్చన్న ఆర్బీఐ.. ద్వితీయార్ధం (అక్టోబర్-మార్చి)లో 4.9-5.5 శాతంగా నమోదు కావచ్చన్నది.

### కొత్త ప్రీ-పెయిడ్ కార్డు



ఆర్బీఐ ఓ సరికొత్త ప్రీ-పెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్ (పీపీఐ)ను పరిచయం చేయాలని చూస్తున్నది. వస్తు, సేవల లావాదేవీల కోసం మాత్రమే దీన్ని ఉపయోగించుకోవచ్చు. దీని పరిమితి విలువ రూ.10 వేలు. డిజిటల్ చెల్లింపుల్లో పీపీఐలు కీలక పాత్ర పోషించగలవన్న ఆశాభావాన్ని ఆర్బీఐ వ్యక్తం చేస్తున్నది. పీపీఐలకున్న ఆదరణనుబట్టి కార్డు వినియోగానికి సంబంధించి వెసులుబాటు కల్పిస్తామని రిజర్వ్ బ్యాంక్ చెబుతున్నది. వీటి లోడింగ్, రీలోడింగ్ బ్యాంక్ ఖాతాల నుంచి మాత్రమే జరుగుతుందని స్పష్టం చేసింది. ఈ నెలాఖర్లోగా ఈ కార్డులకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేస్తామని ప్రకటించింది.

# మార్కెట్లకు ఆర్బీఐ షాక్

- సెన్సెక్స్ 71, నిఫ్టీ 25 పాయింట్ల పతనం



**ముంబై, డిసెంబర్ 5:** తీవ్ర ఊగిసలాటలో కొనసాగిన స్టాక్ మార్కెట్లు చివరకు నష్టాలతో ముగిశాయి. అందరి అంచనాలను పటాపంచలు చేస్తూ రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ తీసుకున్న నిర్ణయం మార్కెట్ల పతనాన్ని శాసించింది. భారీ లాభాలతో ప్రారంభమైన బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్..ఆర్బీఐ ప్రకటన వెలువడగానే నష్టాల్లోకి జారుకున్నది. భారత వృద్ధిరేటు అంచనాను 5 శాతానికి తగ్గిస్తూ సెంట్రల్ బ్యాంక్ ప్రకటన మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. తీవ్ర ఊగిసలాట మధ్య కొనసాగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 70.70 పాయింట్లు తగ్గి 40,779.59 కి జారుకోగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 24.80 పాయింట్లు పతనం చెంది 12,018.40 వద్ద ముగిసింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి వరుసగా ఐదుసార్లు వడ్డీరేట్లను తగ్గించిన రిజర్వుబ్యాంక్..ఆరోసారి తగ్గిస్తారని అందరు ఆశించారు, కానీ ద్రవ్యోల్బణం ఎగబాకుతుండటంతో వడ్డీరేట్లు యథాతథానికి ఉంచడానికే మొగ్గుచూపిందని మార్కెట్ విశ్లేషకులు వెల్లడించారు.

**కుదేలైన వడ్డీరేట్లకు సంబంధించిన షేర్లు**

సెంట్రల్ బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో వడ్డీరేట్లకు సంబంధించిన రంగాలైన బ్యాంకింగ్, వాహన రంగ షేర్లు భారీగా నష్టపోయాయి. కానీ, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన షేర్లు మిశ్రమంగా ట్రేడ్ అయ్యాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.21 శాతం పతనమవగా, ఆర్‌బీఎల్ బ్యాంక్ 1.95 శాతం, ఎస్బీఐ 1.65 శాతం, యెస్ బ్యాంక్ 1.51 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.39 శాతం, ఫెడరల్ బ్యాంక్ 1.25 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకుల షేర్లు పెట్టుబడిదారులను ఆకట్టుకోలేకపోయాయి. వీటితోపాటు టాటా మోటర్స్, హీరో మోటోకార్ప్, అశోక్ లేలాండ్, మదర్‌సన్ సుమీ సిస్టమ్స్, మారుతి సుజుకీ, బజాజ్ ఆటో, మహీంద్రా అండ్ మహీంద్రా, టీవీఎస్ మోటర్‌ల షేర్లు దిగువకు పడిపోయాయి. రియల్టీకి చెందిన ఫోనిక్స్ మిల్స్, సన్‌టెక్ రియల్టీ, మహీంద్రా లైఫ్‌స్పేస్ డెవలపర్స్, గోద్రేజ్ ప్రాపర్టీస్, ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్, ప్రిస్టేజ్ ఎస్టేట్స్ ప్రాజెక్టు తగ్గుముఖం పట్టగా, ఒబెరాయ్ రియల్టీ, శోభ, ఓమెక్స్, డీఎల్‌ఎఫ్‌లు మాత్రం లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే మెటల్, బేసిక్ మెటీరియల్, ఇంధనం షేర్లు తగ్గగా..క్యాపిటల్ గూడ్స్, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు మాత్రం అధికమయ్యాయి. కానీ, టీసీఎస్, ఐటీసీ, ఎల్ అండ్‌టీ, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీలు మాత్రం రెండు శాతం వరకు మార్కెట్ వాటాను పెంచుకున్నాయి.

# ఆల్‌కార్గో చేతికి గతి!



- 44 శాతం వాటాను కొనుగోలు చేస్తున్న సంస్థ
- ఒప్పందం విలువ రూ.416 కోట్లు

**ముంబై, డిసెంబర్ 5:** దేశంలో అతిపెద్ద రవాణా సదుపాయాల సంస్థల్లో ఒకటైన ఆల్‌కార్గో లాజిస్టిక్..వ్యాపారాన్ని దేశవ్యాప్తంగా విస్తరించే క్రమంలో భాగంగా హైదరాబాద్ కేంద్రస్థానంగా సేవలు అందిస్తున్న గతి లిమిటెడ్‌లో అత్యధిక వాటాలు కొనుగోలు చేయబోతున్నది. ఎక్స్‌ప్రెస్ లాజిస్టిక్ మార్కెట్లో ప్రవేశించే ఉద్దేశంలో భాగంగా గతిలో 44 శాతం వాటాను కొనుగోలు చేయాలనుకుంటున్నది. ఒప్పందం విలువ రూ.416 కోట్లు. మూడు దశల్లో జరుగనున్న ఈ ఒప్పందంలో భాగంగా తొలి విడుత 1.03 కోట్ల షేర్లను కొనుగోలు చేయనుండగా, ప్రిఫరెన్షనల్ జారీ చేయడం ద్వారా మరో 1.33 కోట్ల షేర్లను(18 శాతం) ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూపునకు సంబంధించిన షేర్లను హస్తగతం చేసుకోవాలనుకుంటున్నది. వీటిలో కంపెనీ ఎండీ మహేంద్ర కుమార్ అగర్వాల్, మహేంద్ర ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైయిజరీ, టీసీఐ ఫిన్‌కేర్, గతిలకు ఉన్న ఒక్కోషేరును రూ.75 పెట్టి కొనుగోలు చేయనున్నది. రెండో విడుతలో భాగంగా ఆల్‌కార్గో..ఆఫెన్ ఆఫర్ ద్వారా 26 శాతం వాటాకు సమానమైన 3.17 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయాలనుకుంటున్నది. ఈ మొత్తం ఒప్పందం విలువ రూ.416 కోట్ల స్థాయిలో ఉంటుందని ఆల్‌కార్గో చైర్మన్ శశి కిరణ్ శెట్టి తెలిపారు. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా మరో సర్వీసును అందించినట్లు అవుతున్నదని, లాజిస్టిక్ విభాగంలో ఇప్పటికే తనదైన ముద్రవేస్తున్న సంస్థ..ఇక నుంచి ఎక్స్‌ప్రెస్ లాజిస్టిక్ విభాగంలో సత్తా చాటడానికి ఈ కొనుగోలు ఒప్పందం దోహదం చేయనున్నదన్నారు. 2023 నాటికి దేశీయ లాజిస్టిక్ పరిశ్రమ రూ.48 వేల కోట్లకు చేరుకోనున్నదని డెలాయిట్ నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం గతితో కలుపుకొని ఆల్‌కార్గో సంస్థ..లాజిస్టిక్, మల్టీమోడల్ రవాణా, కంటైనర్ సరుకు స్టేషన్లు/ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోలు, ప్రాజెక్టు, ఇంజినీరింగ్ సొల్యూషన్స్, గిడ్డంగులు, డిస్ట్రిబ్యూషన్, కాంటాక్ట్ లాజిస్టిక్, లాజిస్టిక్ పార్క్‌లను సైతం ఏర్పాటు చేసింది. దేశీయ ఈ-కామర్స్ సంస్థలు నూతన మార్కెట్లపై దృష్టి సారించడం, సాంప్రదాయక సేవలు అందిస్తున్న గతి లాంటి సంస్థల సేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయన్నారు. ప్రస్తుతం గతి 727 జిల్లాల్లో 19 వేల పిన్ కోడ్ నంబర్లకు సేవలు అందిస్తున్నది. ఇరు సంస్థల మధ్య కుదిరిన వాటా విక్రయ ఒప్పందంతో నూతన విభాగంలోకి ప్రవేశించడానికి లైన్‌క్లియర్ అయిందని గతి డిప్యూటీ ఎండీ బాలా అఘోరమూర్తి తెలిపారు.

## రికార్డు స్థాయికి ఫారెక్స్ రిజర్వులు



**ముంబై, డిసెంబర్ 5:** విదేశీ మారకం నిల్వలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఈ నెల 3తో ముగిసే నాటికి ఫారెక్స్ రిజర్వులు 451.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు శక్తికాంత దాస్ తాజాగా వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 38.8 బిలియన్ డాలర్ల మేర పెరిగినట్లు పరపతి సమీక్ష సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాస్ తెలిపారు. నవంబర్ 22తో ముగిసిన వారంలో రిజర్వులు మరో 347 మిలియన్ డాలర్లు పెరిగి 448.596 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. గత కొన్ని నెలలుగా రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న నిల్వలు తొలిసారిగా 450 బిలియన్ డాలర్లు దాటాయని దాస్ పేర్కొన్నారు.

## పరారీ ఆర్థిక నేరగాడిగా నీరవ్ మోదీ

- ప్రకటించిన ముంబై ప్రత్యేక కోర్టు

**ముంబై, డిసెంబర్ 5:** ప్రభుత్వరంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)ని మోసం చేసిన కేసులో ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీని పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించింది ముంబైలోని ప్రత్యేక కోర్టు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సూచనల మేరకు ప్రత్యేక కోర్టు ప్రకటించిన రెండో వ్యక్తి నీరవ్ మోదీ. ఇదివరకే కింగ్‌ఫిషర్ అధినేత విజయ్ మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కేసుపై నీరవ్ మోదీ, ఈడీ తరపున వాదిస్తున్న న్యాయవాదుల వాదనలు విన్న తర్వాత ప్రత్యేక కోర్టు జడ్జి వీసీ బార్డే..మోదీని పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించారు. దేశ బ్యాం కింగ్ రంగంలో అతిపెద్ద కుంభకోణానికి కేంద్రమైన పీఎన్‌బీ వద్ద నీరవ్ మోదీ, ఆయ న మేనమామ రూ.14 వేల కోట్లకు పైగా రుణాలు తీసుకొని నీద ఎగ్గొట్టి విదేశాలకు గతేడాది జనవరిలోనే పారిపోయారు. ఈ కేసులో నీరవ్ మోదీ లండన్‌లో అరెస్ట్ అక్క డి జైలు శిక్షణు అనుభవిస్తున్నారు. అంతకుముందు నీరవ్ మోదీపై ప్రీవెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్(పీఎంఎల్‌ఏ) చట్టం కింద దాఖలు చేసిన కేసులో ఎవిడెన్స్ చూపాలని ఆయన తరపున వాదిస్తున్న న్యాయవాది ఈడీని కోరారు. దేశం విడిచి పారిపోయిన నేరస్తులను పట్టుకోవడానికి గతేడాది కేంద్ర ప్రభుత్వం..పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్ళ చట్టం-2018ని ప్రవేశపెట్టింది.

## మరో 22 రూట్లకు గోఎయిర్

- ఈ నెల 20 నుంచి అందుబాటులోకి సర్వీసులు

**శంషాబాద్(నమస్తే తెలంగాణ), డిసెంబర్ 5:** దేశంలో అత్యంత విశ్వసనీయత, వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన సంస్థ గో-ఎయిర్..మరో 22 కొత్త రూట్లకు విమాన సర్వీసులు ఆరంభించబోతున్నట్లు ప్రకటించింది. వీటిలో హైదరాబాద్-కొచ్చిలతోపాటు వారణాసి-ఇండోర్, బెంగుళూరు-కొచ్చి-బెంగుళూరు, ఢిల్లీ- వారణాసి, అహ్మదాబాద్-వారణాసి, ఢిల్లీ- ఇండోర్, అహ్మదాబాద్-ఇండోర్ తదితర 6 కొత్త రూట్లకు విమాన సేవలు అందించబోతున్నది. ఈ నెల 20 నుంచి ఈ నూతన విమానాలు అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ జెహ్ వాడియా మాట్లాడుతూ... గడిచిన ఏడాదికాలంలో నెట్‌వర్క్ సామర్థ్యం 33 శాతం పెరిగిందని, కొత్తగా 17 విమానాలను కొనుగోలు చేయడంతో 100 నూతన రూట్లకు సర్వీసులు అందించడానికి వీలు పడుతున్నదన్నారు. అంతర్జాతీయ రూట్లలో భాగంగా పుకెట్, మాలే, అబుదాబి, మస్కట్, దుబాయ్, బ్యాంకాక్, కువైట్, సింగపూర్, కన్నూర్, ఐజాల్ తదితర 10 కొత్త విమానాశ్రయాలతో అనుసంధానం ఏర్పడిందని వివరించారు. సంస్థ విమాన సేవలు ఆరంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 7.86 కోట్ల మంది ప్రయాణికులకు విమాన సేవలు అందించగా..రాబోయే రెండేండ్ల కాలంలో 10 కోట్ల మార్క్‌కు చేరుకునే అవకాశం ఉన్నదన్నారు.

## జీతం తగ్గుతుందేమో!

- విరామం అనంతరం మళ్లీ ఉద్యోగాల్లోకి చేరాలనుకునే మహిళల్లో భయాలు
- ఓ ఆన్‌లైన్ సర్వేలో వెల్లడి



**ముంబై, డిసెంబర్ 5:** చాలాకాలం తర్వాత తిరిగి ఉద్యోగాల్లో చేరాలనుకునే మహిళ్లలో దాదాపు 70 శాతం మంది తమ జీతాలు ఈసారి తక్కువగా ఉంటాయేమోనని భయపడుతున్నారు. అవతార్ గ్రూప్ రూపొందించిన ఓ ఆన్‌లైన్ సర్వే ఈ మేరకు తెలియజేసింది. నిజానికి చాలామంది కార్పొరేట్లు మళ్లీ తమ మహిళా ఉద్యోగుల రాకను స్వాగతిస్తున్నా.. ఈ భయాలు నెలకొన్నాయని సదరు అధ్యయనంలో అవతార్ వెల్లడించింది. వివాహం, మాతృత్వం తదితర వ్యక్తిగత, ఇతరత్రా కారణాలతో ఉద్యోగం మానేసి తిరిగిప్పుడు ఉద్యోగంలో చేరాలనుకుంటున్న స్త్రీలు దేశవ్యాప్తంగా 70 లక్షల మందికిపైగా ఉన్నారు. ఇందులో మూడింటా రెండు వంతులకుపైగా మహిళలు (69 శాతం).. రీఎంట్రీలో తమ జీతం తక్కువగా ఉండొచ్చని ఆందోళన చెందుతున్నారు. 'మాతృత్వ వేతన జరిమానా'గా దీన్ని సర్వే నిర్వాహకులు అవతార్ గ్రూప్ అభివర్ణిస్తుండటం గమనార్హం. కాగా, మళ్లీ ఉద్యోగాల్లోకి రావాలనుకుంటున్న 783 మంది మహిళల అభిప్రాయాల ఆధారంగా ఈ ఏడాది ఆగస్టు-సెప్టెంబర్ మధ్య సర్వే చేశారు. ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరిగింది. ఇక 56 శాతం మంది మహిళలు తమ కెరియర్‌ను మధ్యలోనే విడిచిపెట్టామని చెప్పారు. 31 శాతం మంది కెరియర్ ఆరంభంలోనే గుడ్‌బై చెప్పాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు నాలుగో పారిశ్రామిక విప్లవ శకంలో ఉన్నా.. ఇప్పటికీ 23 శాతం మంది ఆడవారికి కెరియర్ రీఎంట్రీకి సంబంధించి ఇంటి సభ్యుల నుంచి మద్దతు లభించడం లేదని తాజా సర్వేలో తేలింది. చాలాకాలం విరామం, నైపుణ్యంపై అనుమానాలు ఈ మహిళలకు ప్రధాన అవరోధాలుగా మారుతున్నాయి. ఆర్థిక భద్రత, విద్య కారణంగా మహిళలు మళ్లీ ఉద్యోగ జీవితంలోకి రావాలనుకుంటున్నారని అవతార్ వ్యవస్థాపక ప్రెసిడెంట్ సౌందర్య రాజేశ్ తెలిపారు. మహిళల్ని ప్రోత్సహించే విధానాలను అన్ని సంస్థలు అమలుపరిస్తే ఈ రకమైన భయాందోళనలకు స్థానం ఉండదని అభిప్రాయపడ్డారు.

## ఎంజీ నుంచి తొలి విద్యుత్ కారు

- ఒకేసారి చార్జింగ్‌తో 340 కిలోమీటర్ల ప్రయాణం
- 8.5 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 5:** చైనాకు చెందిన ఎస్‌ఏఐసీ మోటర్ కార్పొరేషన్ అనుబంధ సంస్థయైన ఎంజీ మోటర్..దేశీయ మార్కెట్లోకి తన తొలి విద్యుత్‌తో నడిచే కారును ప్రవేశపెట్టింది. ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మోడల్ 'జెడ్‌ఎస్'ను గురువారం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా కంపెనీ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ చాబా మాట్లాడుతూ..దేశీయ మార్కెట్లోకి చిన్న ఈవీ కారును ప్రవేశపెట్టాలనుకుంటున్నట్లు, ఈ చిన్న కారును ఇక్కడ తయారు చేయడం అంత సులభంకాకపోయినప్పటికీ వచ్చే మూడేండ్లకాలంలో దీనిని విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ కారు ధర రూ.10 లక్షల లోపు ఉండనున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. ఈవీలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో భవిష్యత్తులో ఈ విభాగ కార్లకు డిమాండ్ ఉంటుందన్నే నమ్మకాన్ని ఆయన వ్యక్తంచేశారు. ప్రపంచంలో అతిపెద్ద బ్యాటరీల తయారీ సంస్థ సీఏటీఎల్ నుంచి సేకరించిన బ్యాటరీతో తయారు చేసిన ఈ బ్యాటరీని 6 గంటల నుంచి 8 గంటల వరకు చార్జింగ్ చేస్తే సరిపోతది. ఒకేసారి చార్జింగ్‌తో 340 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయనున్న ఈ కారు కేవలం 8.5 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. హెక్టార్ తర్వాత విడుదల చేసిన ఈ రెండో కారును కేవలం ఢిల్లీ/ఎన్‌సీఆర్, ముంబై, హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు నగరాల్లో మాత్రమే వచ్చే నెల నుంచి విక్రయించనున్నది. ఈ కారును గుజరాత్‌లోని హలోల్ ప్లాంట్లో తయారు చేసింది సంస్థ.

## పెన్నార్‌కు రూ.302 కోట్ల ఆర్డర్

**హైదరాబాద్, డిసెంబర్ 5:** గడిచిన నెలలో అన్ని విభాగాల నుంచి రూ.302 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని పెన్నార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రకటించింది. వీటిలో రైల్వే డివిజన్‌కు సంబంధించి ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ, ఎంసీఎఫ్, టీఐ, యునివర్సల్ ఇంజినీరింగ్, టెక్సమాకోల నుంచి రాగా, పీ-ఇంజినీరింగ్ బిల్డింగ్‌నకు సంబంధించి కోరమాండల్, అంబుజా సిమెంట్, అంక్రిశ్ గ్రూపు, ఆర్‌కేఎస్ బిల్డర్స్, చెట్టినాడు బిల్డర్స్‌ల నుంచి లభించినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. అలాగే స్టీల్ విభాగానికి సంబంధించి థర్మాక్స్, ఐఎఫ్‌బీ, తోషిబా, ఎల్‌జీ బాలకృష్ణన్, స్టీల్ మార్ట్‌లనుంచి వచ్చాయి.

## ఆంధ్రా బ్యాంక్‌పై రూ.25 లక్షల జరిమానా

**ముంబై, డిసెంబర్ 5:** ఆంధ్రా బ్యాంక్‌పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రూ.25 లక్షల జరిమానా విధించింది. నో యువర్ కస్టమర్ (కేవైసీ), మనీ లాండరింగ్ నిరోధానికి సంబంధించిన పలు నిబంధనల ఉల్లంఘనకుగాను బ్యాంక్‌పై ఆర్బీఐ గురువారం ఈ పెనాల్టీ వేసింది. కరెంట్ ఖాతాల ప్రారంభ సమయంలో, ఇతరత్రా అంశాల్లో బ్యాంక్ నిబంధనలను పాటించలేదని ఆర్బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. బ్యాంకింగ్ నియంత్రణ చట్టం 1949 ప్రకారం ఈ జరిమానాను వేసినట్లు ఆర్బీఐ సదరు ప్రకటనలో స్పష్టం చేసింది.

## జియో చార్జీలు నేటినుంచి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 5:** ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో పెంచిన టెలికం చార్జీలు శుక్రవారం నుంచి అమలులోకి రానున్నాయి. కాల్, డాటా చార్జీలను 39 శాతం వరకు పెంచుతున్నట్లు బుధవారం సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇతర సంస్థలు వసూలు చేస్తున్నదానికంటే జియో చార్జీలు 15 శాతం నుంచి 25 శాతం వరకు తక్కువని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. రూ.399 ప్లాన్‌ను రూ.555కి పెంచిన సంస్థ..రూ.153 ప్లాన్‌ను రూ.199కి, రూ.198 ప్లాన్‌ను రూ.249కి, రూ.299ని రూ.349కి, రూ.349ని రూ.399కి, 448ను రూ.599కి, రూ.1,699 ప్రణాళికను రూ.2,199కి పెంచిన విషయం తెలిసిందే.

# మీ అలర్జీ పరీక్షను ఈరోజే చేయించుకోండి

## సగం కంటే తక్కువ ధరలకే

**కరీంనగర్, నిజామాబాద్, రామగుండం, ఆర్మూర్, జగిత్యాల, కోరుట్ల, మంచిర్యాల, పెద్దపల్లి, నిర్మల్, కామారెడ్డి, హనుమకొండ, జనగాం, సిద్దిపేట్, జహీరాబాద్, బోధన్‌ల వద్ద**

## ఒక బ్లడ్ టెస్ట్‌తోనే అలర్జీకి గల కారణాలను గుర్తించవచ్చు

## 6, 7, 8 & 9 డిసెంబర్ 2019

### రక్త పరీక్షల ద్వారా అలర్జీలను గుర్తించవచ్చు. అందునుండి సకాలంలో అలర్జీ చికిత్సకు దోహదపడుతుంది

**కరీంనగర్, నిజామాబాద్, రామగుండం, ఆర్మూర్, జగిత్యాల, కోరుట్ల, మంచిర్యాల, పెద్దపల్లి, నిర్మల్, కామారెడ్డి, హనుమకొండ, జనగాం, సిద్దిపేట్, జహీరాబాద్, బోధన్‌ల** వద్ద అంజన్ పాత్ ల్యాబ్స్ & అలర్జీ టెస్టింగ్ సెంటర్ యొక్క కలెక్షన్ సెంటర్లు 70-80 అలర్జీ కారకాలు (ఆహారం, చర్మం, శ్వాస, విస్తృతమైన) కలిగిన వాటికి 50% కంటే ఎక్కువ తగ్గింపుతో రాయితీగల రేట్ల వంతున అన్నిరకాల అలర్జీ (అలర్జీ) కొరకు అలర్జీ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఇవి **6, 7, 8 & 9 డిసెంబర్ ఉ. 9 గంటల నుండి సా. 5 గంటల వరకు** నిర్వహించబడతాయి. ఈ పరీక్షలు నాలుగు రోజులకు మొత్తం ధరలో సగం కంటే తక్కువ ధరకు నిర్వహించబడతాయి.

గతంలో రోగి ఏ రకమైన అలర్జీతో బాధపడుతున్నాడు మరియు ఏ అలర్జెన్ దానికి కారణమవుతుందో తెలుసుకొనుటకు చేతిపై 98 చోట్ల పొడిచే స్కిన్ ప్రిక్ టెస్ట్ చేసేవారు. కానీ, ప్రస్తుతం ఒకే ఒక రక్తనమూనాతో తేలికగా ఈ పరీక్ష చేయబడుతుంది. ఈ పరీక్ష మా ల్యాబ్‌లో అందుబాటులో వున్న ఫాడియా 250 మరియు యూరో బ్లాట్ ఒన్ వంటి ప్రత్యేకమైన మెషీన్ల ద్వారా చేయబడుతుంది.

### అలర్జీ లక్షణాలు

- చర్మం ఎర్రబడుట
- చర్మంపై దద్దుర్లు/దురద
- చర్మంపై మచ్చలు
- ముఖం, పెదవులు ఉబ్బుట
- కడుపు నొప్పి
- డయేరియా
- గొంతు నొప్పి, దగ్గు
- గజ్జి
- శ్వాస తీసుకొనుటలో ఇబ్బంది
- దద్దుర్లు
- అలర్జిక్ రినైటిస్ (తుమ్ముట)

**డా. జి. సమ్రాట్ యాదవ్** – అలర్జీ (అలర్జీ) అనేది ఒక వ్యాధి. అయితే, ప్రజలు దానిని అలా భావించరు. ఒకసారి అది ప్రారంభమైతే వ్యక్తులను ఇబ్బందికి గురిచేస్తూ వుంటుంది. ఒక వ్యక్తికి సువాసనలు నచ్చకపోతే అతనికి పూలంటే అలర్జీ. వ్యక్తులకు తమ పెంపుడు జంతువుల నుండి కూడా అలర్జీ వుండవచ్చు. ఒకసారి ఈ అలర్జీలను గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్స చేయించుకోవాలి. వీటికి చికిత్స వుంది. జాగ్రత్తలు కూడా పాటించాలి. **అలర్జీకి చికిత్స చేయుటకు వ్యాధి నిర్ధారణ మాత్రమే మార్గం.**

**డా. బి. సురేష్ రెడ్డి** – ఒక వ్యక్తి రోజువారీ జీవితంలో అనేక సమస్యలను అలర్జీ కలిగిస్తుంది కనుక దానిని నిర్లక్ష్యం చేయకూడదు. ఒక వ్యక్తి ప్రత్యేకించి రుతు సంబంధ అలర్జీతో బాధపడుతుంటే అది ప్రమాదకరం కనుక అతను/ఆమె వెంటనే డాక్టరును సంప్రదించాలి. అలర్జీ వ్యాధుల వ్యాధి నిర్ధారణను వెంటనే చేయడంవల్ల దానికి చికిత్స చేయవచ్చు మరియు జాగ్రత్తలు తీసుకోవాలి. అలర్జీ యొక్క వ్యాధి నిర్ణయం జరిగినప్పుడు రోగికి చికిత్స చేయుట డాక్టరుకు సులభతరమవుతుంది.

**అలర్జీలకు చికిత్స**

ఒకసారి రోగనిర్ధారణ జరిగాక కొన్ని ప్రత్యేక ఆహార పదార్థాలు మానుట వలన లేదా వైద్యం ద్వారా మందుల ద్వారా చికిత్స చేయవచ్చు. అలర్జీ నిరోధక వైద్యం లేదా అలర్జీలు తొలగించి ఇమ్యూనో థెరపీ అని పిలువబడే అనుభవజ్ఞులైన డాక్టర్లచే ప్రత్యేక వైద్యం కావచ్చు.

## మీరు అలర్జీ పరీక్ష చేయించుకుంటే

## ఉచితం విటమిన్ B12 & విటమిన్ D పరీక్షలు

భారత్‌లో అలర్జీ పరీక్షకు మొదటి NABL అక్రెడిటెడ్ ల్యాబ్‌లలో జెరత్ పాథ్ ల్యాబ్స్ & అలర్జీ పరీక్షా కేంద్రం ఒకటి. జెరత్ పాథ్ ల్యాబ్స్ యొక్క సహ కంపెనీ ఆంజన్ పాథ్ ల్యాబ్. ఇప్పటివరకూ ఉత్తర మరియు పశ్చిమ భారతదేశంలోని 14 రాష్ట్రాలో JPL ఉన్నది మరియు APL ద్వారా అది దక్షిణ భారత భాగంలో తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలలో ప్రవేశించియున్నది.

### అలర్జీ అంటే ఏమిటో తెలుసుకుందాం?

ప్రతి వ్యక్తి వారు పురుషులైనా లేదా మహిళలైనా ఇతర పదార్థాల ద్వారా కలిగే ఉద్దీపనలు సహించుటకు శక్తి కలిగి వుంటారు. అయినప్పటికీ కొన్ని పదార్థాలు ఒక వ్యక్తి వ్యాధినిరోధక వ్యవస్థలో అసాధారణ ప్రతిక్రియకు కారణమై అలర్జీని కలిగిస్తాయి.



గతంలో రోగి ఏ రకమైన అలర్జీతో బాధపడుతున్నాడు మరియు ఏ అలర్జెన్ దానికి కారణమవుతుందో తెలుసుకొనుటకు చేతిపై 98 చోట్ల పొడిచే స్కిన్ ప్రిక్ టెస్ట్ చేసేవారు. కానీ, ప్రస్తుతం ఒకే ఒక రక్తనమూనాతో తేలికగా ఈ పరీక్ష చేయబడుతుంది.

**అలర్జీకి కారణాలు (అలర్జీ)**

మన దైనందిన జీవితాలలో మన చుట్టుప్రక్కల వున్న అనేకమైన వాటి వలన అలర్జీలు కలుగవచ్చు.

**గాలి ద్వారా వ్యాపించు అలర్జీలు,** విత్తులు, జంతువ్యర్థాలు, ధూళి దూసరితాలు మరియు మౌల్డ్.

**కొన్ని ఆహారములు,** ప్రత్యేకించి పల్లీలు, చెట్టుకాయలు, గోధుమలు, సోయా, చేప, గవ్వచేపలు, గుడ్లు మరియు పాలు.

**కీటకాల కాట్లు,** తేనెటీగ లేదా వ్యాస్ప్.

**మీరు తాకే ల్యాటెక్స్ లేదా ఇతర పదార్థాలు,** వీటివలన చర్మానికి అలర్జీ ప్రతిచర్యలు ఏర్పడును.

కేవలం ఒక రక్త నమూనాతో మనం ఏ అలర్జీనైనా కనుగొనగలము మరియు వాటిని రోగనిరోధక బూస్టర్లు, యాంటీ అలర్జీ డ్రగ్స్ మరియు ఇమ్యూనో థెరపీల ద్వారా కూడా చికిత్స చేయవచ్చు.

ఉదాహరణకి గాలి పీల్చుకోవడం, దగ్గు మరియు జలుబుతో బాధపడుతూ ఆస్త్మా చరిత్ర వున్న ఒక 12 సంవత్సరాల బాలికను తీసుకుందాం. ఆమె తన ఊపిరికి చెందిన ఏ రుగ్మతలూ స్పష్టంగా తెలుపలేదు. ఆమె వైద్యచరిత్రలో తాను ఒక ఫిజీషియన్‌ను తన ఆస్త్మా కోసం సంప్రదించి, చక్కగా మందు కూడా తీసుకున్నది. అయినప్పటికీ ఆమెకి నయం కాలేదు. ఆమె డిస్ప్నియా మరియు ప్యూరిటీస్ చరిత్రలు కూడా కలిగి వుండి పీనట్స్, చిక్‌పీస్ మరియు రెంటిల్స్‌కి కూడా గురి అయినది. గతంలో ఆమె వీజింగ్ సందర్భాలు కాలానుసారంగా గడ్డికి, గాలిలో ఎగిరే విత్తులకు సంబంధించి వుండేది. ఆమెకి రక్త అలర్జీ పరీక్ష చేసి రోగనిరోధక థెరపీతో చికిత్స చేసి కొన్ని అలర్జీ నిరోధక డ్రగ్స్ ఇచ్చిన తరువాత ఆమె కోలుకున్నది. ఎవరికైనా శ్వాస సమస్యలు వున్నట్లయితే అతడు/ఆమె అలర్జీ పరీక్ష కూడా చేయించుకోవాలి. ఒకసారి అలర్జీ (అలర్జీ) గుర్తించబడితే సగం సమస్య తీరినట్లే. దీనివలన ప్రత్యేకత కలిగిన డాక్టర్స్ ప్యానల్ సహాయం ద్వారా సరైన చర్య తీసుకునే అవకాశం కలుగుతుంది మరియు వారి అలర్జీకి సరైన మందులతో చికిత్స చేయవచ్చు. యూరో బ్లాట్ మరియు ఫాడియాలు ఉపయోగించి అటువంటి అలర్జీలను డయాగ్నైజ్ చేయడానికి మా సర్వోత్తమ డాక్టర్ల ప్యానల్‌కి ప్రత్యేక శిక్షణ ఇవ్వబడినది.

**ECHS/ESI/CGHS**
**కార్డు హోల్డర్లకు అదనపు తగ్గింపు**



**EUROBlotOne**



**PHADIA 250**




ప్రపంచ ప్రఖ్యాత మోడర్న్ మెషీన్లచే పరీక్షించబడినది

**Contact Us For Test** — Aanjan Path Labs & Allergy Testing Centre — Affordable Accuracy

CORPORATE OFFICE : Plot No. - 29A ARK Colony (Anantha Ramakrishna Iyyer Colony) Eldams road, Teynampet Chennai.

| | | |
|---|---|---|
| **KARIMNAGAR** | 97055-05150 | Tata Hospital & Tata Path Lab, #6-3-370, Karkhanagadda, Peddapally Road, Karimnagar |
| **NIZAMABAD** | 08462-231458, 94400-90141 | Bharat Pathological Laboratry, Opp Bus Stand Lane, Beside Old City Cable Building Khaleelwadi |
| **RAMAGUNDAM** | 81069-59770 | Moon Diagnostics, #4-2-171, Beside SBH-ATM, Jyothinagar, Medipally Rd., NTPC |
| **ARMOOR** | 7013353998, 9440142321 | Shylaja Diagnostic Centre, Sri Sai Krishna Multi Speciality Hospital, Beside TVS Show Room, Perkit Rd. |
| **ZAHEERABAD** | 9666775614, 8125461110 | Y.s.k Diagnostic Centre, Opp. Bus Stand Beside Bharath Gas Office, Zaheerabad |
| **HANMAKONDA** | 9700521566, 9441030029 | Deena Diagnostic, Beside Raj Hotel, Nandhi Hills, Huntar Road |
| **JAGTIAL** | 93941-18119 | Janatha Diagnostics, Beside Dr. B. Shankar M.d, Hospital, Krishnanagar, Jagtial, Karimnagar, |
| **KORATLA** | 9989180100, 9393180100 | M.J Diagnostics, Opp. SBI Koratla Branch, Old Bus Stand, Kortla Complex, Ailapur Road, Koratla |
| **MANCHERIAL** | 9866514566, 8555949010 | Sri Sai Diagnostics, Opp. Dcp Office, Near Carmel School, Acc, Mancherial |
| **PEDDAPALLI** | 9491265834 | M K Diagnostics, Masjid Road, Peddapalli |
| **NIRMAL** | 9440386871, 9573662855 | Santhosh Kumar Diagnostic Laboratory, Opp. Stupam, Beside Ent Hospital, Doctor's Lane, N.h.7 Road |
| **BODHAN** | 9848175613, 9398678928 | Balaji Pathology Lab, Sharbathi Canal Rd., Bodhan |
| **KAMAREDDY** | 08468-221193, 9059415951 | Sevasadan Diagnostic Centre, H. No. 1-7-111/5, Sri Kalabhairava Complex, Daily Market |
| **HANMAKONDA** | 9963585269, 9390745705 | Health Care Diagnostic, No: 2-9-598, NGOs Colny Near Balaiya Hotel |
| **MANCHERIAL** | 9652211678, 08736-250678 | Health Care, Bellampally Chowrastha, Beside Andhra Bank, Mancherial |
| **JANGAON** | 9000730746, 8686411899 | Ever Green Diagnostic Centre, Beside Bus Stand, Skm Road, Near Siraj Fruit Lane |
| **SIDDIPET** | 94404-78448 | Madhuri Diagnostics, Subash 'x' Road, Nr. Burzu |

**HELPLINE : 63838-48063, 95000-53404, 97910-13389**

నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
/nt.zindagi
జిందగీ
శుక్రవారం 6 డిసెంబర్ 2019

## మల్లెలతో మానసికోల్లాసం

**పూలల్లో మల్లెలదే అగ్రస్థానం. ఈ పరిమళాలను ఇష్టపడని వారుండరు. మల్లెమొగ్గల్ని జడలో తురుముకోవాలని మహిళలు ఆరాటపడుతుంటారు. సౌందర్య పోషణలో మల్లెపూలు ఎంతగానో దోహదపడుతాయి. మల్లెలు అందించే కొన్ని సౌందర్యపరమైన ప్రయోజనాలు.**



- మల్లెపూలు నీటిలో వేసుకొని గంట తర్వాత ఆ నీటితో స్నానం చేస్తే శరీరం, మనసు తేలికపడుతాయి. పూల సువాసనతో ఒళ్లు గుబాలిస్తుంది. రోజంతా బయట తిరగడం వల్ల ఒత్తిడికి లోనైన కళ్లమీద విరిసిన మల్లెలను ఉంచితే ఆ ఒత్తిడి తొలిగిపోతుంది.
- చుండ్రు బాధితులు మెంతులు, ఎండు మల్లెలు కలిపి నూరి తలకు పట్టిస్తే సమస్య తగ్గడమే కాకుండా జుట్టు పట్టు కుచ్చులా మెరిసిపోతుంది. మల్లె పువ్వులను కొబ్బరి నూనెలో వేసి రాత్రంతా నానబెట్టి ఆ తర్వాత మరగనిచ్చి ఆ నూనెను జుట్టుకు పట్టిస్తే జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. మాడు చలబడుతుంది.
- గుప్పెడు మల్లెల్ని నూరి ముద్ద చేసి కొద్దిగా పాలు కలిపి ముఖమంతా మర్దన చేసుకొని ఆ తర్వాత అరచెంచా చొప్పున ముల్తానామట్టి, గంధం, తేనె కలిపి ఫేస్‌ప్యాక్ వేసుకుంటే చర్మం తాజాగా మారి మెరిసిపోతుంది. రెండు చెంచాల చొప్పున మల్లెపూల రసం, గులాబీ పువ్వుల రసం, గుడ్డు పచ్చసొన కలిపి ముఖానికి రాస్తే ముఖ చర్మం మెత్తబడి కాంతివంతంగా మారుతుంది.
- మల్లెల నూనెను మొటిమల మచ్చల మీద రాసి ఇంకేలా మర్దన చేస్తే ఆ మచ్చలు చర్మం రంగులో కలిసిపోతాయి. మల్లెపూల నూనె, లావెండర్ ఆయిల్ కలిపి ఒళ్లంతా మర్దన చేస్తే శారీరక అలసట తొలగడమే కాకుండా, మానసిక ఒత్తిడి, కుంగుబాటు దూరమవుతాయి.

**డిసెంబర్ నెల. ఏడాది పూర్తయ్యే నెల. క్రిస్మస్, న్యూ ఇయర్, పెండ్లిళ్లు.. వీటితోపాటు పుట్టిన రోజు వేడుకలు. అన్నీ ఒకేనెలలో కలిసొస్తే నెలంతా హ్యాపీగా ఉంటాం. వేడుకలలో సంతోషంగా గడపాలి. ఆడుతూ పాడుతూ ఆకట్టుకోవాలి. అందరి నుంచీ అభినందనలు పొందాలి. ఇవన్నీ కంచిపట్టుతో సాధ్యం అంటున్నారు ఫేషనిస్టులు. ఈ నెలంతా కంచిపట్టులో మెరిసిపోండి.**

# కంచిపట్టు.. నచ్చినట్టు!







**బనారస్ లెహంగాకు బార్డర్ ఇచ్చాం. దీనికి వర్క్ చేశాం. రాసిల్క్ బ్లౌజ్‌కు ఎల్లో హ్యాండ్స్‌కు జర్దోసీ, థ్రెడ్ వర్క్ చేశాం. రెడ్ కలర్‌కు ఆకర్షణీయంగా ఉండేందుకు పర్పుల్ కలర్ నెట్‌దుపట్టా ఎంచుకున్నాం. దీనికి గోల్డ్, గ్రీన్ బార్డర్ ఇచ్చాం.**

**ప్యూర్ రాసిల్క్ లెహంగాకు జర్దోసీ వర్క్‌తో బుటీలుగా కుట్టాం. జర్దోసీ, థ్రెడ్‌వర్క్‌తో బ్లౌజ్‌కు ముందు, వెనుక హెవీవర్క్ ఇచ్చాం. లెహంగా, బ్లౌజ్‌కు కాంబినేషన్‌గా పింక్, ఆరెంజ్ బనారస్ దుపట్టా ఎంచుకున్నాం. దీనికి ప్యూర్ జరీతో డిజైన్ చేశాం. వేడుకకు ఈ లెహంగా ధరిస్తే అందరి చూపు మీ వైపే ఉంటుంది.**

పవులూరి నాగతేజ
ఫ్యాషన్ డిజైనర్, తేజ శారీస్
కూకట్‌పల్లి, హైదరాబాద్
tejasarees@yahoo.com

**లైమ్‌గ్రీన్, బ్లూ రంగులతో కూడిన పర్‌ఫెక్ట్ కాంట్రాస్ట్ లెహంగా ఇది. ఇందులో ఫర్‌ఫెక్ట్ లుక్ వస్తుంది. ప్యూర్ కంచిపట్టు లెహంగాకు బ్లూ బార్డర్ ఇచ్చాం. బార్డర్‌కు మ్యాచ్ అయ్యేలా నెట్‌దుపట్టాకు గోల్డ్ బార్డర్ కుట్టాం. బ్లౌజ్‌కు బ్లూ పట్టు బార్డర్ జతచేశాం. హ్యాండ్స్, సగం నెక్‌కు జర్దోసీ వర్క్ కుట్టాం.**

**ఎల్లో కలర్ కంచిపట్టు లెహంగాకు నెట్ దుపట్టాను జతచేశాం. కుందన్స్‌తో దుపట్టాకు బార్డర్ కుట్టాం. రాసిల్క్ బ్లౌజ్‌కు పట్టు బార్డర్‌తో ఎల్లో హ్యాండ్స్ కుట్టాం. హ్యాండ్స్‌కు జర్దోసీ వర్క్ చేశాం. ఇది ఎలాంటి శుభకార్యాలకైనా మంచి లుక్‌నిస్తుంది.**

**ఆరెంజ్ లెహంగాకు బ్లూ కంచిపట్టు బార్డర్ ఇచ్చాం. దీనికి గ్రీన్ నెట్‌దుపట్టా కుట్టాం. గోల్డ్, బ్లూ బార్డర్ ఇచ్చాం. బ్లూ రాసిల్క్ బ్లౌజ్ ఇచ్చాం. హ్యాండ్స్‌కు కంచిపట్టు బార్డర్ జతచేశాం. హాఫ్‌నెక్, హ్యాండ్స్‌కు జర్దోసీ వర్క్ చేశాం. ఈ కాంట్రాస్ట్ లెహంగా పెండ్లికూతురుకు తగ్గ వైభవం తీసుకువస్తుంది.**

## నీళ్లు ఎందుకు తక్కువగా తాగాలి?

**నా వయసు 45 సంవత్సరాలు. కొద్దికాలంగా నా కిడ్నీలు సరిగా పని చేయడం లేదని డాక్టర్లు నిర్ధారించారు. నెఫ్రాలజీ వైద్యులు నేను నీళ్లు తక్కువగా తాగాలని చెప్పారు. సాధారణంగా కిడ్నీలు బాగా పనిచేయాలంటే డాక్టర్ నీళ్లు ఎక్కువ తాగాలని చెప్తారు కదా. కానీ నాకు ఎక్కువగా తాగొద్దని ఆంక్షలు ఎందుకు పెడుతున్నారు? దయచేసి వివరంగా తెలుపగలరు.**

**- వై. పద్మప్రియ, మదీనాగూడ**

అడుగండి చెబుతా



ఒక్కోసారి మీరు నీరు ఎక్కువగా తాగినప్పుడు కిడ్నీలు ఎక్కువైన భారాన్ని తట్టుకోలేకపోవచ్చు. అటువంటి స్థితిని 'హైపో నేట్రీమియా' అంటారు. అంటే మీ రక్తంలోని మినరల్స్ తగ్గిపోవడం. దాంతో రక్తంలోని సోడియం లెవల్స్ పడిపోతాయి. ఒక్కోసారి మెదడు వాపు, ఫిట్స్‌కు కూడా దారితీస్తుంది. ఒక్కోసారి అది ప్రాణాంతకం కావొచ్చు. తీవ్రమైన కిడ్నీ వ్యాధిగ్రస్థులు డాక్టర్ల సలహా మేరకు తక్కువగా నీరు తాగడం చాలా అవసరం. ఇది మీ ఆరోగ్య స్థితిని మెరుగుపరచడానికే. సాధారణంగా కిడ్నీ జబ్బులు ఉన్నవారిలోనూ నీరు తక్కువగా తాగాలన్న ఆంక్షలు విధించరు. అయితే కిడ్నీ జబ్బుతో పాటు గుండెజబ్బు లేదా అలా నీరు తీసుకోవడం వల్ల హాని జరిగే అవకాశాలు ఉన్నప్పుడు మాత్రం ఎంత నీరు తీసుకోవాలన్నది డాక్టర్లు నిర్దేశిస్తారు. మన దేశం లాంటి ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న దేశాల్లో మామూలు వ్యక్తి రోజుకు 5–6 లీటర్ల నీటిని తీసుకుంటాడు. అయితే కొందరి కిడ్నీలు కేవలం ఒక్క లీటరు నీటిని ప్రాసెస్ చేయడానికే ఎంతో కష్టపడాల్సి వస్తుంది. అందుకే వారికి ఉన్న జబ్బు ఆధారంగా, వారి కిడ్నీ పనిచేసే సామర్థ్యం ఎంతో తెలుసుకొని, వారు రోజూ తీసుకోవలసిన నీటిమోతాదును డాక్టర్లు నిర్ధారిస్తారు.



**డాక్టర్ జి. సుధాకర్**
సీనియర్ నెఫ్రాలజిస్ట్,
కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

## నిద్ర పట్టడం లేదా?

**నిరంతరం ఏదో ఒత్తిడి, నిద్ర కూడా సరిగ్గా రానంత ఆందోళన. శారీరక శ్రమ పెరిగిపోయి మానసిక ఒత్తిడి కారణంగా ప్రశాంతమైన నిద్ర అనేకమందికి కరువవుతుంది. నిద్ర కోసం జీవన సరళిలో కొన్ని మార్పులు చేస్తే చాలంటున్నారు నిపుణులు. అవేంటంటే..**



- నిద్రపోయే ముందు చెర్రీస్ కలిపి పెరుగు తీసుకోవడం లేదా ఓట్స్‌తో కలిపి చెర్రీస్ తీసుకోవడం మంచిది. చెర్రీస్‌కు యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించే శక్తి ఉంది. చెర్రీస్‌ను తీసుకోవడం ద్వారా ఒంట్లోని యూరిక్ యాసిడ్‌లు తగ్గుతాయి. తద్వారా ఒత్తిడి తగ్గుతుంది. హాయిగా నిద్రపడుతుంది.
- వాల్‌నట్స్ అంటే కేవలం డ్రై ఫ్రూట్స్ అన్న అభిప్రాయం చాలామందిలో ఉంది. అలాగే ఇవి కేవలం మెదడుకు, మెమొరీ పవర్‌ను మెరుగుపరుస్తాయి. వీటిల్లోని కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్, మంచి ఫ్యాట్, ఫైబర్, విటమిన్స్ నాడీ వ్యవస్థను చల్లబరుస్తాయి. తద్వారా నిద్రపట్టడానికి ఎంతో ఉపయోగపడుతాయి.
- ఆలుగడ్డలోని పీచు పదార్థం గుండెజబ్బుల నుంచి రక్షణనిస్తుంది. పచ్చి బంగాళదుంప రసం తీసుకుంటే జీర్ణాశయం, పేగుకు సంబంధించిన వ్యాధులు తగ్గుతాయి. బంగాళాదుంపలను సన్నగా కోసి ఆ ముక్కలను అలసిన కళ్లపై పెట్టుకుంటే ఉపశమనం లభిస్తుంది. త్వరగా నిద్రపడుతుంది.
- రోజూ పడుకునే ముందు ఒక గ్లాస్ పాలు తాగడం వల్ల హాయిగా నిద్రపడుతుంది. అంతేకాకుండా తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. దాంతో పాటు మలబద్ధక సమస్య ఉండదు. పాలలోని ఔషధ గుణాలు ఒత్తిడిని దూరం చేస్తాయి.

## ఆన్‌లైన్‌లో శ్రీవారి సంగీతం

**కోకిల కూవ్‌మని, కందిరీగలు జుమ్.. జుమ్మని అంటాయని ఇప్పటితరానికి తెలియదు. ఇవేం తెలియకుండా సంగీతం నేర్చుకుందామని పండితుల వద్దకు వెళ్తే 'నీకు నేర్పించాలా' అంటున్నారు. దీంతో సంగీతాన్ని వదులుకుంటున్నారు. సంగీతం బేసిక్స్ నుంచి నేర్చుకోవాలనుకునే వారికి 'శ్రీవారి సేవాస్ఫూర్తి' సరైంది. ఈమె జర్మనీలో ఉంటూ తెలుగువారికి ఆన్‌లైన్ సంగీత పాఠాలు చెబుతున్నది.**

**పేరు** సౌజన్య. పేరులోనే సౌజన్యం ఉట్టిపడుతుంది. పశ్చిమగోదావరిజిల్లాలోని భీమవరంలో పుట్టిన ఆమె చిన్నతనంలో అమ్మనమంచి సూర్యనారాయణ వద్ద 9 ఏండ్లు సంగీతం నేర్చుకున్నది. తర్వాత చదువుకోసం సంగీతానికి దూరం అయింది. ఆ వయసులో సంగీతంపై ఉన్న మక్కువ అంతగా తెలియలేదు. 2009లో ఇంజినీరింగ్ చేసింది. ఉద్యోగం చేయాలనుకోలేదు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కర్ణాటక సంగీతంలో డిప్లమా చేసింది. ఆ తర్వాత పెండ్లి అయింది. ఉద్యోగ పరంగా భర్త బెంగళూరులో స్థిరపడ్డాడు. సౌజన్య ఇంటికి పరిమితం అయింది. రోజూ ఆ గోవిందుడిని ఆరాధిస్తూ రాగాలు తీసేది. కొన్నేండ్ల తర్వాత హైదరాబాద్‌కు మకాం మార్చారు. ఇంటికి దగ్గరలో ఉన్న గుళ్లో నిర్వహించే ఆధ్యాత్మిక వేడుకల్లో సంగీత ప్రదర్శనలు ఇచ్చేది. రోజూ ఇంట్లో పాడుకునే అన్నమయ్య, త్యాగరాజ కీర్తనలు పాడుతూ, వాటి అర్థాలను వివరిస్తూ వీడియో తీసింది. 2017లో 'శ్రీవారి సేవాస్ఫూర్తి' అనే యూటూబ్ చానల్‌ను క్రియేట్ చేసుకున్నది. కర్ణాటక సంగీతానికి సంబంధించిన వరుస వీడియోలను చానల్‌లో అప్‌లోడ్ చేసింది. ఆ తర్వాత అక్కడి నుంచి నేరుగా దేశంలోనే కాకుండా జర్మనీకి వెళ్లారు. అక్కడ గుడికి వెళ్లడానికి వీలు లేదు. ఇంట్లోని దేవుడి ముందు సంగీతం వాయించుకుంటుండేది. శాస్త్రీయ సంగీతమే ప్రాణంగా భావిస్తున్న సౌజన్యకు సంగీత మూలాలు, తెలుగువారిని మరిచిపోకుండా ఆన్‌లైన్ వేదికగా సంగీత పాఠాలు చెప్పాలని నిర్ణయించుకున్నది.



### ఇదే నా జీవితం

ఉదయం నిద్రలేవడం ఇద్దరు పిల్లలను చూసుకోవడం. భర్త ఆఫీసుకు వెళ్లాక ఆన్‌లైన్‌లో క్లాసులు చెప్పడం. ఆ తర్వాత నేను కూడా సంగీతం నేర్చుకోవడం. రెండేండ్ల పాప, స్కూల్‌కు వెళ్లే చిన్న బాబుతో రోజూ సరిపోతుంది. నేను క్లాసులు చెప్పకపోయినా నేర్పించకపోయినా నేర్చుకునేలా వీడియోలు పెడుతుంటాను యూట్యూబ్‌లో.

### శ్రీవారి సేవాస్ఫూర్తి

కర్ణాటక సంగీతానికి సంబంధించిన వరుస వీడియోలను చానల్‌లో అప్‌లోడ్ చేసింది. వీడియోలకు తెలుగు ప్రజలనుంచి మంచి స్పందన వచ్చింది. అన్నమయ్య కీర్తనలు చాలా బాగా పాడుతున్నారంటూ ప్రశంసలు వర్షం కురిపించేవారు. మాక్కూడా సంగీత పాఠాలు చెప్పమంటూ అభిమానులు కామెంట్లు పెడుతుండేవారు. శ్రీవారి మీదున్న భక్తితో అభిమానులను ఆమెలా తీర్చిదిద్దడానికి ఆన్‌లైన్‌లోనే సంగీత పాఠాలు చెప్పేందుకు పూనుకున్నది. 'ఐమో' యాప్ ద్వారా వీడియో కాల్‌లో ఉచితంగా సంగీతం క్లాసులు చెబుతున్నది. రోజుకి ముగ్గురు, నలుగురికి గంట సమయం చొప్పున క్లాస్ చెబుతుంది. 2 లక్షల నలభైఆరువేల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఈ వీడియోలు సంగీతం మొదలుపెట్టేవారికి బాగా ఉపయోగపడుతుందంటున్నది సౌజన్య. జంతువులు, పక్షులు చేసే శబ్దాలను సరిగమల రూపంలో వినిపిస్తూ స్ఫూర్తినింపుతున్నది. భక్తి కీర్తనలతో పాటు అభిమానులను ఉత్తేజపరచడానికి రెసిపీలు, ఆరోగ్యానికి సంబంధించిన టిప్స్ అప్‌లోడ్ చేస్తుంది. నలుగురికి సంగీతం నేర్పిస్తూ తాను విష్ణుభట్ల శ్రీరామమూర్తి దగ్గర సంగీతం నేర్చుకుంటున్నది.

... సరస్వతివనజ

నమస్తే తెలంగాణ
# శాస్త్ర
[ కరీంనగర్ ]
శుక్రవారం 6 డిసెంబర్ 2019

విశ్వశోధన

## ఒక 'సౌర రహస్యం' వీడింది!

**సూర్యునినుండి వెలువడే సౌరఅయస్కాంత తరంగాల శక్తి ఉపరితలం కంటే బాహ్యావరణంలోనే ఎక్కువగా ఉంటున్నట్టు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఆరు దశాబ్దాల ఈ రహస్యం ఎట్టకేలకు వీడింది.**



**సాధారణంగా** ఉష్ణం సమీపానికి వెళుతున్న కొద్దీ వేడిమి ఎక్కువవుతుంటుంది. కానీ, ఇందుకు భిన్నంగా మన సూర్యుని ఉపరితలం నుంచి వెలువడుతున్న అయస్కాంత తరంగాల శక్తి ప్రారంభమైన స్థలం కంటే బాహ్యావరణంలోనే ఎక్కువగా ఉండడాన్ని సౌరఖగోళ శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించారు. ఎన్ఎస్ఎఫ్‌కు చెందిన డన్స్ (NSF's Dunn) సోలార్ టెలిస్కోప్ కన్సోర్టియమ్ నుండి సేకరించిన అధునాతనమైన, అత్యధిక స్పష్టత (high-resolution) కలిగిన చిత్రాల ఆధారంగా వారు దీనిని కనుగొన్నారు. బ్రిటన్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ బెల్‌ఫాస్ట్'కు చెందిన పరిశోధకులు ఈ మిస్టరీని ఛేదించారు. 'నేచర్ అస్ట్రానమీ' జర్నల్‌లో ఇటీవల ప్రచురితమైన ఈ పరిశోధనతో ఆరు దశాబ్దాల రహస్యం వీడిందని వారు తెలిపారు. అయస్కాంత తరంగాలు ప్రారంభమయ్యే సూర్యుని ఉపరితలం మీది కన్నా వాటి బాహ్యావరణ పొరల్లోనే అధిక శక్తి ఉంటున్నదనడానికి కావలసిన బలమైన ఆధారాలు ఇప్పుడు లభించాయని వారు పేర్కొన్నారు.

పురాజంతు శాస్త్రం

## 'మెగాఫానా' అంతర్ధానం వెనుక..

**ప్రాచీన ఆస్ట్రేలియాలో భారీ జంతువుల (మెగాఫానా) వినాశనానికి వాతావరణ మార్పులతోపాటు మానవజాతి కూడా దోహదపడి ఉంటుందని శాస్త్రవేత్తలు ఒక నిర్ధారణకు వచ్చారు.**



**'మెగాఫానా'ల** వినాశనంలో మానవుల పాత్ర చాలాకాలంగా శాస్త్రవేత్తలలో చర్చనీయాంశంగా ఉంది. ఇది ఇప్పటికి ఒక నిర్ధారణకు వచ్చినట్టు వారు భావిస్తున్నారు. దక్షిణ ఆస్ట్రేలియాకు చెందిన అడెలెయిడ్ (Adelaide) నగరంలోని ఫ్లిండర్స్ విశ్వవిద్యాలయ పరిశోధకులు 'శిలాజ సమాచారం, వాతావరణ పునర్నిర్మాణ' అంశాలపై జరిపిన పరిశోధనలో మెగాఫానా (megafauna) వినాశనం వెనుక గల రహస్యాన్ని విప్పారు. వాతావరణ మార్పుల కారణంగా ఆనాడు ఆస్ట్రేలియా ఖండంలో తాజా నీటి వనరులు బాగా తగ్గిపోయాయని, వాటి అన్వేషణలో అప్పటి ప్రాచీన మానవులతో పై భారీ జంతువులు పోటీ పడినట్టు పై పరిశోధకులు ఒక అంచనాకు వచ్చారు. సుమారు 42,000 సంవత్సరాల కిందట అక్కడ తిరుగాడినట్లుగా భావిస్తున్న భారీసైజు జంతువుల (మోగాఫానా) బరువు 40 కేజీల నుంచి 1000 కేజీల వరకు వుండవచ్చునని వారు చెబుతున్నారు. అత్యాధునాతన గణిత నమూనాల ఆధారంగా వారు ఈ పరిశోధనా ఫలితాన్ని సాధించారు. ఈ అధ్యయనాంశం 'నేచర్ కమ్యునికేషన్స్' జర్నల్‌లో ఇటీవల ప్రచురితమైంది.

ఎవరేమన్నారు?



మనసే(mind) నిజమైన ప్రయోగశాల. భ్రమల వెనుక వుండే వాస్తవిక సూత్రాలను మనం అక్కడే కనుగొంటాం.

**- సర్ జగదీష్ చంద్రబోస్**
ప్రసిద్ధ భారతీయ భౌతిక, వృక్షశాస్త్రవేత్త
జయంతి: 30 నవంబర్,
వర్ధంతి: 23 నవంబర్
జీవితకాలం: 1858-1937

వృక్షశాస్త్రం

## ప్రకృతి కవచాలను కాపాడుకొందాం!

**కాలుష్య నియంత్రణలో మొక్కల భాగస్వామ్యాన్ని మరింత పెంచే ప్రయత్నాలు ప్రపంచస్థాయిలో ముమ్మరమవుతున్నాయి. ఈ క్రమంలోనే మొక్కల ప్రాధాన్యాన్ని తెలిపే చిన్న ప్రస్తావన.**



**భూమిపై** పర్యావరణ పరిరక్షణలో వృక్షాలు సహజసిద్ధంగానే రక్షణ కవచాలుగా ఉపయోగపడుతాయి. వాతావరణ కాలుష్య నివారణలో వీటి పాత్ర అమోఘం. ఒకవైపు ప్రాణవాయువు (ఆక్సీజన్)ను విడుదల చేస్తూ, మరోవైపు మూలికల తయారీకి, ఇంకోపక్క ఆకులు అలములు, కాయలు, గింజలు, పండ్ల రూపంలో ఆహార పదార్థాలుగానూ అవి మనకు మహోపకారమే చేస్తున్నాయి. తమ ఆకుల ద్వారా చెట్లు రోజుకు అనేక గ్యాలన్ల నీటిని తేమరూపంలో గాలిలోకి చేరవేస్తున్నాయి. లక్షలాది ఆకులు గాలిలోని కాలుష్యాన్ని వడబోసే ఫిల్టర్లుగానూ పనిచేస్తున్నాయి. కనిపించని, వినిపించని శబ్దకాలుష్యాల్ని సైతం ఇవి నియంత్రిస్తాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. 50 సంవత్సరాల వయసున్న ఓ చెట్టు తన జీవితకాలంలో కోట్ల రూపాయల విలువ చేసే ఆమ్లజని (ఆక్సీజన్)ని విడుదల చేస్తుందని అంచనా. ఈ చల్లదనంసు మారు 5 ఏసీలకు సమానం.

స్వచ్ఛమైన జలాన్ని ఇప్పుడు ఎలాగైతే కృత్రిమంగా శుద్ధి చేసుకొని బాటిళ్లలో నింపి వాడుతున్నామో అలాగే, మంచిగాలిని కూడా కొనుక్కొని వినియోగించుకొనే రోజులు మానవాళికి దగ్గర్లోనే ఉన్నాయని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఢిల్లీ దయనీయ పరిస్థితి నేపథ్యంలో వారు ఈ సూచన చేస్తున్నారు. మాస్కులు లేకుండా, ముక్కులు మూసుకోకుండా వీధుల్లోకి వెళ్లలేని పరిస్థితులు అనేక నగరాలు, ప్రదేశాల్లో గత కొన్నాళ్లుగా కనిపిస్తున్నాయి. కాలుష్య రహితమైన, స్వచ్ఛమైన గాలికోసం ప్రపంచంలోని ఆయా ప్రాంతాలలో ప్రజలు పలు పద్ధతులను, మార్గాలను అవలంభిస్తున్నారు. మంచిగాలిని టన్నుల్లో భద్రపరుస్తూ అమ్ముతున్న వైనాలు పలు దేశాలలో ఇప్పటికే మొదలైనాయి. చైనా స్వచ్ఛమైన గాలిని కెనడా దేశంను ఎచిదిగు మతిచే సుకుంటున్నట్టు తెలుస్తున్నది.

### చెట్లనుంచి కృత్రిమ వెలుతురు

చెట్లనుంచి కృత్రిమకాంతిని ఉత్పత్తి చేసిన పరిశోధన ఒకటి ఇటీవల వెలుగుచూసింది. తూర్పు ఆసియా దేశమైన తైవాన్ (అధికారికంగా రిపబ్లిక్ ఆఫ్ చైనా)లో 'గోల్డ్ నానోపార్టికల్స్' (బంగారపు సూక్ష్మఅణువులు)ను కొన్ని రకాల చెట్లలోకి చొప్పించి, చీకటి పడగానే వాటినుంచి వెలుగులు చిమ్మే ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంతాలలో వీధిలైట్లతో పనిలేకుండా పోయింది. ఒకవైపు విద్యుత్ వ్యయం తగ్గడమేకాక, బొగ్గుపులుసు వాయువు, ఇతర కాలుష్య కారకాలూ దీని కారణంగా తగ్గుముఖం పడతాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. 'బకోపా కరోలినియానా' (Bacopa Caroliniana) చెట్లపై ఈ ప్రయోగాన్ని వారు అమలు చేశారు. గోల్డ్ నానోపార్టికల్స్‌ను ఆకుల్లోకి పంపి, వాటి క్లోరోఫిల్‌ను ఎర్రటి ఉద్గారం పొందేలా మార్చారు. దీంతో వాటి ఆకులు కాంతిని బహిర్గత పరుస్తూ, వెలుగులను చిమ్ముతున్నట్లు వారుచె బుతున్నారు.

### అటు ఆరోగ్యం, ఇటు ఔషధాలు

వేపచెట్టు గాలి ఊపిరితిత్తులకు మంచిదని, రావిచెట్టు గాలి రక్తపోటును నియంత్రిస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. తులసి, పుదీనా మొక్కలలో శ్వాసకోశ, కంఠ శుద్ధి నివారణ గుణాలున్నాయనీ వారన్నారు. మదాస్కర్ అనే మొక్కనుండి తయారైన మందును డయాబెటిస్ నియంత్రణకు ఉపయోగిస్తారని వారు చెబుతున్నారు. చెట్లమధ్య ఇండ్లలో నివసించే వారిలో హృద్రోగ ప్రమాదాలు తక్కువనికూడా శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇంకా, మలేరియా, ఆస్తమా, జ్వరం వంటి రోగాలను నయం చేసేందుకు వివిధ రకాల మొక్కల ఔషధాలను వాడుతున్నారు.

**డా॥ రాజూరు రామకృష్ణారెడ్డి**

పర్యావరణం

### 'కాప్ 25' అంతర్జాతీయ సదస్సు సందర్భంగా..

# భీతావరణం!

**'25వ కాప్' (Cop25) అంతర్జాతీయ సమావేశాలు స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో ఇటీవల (ఈనెల 2న) ప్రారంభమయ్యాయి. సుమారు 200 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సదస్సు 13వ తేదీతో ముగుస్తుంది. ఈ సందర్భంగా 'వాతావరణ మార్పు' భీతావహ పరిస్థితిపై విశ్లేషణాత్మక కథనం చదువండి.**




**భూమి** సగటు ఉష్ణోగ్రతలు మరింత పెరుగకుండా, ఈపాటికే గణనీయంగా పెరిగిన భూతాపాన్ని సాధారణ స్థితికి తేవడానికి ఐక్యరాజ్యసమితి (ఐరాస) సహా అనేక మంది పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థలూ గత కొన్ని దశాబ్దాలుగా చేస్తున్న విస్తృత ప్రయత్నాలు కారణాలు ఏవైతేనేం, పూర్తి స్థాయిలో ఫలప్రదం కావడం లేదు. ఒకవైపు చాలామంది పర్యావరణానుకూల విధానాలు అవలంభిస్తున్నప్పటికీ మరోవైపు ఇంకా ఎందరో ఉష్ణోగ్రతలను పెంచేలా వాతావరణంలోకి కర్బన ఉద్గారాలను వదిలే చర్యలకు పాల్పడుతుండడమే దీనికి ప్రధాన కారణమని విశ్లేషకులు అంటున్నారు. ఫలితంగా ప్రపంచ దేశాలకు చెందిన కోట్లాదిమంది అమాయక ప్రజలు అనేక తీవ్ర విపత్తుల బారిన పడుతున్న దృశ్యాలు ప్రతీ ఏడూ సంభవిస్తున్నాయి. తాజా ఉదాహరణగా 'కెన్నెత్ తుపాను' (Cyclone Kenneth) ను శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇది ఆగ్నేయాఫ్రికాలోని మోజాంబిక్ దేశంలో అత్యంత తీవ్రస్థాయిలో గత ఏప్రిల్ (2019) లోనే సంభవించింది. భూమిపై ఉష్ణోగ్రతలు ఇంకా పెరక్కుండా తగు జాగ్రత్తలు తీసుకోకపోతే, మరిన్ని భీకర విపరిణామాలు తప్పవని, ప్రపంచచరిత్రలోనే కనీవినీ ఎరుగని భయానక విషాదాలను ముమ్ముందు చవిచూడవలసి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక రకాల జీవజాతులకు అత్యంతానుకూలమైన, నివాసయోగ్యమైన వాతావరణంతో లక్షల ఏండ్లుగా భారీస్థాయి విపత్తులకు చోటివ్వకుండా విలసిల్లుతున్న భూమండలం కాస్తా గత కొన్ని దశాబ్దాలుగా వినాశకర పరిణామాల బాట పట్టింది. ఈ సందర్భంగా రాబోయే మరో 'మహావిపత్తు' (mass extinction)ను వారు ఉటంకిస్తున్నారు.

మొదటి, రెండవ పారిశ్రామిక విప్లవాల యుగం (1760-1914) తర్వాత ఏర్పడిన తీవ్ర భూతాపం పుణ్యమాని గడచిన సుమారు అయిదు దశాబ్దాలుగా సంభవిస్తున్న వాతావరణ విపరిణామాలు ప్రపంచదేశాల ప్రజలందరినీ తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. 'గత కొన్నేండ్లుగా భూమి అతితీవ్ర వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, ఇదొక అత్యవసర పరిస్థితి అని, దీనిలోంచి బయటపడి భవిష్యత్ తరాలకు నివాసయోగ్యమైన, స్థిరమైన ప్రపంచాన్ని అందించడానికి అందరం విధిగా ప్రస్తుత జీవన విధానాలను మార్చుకోక తప్పదని' ఇటీవల సుమారు 11,000 మంది శాస్త్రవేత్తలు ముక్తకంఠంతో ఘాటైన హెచ్చరిక చేసిన సంగతి విదితమే. 'ఇప్పటికే చాలా సమయం మించిపోయిందని, ఇక వెనక్కి తిరిగి రాలేని పరిస్థితికి భూమి వాతావరణం చేరిందని' ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియా గుటెరస్ 'కాప్25' అంతర్జాతీయ సదస్సు ప్రారంభానికి ముందు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 1990వ దశకంలో మొదలైన 'వాతావరణ మార్పు' ఉపశమన చర్యల నిర్దిష్ట లక్ష్యాలు 2020 సంవత్సరం కల్లా పూర్తవాల్సి ఉండగా, కేవలం మరొక్క ఏడాది స్వల్పకాల గడువు మాత్రమే వున్న ఈ తరుణంలో ప్రస్తుత 'కాప్25' జరుగుతున్నది.

భూమి కొన్ని వేల సంవత్సరాలలో మాత్రమే పొందేటువంటి తీవ్ర విపత్కర పరిస్థితిని మానవాళి కాలుష్యకారక చర్యలవల్ల కొద్ది దశాబ్దాలలోనే ఎదుర్కొంటున్నట్లు శాస్త్రవేత్తలు తాజాగా ప్రకటించారు. దీనివల్లే ప్రపంచ ఋతుపవనాలు గణనీయంగా గతి తప్పి, కాలపరిధినీ బాగా తగ్గించుకొన్నాయి. సుమారు మూడు దశాబ్దాలుగా (1990వ దశకం నుంచీ) భూమి సగటు ఉష్ణోగ్రతలు మరింత పెరగకుండా, వాతావరణంలో సంభవిస్తున్న అనూహ్య మార్పుల కట్టడికోసం ప్రతీ ఏటా అంతర్జాతీయ సదస్సులు, ఒప్పందాలు జరుగుతూనే ఉన్నాయి. 'క్యోటో ప్రోటోకాల్' (1992) పాతబడి పోగా, 'ప్యారిస్ ఒడంబడిక' (2015)లో భూమి సగటు ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలకు మించకుండా సకల చర్యలూ తీసుకోవాలని ఆయా దేశాలు నిర్ణయించాయి. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ అనుకూల విధానాలు, సంప్రదాయేతర శక్తి వనరుల సాంకేతికతలు, వాటి పరిశోధనలు ఏదో లాంఛన వ్యవహారాల్లా సాగుతున్నాయే కానీ, యుద్ధప్రాతిపదికన జరగడం లేదు. ఇవన్నీ ముమ్మరం కావలసి ఉన్నది. ఈ క్రమంలోనే ప్రస్తుతానికి 1.1 డిగ్రీల సెల్సియస్ (33.98 ఫారిన్‌హీట్స్) మేర భూమి సగటు ఉష్ణోగ్రతలు పెరిగినట్టు ఐరాస (ఐక్యరాజ్యసమితి) తాజాగా వెల్లడించింది. ఉష్ణోగ్రతల పెరుగుదలలో ఇంతటి తీవ్రత గత వందేండ్లలో ఈ దశాబ్దంలోనే నమోదైనట్లు 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యుఎంఒ) ప్రకటించింది.

చాలా దేశాలలో, వ్యక్తులలోనూ పర్యావరణ స్పృహ గత కొన్నేండ్లుగా పెరుగుతున్న మాట నిజమే. నిజానికి పెరిగే భూతాప పర్యవసానాలకు భయపడే పరిస్థితే మానవాళిని ప్రకృతి జీవనం వైపు నడిపిస్తున్నది. ఇంకా అనేకమందికి ఈ స్పృహ రావాల్సి ఉంది. ప్రాకృతిక స్నేహపూర్వక జీవన విధానాలు వేగవంతంగానేకాక తప్పనిసరి కావాలి. ప్రాథమికంగా, భారీ స్థాయిలో ప్రభావం చూపే రాజకీయ నాయకులు, ప్రభుత్వ పెద్దలు, పాలకులలోనే అసలైన మార్పు రావలసి ఉన్నది. వారిలో ఆశించిన స్థాయిలో నిబద్ధత లేని కారణంగానే గణనీయ ఫలితాల్ని సాధించడం కష్టమవుతున్నట్టు పర్యావరణ వేత్తలు అంటున్నారు. ఆయా దేశాల పాలకులు ఎప్పటికప్పుడు ఏదో 'చేతి దులుపు వ్యవహారం వలె' ప్రవర్తించడం దురదృష్టకరం. అందరూ ఇకనైనా కర్బన ఉద్గారాల తగ్గింపు కోసం విధిగా పునరంకితం కావాలి.

అత్యధిక బాధ్యత కలిగిన అభివృద్ధి చెందిన దేశాల ప్రజలు, పాలకులు పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు పర్యావరణ పరంగా ఆర్థిక, సాంకేతిక తదితర సహాయాలు అందించడానికి మానవతా దృక్పథంతో ఇకనైనా ముందుకు రావాలి. గట్టెక్కిన పెద్ద దేశాలు పేద దేశాలపట్ల ఉదార స్వభావాన్ని ప్రదర్శించక పోవడం అనేక విమర్శలకు తావిస్తున్నది. ఒకరి సహాయం కోసం ఎదురుచూపులు చూస్తూ కూచోకుండా తమంత తాముగా చేతనైనంతలో ప్రాకృతిక ప్రగతివైపే ఆయా దేశాలు అడుగులు వేయడమంత ఉత్తమం మరొకటి ఉండదు. 2020 సంవత్సరం లక్ష్యాల కాలవ్యవధికి మరో 12 నెలలు మాత్రమే గడువున్న క్రమంలో ఇప్పటికే 1.1 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారిక నివేదికలు వెల్లడించడం ఆందోళనకరం. కర్బన ఉద్గారాల తగ్గింపులో ఆయా దేశాలు నిర్దేశించుకొన్న లక్ష్యాలను నిర్ణీత గడువు లోపల సాధించలేక పోతుండడానికి రాజకీయంగా పూర్తి స్థాయి మద్దతు లోపించడమే ప్రధాన కారణమని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియా గుటెరస్ స్వయంగా పేర్కొనడం ఈ సందర్భంగా గమనార్హం.

ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది 'కాప్ 25' (25th Conference of the Parties or COP) సదస్సు స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో ఈనెల 2న ప్రారంభమైంది. మొత్తం 200 దేశాల ప్రతినిధులతో 13 రోజుల పాటు జరుగుతున్న ఈ విస్తృత స్థాయి సమావేశాలు 13వ తేదీతో ముగుస్తాయి. భూమి సగటు ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్‌ను మించకుండా తీసుకోవాల్సిన తక్షణ చర్యలు చర్చనీయాంశం కావచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు. నిజానికి 'కాప్25' దక్షిణ అమెరికాకు చెందిన చిలీదేశ రాజధాని సాంటియాగోలో జరగవలసి ఉన్నా, అక్కడ 'పౌరఅశాంతి' నెలకొన్న కారణంగా అది రద్దవడంతో, పలు దౌత్యచర్యల ఫలితంగా స్పెయిన్ దీనికి ఆతిథ్యమిస్తున్నది. ఈ శతాబ్దాంతానికి భూమి సగటు ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలకు మించకుండా, ఇంకా సాధ్యమైతే 1.5 డిగ్రీల సెల్సియస్‌ను చేరకుండా అందరం అన్ని చర్యలూ తీసుకొందామని ఆంటోనియా గుటెరస్ అన్ని దేశాల పాలకులనూ కోరుతున్నారు.

1.1 డిగ్రీ సెల్సియస్ మేర సగటు ఉష్ణోగ్రతల పెరుగుదలకే ప్రపంచంలో సంభవిస్తున్న సునామీలు, అతివృష్టి వంటి విపత్తులు మిక్కుటమైపోయిన పర్యవసానాలను మానవాళి తట్టుకోలేకున్నది. అవి కాస్తా, మరింత స్థాయిలో పెరిగితే వినాశనాలు శాస్త్రవేత్తల ఊహలకైనా అందకపోవచ్చు. మూడొంతుల అఖాతాలు, పది శాతం హిమఖండాలు, భీతావహ వాతావరణం అల్పస్థాయి భూభాగాన్ని కబళించడానికి ఎంత కావాలి? వందల ఏండ్ల పరిశోధనలతో సంపాదించుకొన్న సాంకేతికతలు, ప్రేమతో పెంచుకొన్న నాగరికత, స్వార్థసంకుచితాలతో కట్టుకొన్న ఆర్థిక సామ్రాజ్యాల మేడలు.. అన్నీ కనుమరుగు కావడానికి నిమిషాలు, గంటలు చాలేమో. ఇలాంటివి మన ఊహకైనా వద్దు. కానీ, భూమి రకరకాల కాలుష్యాల వల్ల ఇప్పటికే అందవిహీనంగా తయారవుతున్నది. జీవజాతుల పాలిట కల్పతరువు వంటి ఈ పర్యావరణం అత్యల్ప కాలంలోనే చివరకు ప్రాణాంతకమవుతున్న పరిస్థితిని చూస్తున్నాం. శక్తివంతమైన సహజ వనరులను మానవ ప్రగతి పీల్చి పిప్పి చేస్తుంటే యావత్ భూగోళాన్ని బోడిగుండుగా చూడగలమా! ఆలోచించండి.

### అటు సవాళ్లు, ఇటు సంక్షోభాలు

*ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు అనేక సంక్షోభాలను సృష్టిస్తుంటే, ఇప్పటికే తలనొప్పిని తెచ్చి పెడుతున్న పలు సవాళ్లపై ఇవి తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పర్యావరణ వేత్తలు అంటున్నారు. అన్నింటికీ కామన్ సంక్షోభం భూతాపమేనని శాస్త్రవేత్తలు తేల్చారు. అన్నీ కలిసి మానవజాతిని నిర్వీర్యం చేయకముందే మేల్కొనడం మంచిది. సంక్షోభాలు (కరువు కాటకాలు, ఎడారీకరణ, భూగర్భజలాల క్షీణత, అడవుల నరికివేత-దహనాలు, జీవవైవిధ్య నష్టాలు, జీవావరణ వ్యవస్థల విధ్వంసాలు, గాలిలో విషవాయువులు, సాగరగర్భ ప్రవాహాలలో మార్పులు, హిమనీనదాల ద్రవీభవనం, సముద్రమట్టాల పెరుగుదల, వరదలు, వ్యాధుల విజృంభణ, నీటిఆవిరి తీవ్రత, వాతావరణ మార్పు బాధితుల వలసలు) అన్నీ ఒక దానితో ఒకటి ముడిపడి ఉన్నవేనని వారంటారు. మరోవైపు ఇవన్నీ ప్రపంచ సవాళ్ల (జనాభా పెరుగుదల, సహజ వనరుల క్షీణత, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్థిరత్వ, ఆయా దేశాల రాజకీయ నాయకులలో ఏకీభావం లేకపోవడం) ను తీవ్రస్థాయిలో ప్రభావితం చేస్తున్నట్టు వారు అంటున్నారు. అందుకే, అన్నింటికీ ఒక్కటే పరిష్కారం.. భూతాపాన్ని తగ్గించుకోవడం.*



**దోర్బల బాలశేఖరశర్మ**

వి'జ్ఞానం'

# సైన్స్‌తోనే నాగరికత

**ఆలోచన గలవారికి అన్నీ సైన్స్. అనవసరం అనుకున్న వారికి అంతా నాన్‌సెన్స్. తేడా తెలిసిన వారికి బతుకులో రుచి తెలుస్తుంది. పట్టించుకోని వారికి వట్టి బతుకులు మిగులుతాయి.**



**సంగీతంలో** సప్తస్వరాలు ఉన్నాయి. ప్రపంచమంతటా అన్ని సంగీతాలకూ ఈ ఏడు స్వరాలే ఆధారం. అవి మనిషి గొంతులో పలుకుతాయి. వాటిని రకరకాలుగా కలగలిపి మన వాళ్లు రాగాలు తయారు చేశారు. మిగతా వాళ్లు మరేవో పద్ధతులు తయారుచేశారు. మొత్తానికి సంగీతం అంతా ఏడు స్వరాల సమాహారం. ఇక, భాష విషయం చూడండి. అక్షరాలు ఉంటాయి. నోరు తిరిగినందుకు, నోటిలో నుండి కొన్ని రకాల శబ్దాలు రావడానికి వీలుంది. క,ఖ,గ,ఘ పలికాయి. చ వర్గంలో మరొక నాలుగు అక్షరాలు పలికాయి. ట,త,ప వర్గాలు కూడా ఉన్నాయి. ఇవి మౌలికమైన ధ్వనులు. ఒక పొట్టి అక్షరానికి, నోటిని రకరకాలుగా తిప్పి రకరకాల పొడిగింపులను ఇవ్వవచ్చు. నోరంతా తెరిచి పలికితే దీర్ఘం అవుతుంది. మరొక రకంగా పలికితే గుడి, గుడి దీర్ఘం అవుతాయి. కొన్ని అక్షరాలు, వాటికి గుణింతాలు మొత్తం కలిసి పదాలు, వాక్యాలు, కావ్యాలు, కథలు, సంభాషణలు. ఇలా ఎన్నెన్నో రూపాలు.

ఒకసారి దేహం లోపలికి వెళితే శరీర నిర్మాణానికి, దానిని పని చేయించడానికి కొన్ని మౌలికమైన రసాయనాలు ఉన్నాయి. వాటిని 'జీవరసాయనాలు' అంటాం. మాంసకృత్తులు, న్యూక్లిక్ ఆమ్లాలు, కొవ్వులు, చక్కెర పదార్థాలు వంటివి. అచ్చం భాష, సంగీతాలు లాగే ఇవికూడా నిర్మాణాలను కలిగి ఉన్నాయంటే ఆశ్చర్యం. ఆమ్లాలు 20 పైన ఉంటాయి. అవి రకరకాల వరుసలలో కలిస్తే ప్రొటీన్లు లేదా మాంసకృత్తులు తయారవుతాయి. నాలుగు రకాల న్యూక్లియొటైడ్స్ ఉంటాయి. ఇవి రకరకాలుగా కలిసినందుకు డీఎన్ఏలు తయారవుతాయి. కొవ్వులోకూడా రకరకాల భాగాలు ఉండి, అవి రకరకాల వరుసలో దండలు చేరినందుకు కొవ్వు పదార్థాలు తయారవుతాయి. చక్కెర పదార్థాలలో కూడా ఒకే రకమైన నిర్మాణాలు రకరకాల సంఖ్యలో దండలుగా చేరినందుకు రకరకాల చక్కెరలు తయారవుతాయి. ఈ మొత్తం పద్ధతికి 'పాలి మార్ఫిజం' అని ఒక పేరుంది. అంటే, రకరకాల రంగుల పూలను దండలుగా గుచ్చినట్లే, 'పాలీ' అంటే రకరకాల, 'మార్ఫ్' అంటే రూపాలలో ఉన్న అంశాలను దండలుగా పేర్చడం. ఇలా రకరకాల అసలు వస్తువులు తయారవుతాయి.

ఇది పరిశోధకులు కూడా అంతగా పట్టించుకోని సంగతి. ఈ రంగంలోని వారు అక్కడ తమకు తెలిసిన బహురూపకతను గురించి పరిశోధనలుకూడా చేస్తారు. కానీ, అదే పద్ధతిలో తమ మాటలు, వంటలు, బతుకులలో బహురూపకత ఉన్నదన్న సంగతి అంత సులభంగా తలకు ఎక్కదు. ఈ ప్రపంచంలో మనం తెలుసుకున్నది మాత్రమే మనకు కనబడుతుంది. పరిశోధకులు కూడా ముందు ఏదో ఊహించి బయలుదేరుతారు. వారికి కొన్నిసార్లు ఫలితాలు దొరుకుతాయి. కొన్నిసార్లు అందవు. అలాగని వాళ్లు ఆగరు. మళ్లీ ఏదో ఊహించి ముందుకు సాగుతారు. ఈ పద్ధతి కేవలం పరిశోధకులకు మాత్రమే పరిమితం కాదు, మామూలు మనిషికి కూడా. అందరూ ఏదో జరుగుతుందని భావించి పనులు చేస్తారు. ఫలితాలు రావచ్చు, రాకపోవచ్చు. అందువల్ల అక్కడికి ఆ పని ఆపే ప్రసక్తి మాత్రం ఉండదు. బతుకు సాగుతూ ఉండవలసిందే. కష్టాలు, నిష్టూరాలు అనుకుంటారు. అవి కష్టాలు కాదు. నిష్టూరాలు అంతకన్నా కాదు. అంతా సైన్స్.

అవగాహనకు వస్తే, అర్థమైతే కష్టం అంటే ఏమిటో తెలుస్తుంది. అది మనకు నచ్చలేదు, అసౌకర్యంగా ఉంది కనుక కష్టం. మనిషి మొదటినుంచి కేవలం సౌకర్యం పేరున మాత్రమే ముందుకు సాగుతున్నాడు. కలిగిన సౌకర్యాలకు 'నాగరికత' అని పేరు పెట్టుకున్నాడు. దానిని సాధించడానికి శాస్త్ర విజ్ఞానాన్ని, సాంకేతికతలను వాడుకుంటున్నాడు. అంతా మెదడులో పుట్టిందే. కష్టం అన్న భావనకూడా మెదడులోంచి వచ్చిందే. అది మానసిక శాస్త్రం. అంటే, ఇదీ సైన్సే. ఆలోచన గలవారికి అన్నీ సైన్స్. అనవసరం అనుకున్న వారికి అంతా నాన్‌సెన్స్. తేడా తెలిసిన వారికి బతుకులోని రుచి తెలుస్తుంది. పట్టించుకోని వారికి వట్టి బతుకులు మిగులుతాయి.

**డా॥ కె.బి.గోపాలం,** సెల్: 9849062055

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## ఎల్ఐసీలో

**లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)కి చెందిన హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్ఎఫ్ఎల్) దేశవ్యాప్తంగా కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **పోస్టు:** అసిస్టెంట్‌మే నేజర్ (లీగల్)
- **మొత్తం ఖాళీలు:** 35
- **అర్హతలు:** లా డిగ్రీ ఉత్తీర్ణత, కంప్యూటర్ స్కిల్స్.
- **వయస్సు:** 23-30 ఏండ్ల మధ్య ఉండాలి
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ ద్వారా
- **పరీక్షతేదీ:** 2020, జనవరి 27
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 16
- **వెబ్‌సైట్:** https://www.lichousing.com

## నీట్ -2020

**నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)-2020 నోటిఫికేషన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది.**



- **పరీక్ష పేరు:** నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)-2020
- ఈ పరీక్ష ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్‌ఎంఎస్ కోర్సుల్లో (అండర్ గ్రాడ్యుయేట్) ప్రవేశాలు కల్పిస్తారు.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- **వయస్సు:** 17-25 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ-ఎన్‌సీఎల్, పీహెచ్‌సీ అభ్యర్థులకు ఐదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** పెన్ అండ్ పేపర్ బేస్డ్ టెస్ట్ ద్వారా
- **పరీక్షతేదీ:** 2020, మే 3
- **ఫలితాల వెల్లడి:** 2020, జూన్ 4
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తు ఫీజు:** రూ.1500/-
- **చివరితేదీ:** 2019, డిసెంబర్ 31
- **వెబ్‌సైట్:**www.nta.ac.in/www.ntaneet.nic.in

## ఐపీఆర్‌లో

**గాంధీనగర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రిసెర్చ్ (ఐపీఆర్) కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **మొత్తం ఖాళీలు:** 30
- **పోస్టులవారీగా ఖాళీలు:** ప్రాజెక్ట్ సైంటిఫిక్ ఆఫీసర్-12, ప్రాజెక్ట్ సైంటిఫిక్ అసిస్టెంట్-13, ప్రాజెక్ట్ టెక్నీషియన్-5 ఉన్నాయి.
- **అర్హతలు:** పదోతరగతి, ఐటీఐతో పాటు న్యాక్ సర్టిఫికెట్, సంబంధిత విభాగాల్లో ఇంజినీరింగ్ డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 16
- **హార్డ్ కాపీలను పంపడానికి చివరితేదీ:** డిసెంబర్ 23
- **వెబ్‌సైట్:** http://www.ipr.res.in

## నార్త్ ఈస్టర్న్ రైల్వేలో అప్రెంటిస్‌లు

**గోరఖ్‌పూర్ ప్రధానకేంద్రంగా ఉన్న నార్త్ ఈస్టర్న్ రైల్వేలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**




- **అప్రెంటిస్**
- **మొత్తం ఖాళీలు:** 1104
- **ట్రేడ్‌లు:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, డీజిల్ మెకానిక్, తదితరాలు ఉన్నాయి.
- **అర్హతలు:** పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత.
- **వయస్సు:** డిసెంబర్ 25 నాటికి 15-24 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** అకడమిక్ ప్రతిభ ఆధారంగా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 25
- **వెబ్‌సైట్:** https://ner.indianrailways.gov.in

# ఉపలోకాయుక్త నియామకంపై కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టు నోటీస్

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించలేదని ఎన్జీవో పిల్

**బెంగళూరు:** కర్ణాటక ముఖ్యమంత్రి బీఎస్ యెడియూరప్పకు మరో చిక్కొచ్చిపడింది. రాష్ట్ర ఉపలోకాయుక్తగా విశ్రాంత న్యాయమూర్తి బీఎస్ పాటిల్ నియామకం విషయంలో కర్ణాటక హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం నోటీస్ జారీచేసింది. కర్ణాటక లోకాయుక్త చట్టం ప్రకారం ఉపలోకాయుక్త నియామక ప్రక్రియలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) ఏఎస్ ఓకాను సంప్రదించడం తప్పనిసరని, ముఖ్యమంత్రి యెడియూరప్ప ఈ నిబంధన పాటించలేదని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు విచారణకు స్వీకరించి ప్రభుత్వానికి నోటీస్ జారీచేసింది. శాసనసభ స్పీకర్, మండలి చైర్మన్, ఆ రెండింటిలోని ప్రతిపక్ష నాయకులతోపాటు హైకోర్టు సీజేను సంప్రదించిన తర్వాతే రాష్ట్ర గవర్నర్‌కు ఉపలోకాయుక్త నియామకానికి సిఫార్సు చేయాలని చట్టం చెప్తున్నది. గవర్నర్ వజుభాయ్‌వాలా జారీచేసిన ఉత్తర్వుల మేరకు జస్టిస్ పాటిల్ ఉపలోకాయుక్తగా ఇటీవల నియమితులయ్యారు. సీఎం యెడియూరప్ప సీజే ఓకాకు రాసిన లేఖలో అందరు పెద్దలను సంప్రదించిన తర్వాతే జస్టిస్ పాటిల్ నియామకానికి నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొనడంలో వాస్తవం లేదని సమాజ్ పరివర్తన సముదాయ అనే ఎన్జీవోకు చెందిన పిటిషినర్లు కోర్టు దృష్టికి తెస్తూ, నియామకాన్ని రద్దుచేయాలని కోరారు. సీఎం యెడియూరప్ప ప్రొటోకాల్‌ను విస్మరించి ఉపలోకాయుక్త నియామకానికి సిఫార్సు చేయడం అధికార దుర్వినియోగమేనని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# పిజ్జా ఆర్డర్‌చేసి రూ.95 వేలు పోగొట్టుకున్నాడు

- బెంగళూరులో ఓ యువకుడికి చేదు అనుభవం
- తల్లికి చికిత్స కోసం దాచిన డబ్బును దోచిన సైబర్ నేరగాళ్లు

**బెంగళూరు, డిసెంబర్ 5:** ఆప్‌లో పిజ్జా ఆర్డర్ చేసిన ఓ యువకుడికి చేదు అనుభవం ఎదురైంది. సైబర్ నేరగాళ్లు అతడి ఖాతా నుంచి రూ. 95 వేలు కొల్లగొట్టారు. బెంగళూరులో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బెంగళూరులోని కోరమంగళ ప్రాంతానికి చెందిన ఎస్వీ షేక్.. డిసెంబర్ ఒకటిన మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో తన ఫోన్‌లో జుమాటో యాప్ ద్వారా పిజ్జాకు ఆర్డర్ ఇచ్చారు. గంటపాటు ఎదురుచూసినా పిజ్జా అందకపోవడంతో యాప్‌లో ఉన్న కస్టమర్‌కేర్ నంబర్‌కు ఫోన్‌చేశారు. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌గా పరిచయం చేసుకున్నాడు. 'రెస్టారెంట్ మీ ఆర్డర్‌ను స్వీకరించలేదు. మే ఒక లింక్ పంపిస్తున్నాం. దానిని ఓపెన్‌చేసి మీ వివరాలు నింపితే మీకు కచ్చితంగా రీఫండ్ వస్తుంది' అని నమ్మబలికాడు. అనంతరం తన ఫోన్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్‌చేసిన షేక్.. లింక్‌లో అడిగిన సమాచారం అంతా నింపారు. అనంతరం కొన్ని నిమిషాల వ్యవధిలోనే తన బ్యాంకు ఖాతా నుంచి రూ.45 వేలు విత్ డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. బ్యాంకులో ఉన్న మిగతా మొత్తాన్ని వేరే ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేద్దామనుకొనే లోపే మరో రూ.50 వేలు విత్ డ్రా అయినటు మరో మెసేజ్ వచ్చింది. తాను సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నట్టు గమనించిన ఎస్వీ షేక్.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నది. క్యాన్సర్ బారిన పడిన తన తల్లికి చికిత్స కోసం దాచిన డబ్బును సైబర్‌నేరగాళ్లు దోచారని షేక్ ఆవేదన వ్యక్తంచేశారు. తమకు ఎలాంటి కస్టమర్‌కేర్ నంబర్ లేదని, కస్టమర్లకు ఫోన్‌చేసే సర్వీసు తమ కంపెనీకి లేదని జుమాటో సంస్థ ప్రతినిధి స్పష్టంచేశారు.







పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ గేటు వద్ద మీడియాతో మాట్లాడుతున్న గవర్నర్ జగదీప్ ధన్‌కర్

## బెంగాల్ గవర్నర్‌కు చేదు అనుభవం

- అసెంబ్లీ సందర్శనకు వెళ్తే.. వీఐపీ గేటును మూసేసిన సిబ్బంది
- సాధారణ ద్వారం నుంచి లోనికి వెళ్లిన గవర్నర్ ధన్‌కర్
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారంటూ మమత ప్రభుత్వంపై మండిపాటు

**కోల్‌కతా, డిసెంబర్ 5:** పశ్చిమ బెంగాల్ గవర్నర్ జగదీప్ ధన్‌కర్‌కు మరోసారి చేదు అనుభవం ఎదురైంది. గురువారం ఆయన ఆ రాష్ట్ర అసెంబ్లీని సందర్శించేందుకు వెళ్లగా వీఐపీల రాకపోకలకు ఉద్దేశించిన నంబరు 3 గేటును మూసివేయడంతోపాటు తాళం వేశారు. దీంతో కొద్దిసేపు అక్కడ వేచి ఉన్న గవర్నర్ చివరకు సాధారణ వ్యక్తుల ప్రవేశానికి ఉపయోగించే నాల్గవ నంబరు గేటు ద్వారా లోనికి వెళ్లారు. అనంతరం అక్కడున్న మీడియానుద్దేశించి మాట్లాడిన ఆయన మమత ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. 'ప్రొటోకాల్ ప్రకారం నేను మూడో నంబరు గేటు ద్వారా ప్రవేశించాల్సి ఉన్నది. అయితే అది తాళం వేసి ఉన్నది. ఈ గేటుకు ఎందుకు తాళం వేశారు? అసెంబ్లీ సమావేశాలను రెండు రోజులపాటు వాయిదా వేయడం అంటే గేట్లకు తాళాలు వేసి పూర్తిగా మూసివేయడం కాదు. ఈ చర్య ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు' అని విమర్శించారు. 'అసెంబ్లీలోని సౌకర్యాలను, గ్రంథాలయాన్ని పరిశీలించేందుకు వస్తానని స్పీకర్ బిమన్ బెనర్జీకి బుధవారం లేఖ రాశాను. స్పీకర్ స్పందించి నాతోపాటు నా భార్యను కూడా విందుకు ఆహ్వానించినట్లు రాజభవన్ కార్యదర్శికి సందేశం వచ్చింది. అంతలోనే స్పీకర్‌తోపాటు అసెంబ్లీ కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదంటూ సమాచారం వచ్చింది. కేవలం గంటన్నర సమయంలో జరిగిన ఈ మార్పుపట్ల నేను ఆశ్చర్యపోయాను. ఇది నాకు జరిగిన అవమానం కాదు స్పీకరు కుర్చీకే అవమానం. ఇలాంటి వాటికి నేను తలొగ్గను' అని గవర్నర్ పేర్కొన్నారు. మరోవైపు అధికార టీఎంసీ నేత పార్థ చటర్జీ గవర్నర్‌పై విమర్శలు చేశారు. 'బెంగాల్‌లో అరాచకాలు సృష్టించేందుకు గవర్నర్ ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రపతి పరిపాలన విధించి రాష్ట్రంలో అధిపతి కావాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. రాజ్యాంగం నిర్దేశించిన పరిమితుల్లో ఆయన ఉండాలి. మమ్మల్ని ప్రశ్నించే ముందు రాజ్‌భవన్ ఖర్చులు 7 కోట్లకు ఎందుకు పెరిగాయి అన్నదానిపై గవర్నర్ సమాధానమివ్వాలి. ఆ తర్వాతే ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి ఆయన మాట్లాడాలి. రాష్ట్రంలో పర్యటించాలనుకుంటే ప్రజా ధనానికి బదులు సొంత ఖర్చులతో వెళ్లాలి' అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న రెండు బిల్లులకు గవర్నర్ ఆమోదం లభించలేదు. దీంతో స్పీకర్ అసెంబ్లీని రెండు రోజులపాటు వాయిదా వేసిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

# గుజ్రాల్ సూచనను పాటించని పీవీ

- విని ఉంటే 1984 సిక్కుల ఊచకోత తప్పేది
- సైన్యాన్ని రంగంలోకి దించాలని గుజ్రాల్ సూచించారు
- సిక్కుల ఊచకోత ఘటనపై జాతికి క్షమాపణ చెబుతున్నా
- గుజ్రాల్ శత జయంతి కార్యక్రమంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 5:** దాదాపు 35 ఏండ్ల క్రితం ఇందిరాగాంధీ దారుణ హత్య జరిగిన తర్వాత 1984 అక్టోబర్ 31 సాయంత్రం ఇందర్‌కుమార్ గుజ్రాల్ (తర్వాత కాలంలో ప్రధాని పదవిని చేపట్టారు) సూచనను నాటి హోంమంత్రి పీవీ నరసింహారావు పరిగణనలోకి తీసుకుని ఉంటే సిక్కుల ఊచకోత జరిగి ఉండేది కాదని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ శత జయంతి సందర్భంగా బుధవారం రాజ్యసభలో జరిగిన కార్యక్రమంలో మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ.. '1984లో విషాద ఘటన జరిగినప్పుడు.. అప్పటి కేంద్ర హోంమంత్రి పీవీ నరసింహారావు వద్దకు ఐకే గుజ్రాల్ వెళ్లి.. ఢిల్లీలో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సాధ్యమైనంత త్వరగా సైన్యాన్ని రంగంలోకి దించుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం తప్పనిసరని సూచించారు. ఆ సూచనను పీవీ నరసింహారావు పాటించి ఉంటే 1984 ఊచకోత జరిగి ఉండేది కాదు' అని అన్నారు. 1984 అక్టోబర్ 31న సిక్కు అంగరక్షకుల చేతుల్లో ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం సిక్కుల ఊచకోత జరిగినందుకు మన్మోహన్ సింగ్ క్షమాపణ చెప్పారు. నాటి ఊచకోతలో సుమారు మూడు వేల మంది హత్యకు గురయ్యారు. 'నాటి మారణ హోమానికి కేవలం సిక్కులకు మాత్ర మే కాదు. యావత్ జాతికి క్షమాపణ చెప్పేందుకు నేను సందేహించను. నాడు ఆ విషాదం జరిగినందుకు నేను సిగ్గుతో తల దించుకుంటున్నాను' అని మన్మోహన్ భావోద్వేగ పూరిత వ్యాఖ్యలు చేశారు. 1977లో దేశంలో ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత గుజ్రాల్‌తో తన సంబంధాలు ఎలా ఉన్నాయో మన్మోహన్ గుర్తు చేసుకున్నారు. 'దేశంలో ఎమర్జెన్సీ హయాంలో సమాచార, ప్రసారాలశాఖ మంత్రిగా పనిచేసిన ఆయన (గుజ్రాల్) కొన్ని సమస్యలను ఎదుర్కొన్నారు. దీంతో ఆయనను ప్రణాళికాశాఖ సహాయ మంత్రిగా మార్చేశారు. అప్పుడు నేను ఆర్థిక మంత్రిత్వశాఖకు సలహాదారుగా పని చేస్తున్నా. ఆ తర్వాత మా ఇద్దరి మధ్య సంబంధాలు బలపడ్డాయి' అని చెప్పారు. 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు గుజ్రాల్ కేంద్ర సమాచార, ప్రసారాలశాఖ మంత్రిగా అత్యంత కీలక పాత్ర పోషించారు. 1976–80 మధ్య అప్పటి సోవియట్ యూనియన్‌లో భారత రాయబారిగా గుజ్రాల్ పని చేశారు. తర్వాత 1997 ఏప్రిల్ –1998 మార్చి మధ్య దేశ ప్రధానిగా గుజ్రాల్ సేవలందించారు.

## ఊచకోతకు రాజీవ్‌దే బాధ్యత: బీజేపీ

సిక్కుల ఊచకోత ఘటనలోకి పీవీ నరసింహారావు పేరును తీసుకురావడం పట్ల మన్మోహన్ సింగ్‌పై బీజేపీ ధ్వజమెత్తింది. నాటి సిక్కుల ఊచకోతకు అప్పటి రాజీవ్ గాంధీదే బాధ్యత అని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ హత్య జరిగిన రాత్రి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన రాజీవ్ గాంధీ నాడు ఢిల్లీలో నెలకొన్న పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు సైన్యాన్ని రంగంలోకి తెచ్చే హక్కు కలిగి ఉన్నారన్నారు. కానీ సిక్కుల హత్యాకాండకు రాజీవ్‌గాంధీ మద్దతు పలికారని, భారీ వృక్షం పడిపోయినప్పుడు భూమి కంపిస్తుందని ఇందిరాగాంధీ హత్యానంతర మారణకాండను సమర్థించే విధంగా ఆయన వ్యాఖ్యానించారన్నారు. మరోవైపు, మన్మోహన్ సింగ్ 'నిజం' చెప్పినందుకు గుజ్రాల్ కుమారుడు, ఎన్డీఏ మిత్రపక్షం అకాలీదళ్ ఎంపీ నరేశ్ గుజ్రాల్ ప్రశంసించారు. 'వాస్తవాలు చెప్పినందుకు ఆనందిస్తున్నా. మన్మోహన్‌ను ప్రశంసిస్తున్నా' అని చెప్పారు.


కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్


మధ్యప్రదేశ్‌లోని రివా జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

# మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

- లారీని ఢీకొన్న బస్సు
- తొమ్మిది మంది దుర్మరణం

**రివా, డిసెంబర్ 5:** మధ్యప్రదేశ్‌లోని రివా జిల్లాలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వెళ్తున్న ఒక బస్సు రోడ్డు వెంట నిలిపిన లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో తొమ్మిది మంది దుర్మరణం చెందారు. మృతుల్లో ఆరు నెలల బాలుడితోపాటు ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. మరో పది మంది గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నది. పోలీసుల వివరాల ప్రకారం.. రివా నుంచి ప్రయాణికులతో సిద్ధి జిల్లాకు వెళ్తున్న బస్సు రివాకు 25 కిలోమీటర్లదూరంలో గుఢ్ రోడ్డు సమీపంలో ప్రమాదానికి గురైంది. 'గురువారం ఉదయం 6.30 గంటలకు అతివేగంతో వచ్చిన బస్సు స్టేషనరీ లోడ్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది చనిపోయారు. మరో పది మంది గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నది. బస్సు డ్రైవర్ ఘటనాస్థలి నుంచి పరారయ్యాడు. ఉదయం వేళ పొగ మంచు కారణంగా పార్క్‌చేసిన లారీ సరిగ్గా కనిపించక ప్రమాదం జరిగినట్టు తెలుస్తున్నది' అని రివా రేంజ్ ఐజీ చంచల్ శేఖర్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

# 14 నుంచి డిపార్ట్‌మెంటల్ టెస్టులు

- రేపట్నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 14 నుంచి 23 వరకు నిర్వహించే డిపార్ట్‌మెంటల్ టెస్టులకు హాజయ్యే అభ్యర్థులు శనివారం నుంచి అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టీఎస్‌పీఎస్సీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష ఉంటుందని, పాత ఉమ్మడి జిల్లాకేంద్రాలతోపాటు హైదరాబాద్, ఢిల్లీలో పరీక్షకేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపింది. భవిష్యత్ అవసరాల కోసం హాల్‌టికెట్లను భద్రపరుచుకోవాలని, డూప్లికేట్ హాల్‌టికెట్లను ఇవ్వడం కుదరదని స్పష్టంచేసింది. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో ఇబ్బందులు ఎదురైతే 040–22445566 హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించింది.

**ఈ నెల 8న కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్**

ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ, బేవరేజెస్ కార్పొరేషన్లలో వివిధ పోస్టులకు మూడో స్పెల్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసుకున్న అభ్యర్థులు శుక్రవారం నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టీఎస్‌పీఎస్సీ సూచించింది. ఈ నెల ఎనిమిదిన కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నది.

**శానిటరీ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్ అభ్యర్థుల వెబ్‌ఆప్షన్లకు 9 వరకు గడువు**

పురపాలకశాఖలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్, జీహెచ్‌ఎంసీలోని బిల్ కలెక్టర్ పోస్టుల భర్తీకి సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకునేందుకు శుక్రవారం నుంచి ఈ నెల తొమ్మిది వరకు మరొక అవకాశం కల్పించినట్టు టీఎస్‌పీఎస్సీ గురువారం తెలిపింది. తుది ఎంపికకు ఈ ఆప్షన్లనే ప్రామాణికంగా తీసుకుంటామని పేర్కొన్నది. ప్రక్రియ పూర్తిచేసే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

సుడాన్ ప్రమాద బాధితుల్లో

## తమిళులు, బీహారీలే ఎక్కువ

**ఖార్టూమ్:** సుడాన్ రాజధాని ఖార్టూమ్‌లోని టైల్స్ ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు దుర్ఘటనలో మరణించిన, గాయపడిన భారత బాధితుల్లో అత్యధికులు తమిళనాడు, బీహార్ వాసులేనని భారత రాయబార కార్యాలయం తెలిపింది. మొత్తం బాధితుల్లో ఆరుగురు తమిళులు, ఐదుగురు బీహారీలు, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి నలుగురు చొప్పున, హర్యానా వాసులు ఇద్దరు, ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాల వాసులు ఒక్కొక్కరున్నారు. 16 మంది ఆచూకీ తెలియకుండా పోయింది. ఇతరులు గాయాలతో దవాఖానలో చికిత్స తీసుకుంటున్నారు. అదృశ్యమైన వారిలో కొందరు మరణించి ఉండొచ్చునని భారత ఎంబసీ ఆందోళన వ్యక్తం చేసింది.

# మారువేషంలో ట్రాఫిక్ పోలీసులు!

- ఆటో డ్రైవర్ల అక్రమాలపై ఆకస్మిక తనిఖీలు
- రూ. 8 లక్షలకుపైగా జరిమానాల వసూళ్లు
- బెంగళూరులో ఘటన

**బెంగళూరు, డిసెంబర్ 5:** కర్ణాటక రాజధాని బెంగళూరులోని ట్రాఫిక్ పోలీసులు మంగళవారం సాధారణ ప్రయాణికులుగా మారిపోయారు. మూడు జోన్ల పరిధిలోని పలు మార్గాల్లో మారువేషాల్లో ఆటోల్లో ప్రయాణించారు. ఆటో డ్రైవర్ల అక్రమాలపై కొరడా ఝుళిపించారు. రూ.8 లక్షలకుపైగా జరిమానాలు వసూలు చేయడంతోపాటు సరైన పత్రాలు లేని వందలాది ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఆటో డ్రైవర్లపై ప్రజలు నుంచి నిత్యం పలు ఫిర్యాదులు పోలీసులకు అందుతున్నాయి. మీటరు ప్రకారం కాకుండా అదనంగా డబ్బులు తీసుకోవడం, 5 కిలోమీటర్ల లోపు ప్రయాణాలను నిరాకరించడం, తగిన ధ్రువ పత్రాలు లేకుండా ఆటోలు నడపడం వంటివి వీటిలో ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు అసాధారణ రీతిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సాధారణ ప్రజల మాదిరిగా ఆటోల్లో ప్రయాణించారు. తూర్పు, పడమర, ఉత్తర జోన్ల పరిధిలోని ఆటో డ్రైవర్ల నుంచి తలెత్తున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. 5,200 మంది ఆటో డ్రైవర్లకు రూ.8,06,200 జరిమానా విధించారు. యూనిఫాం ధరించకపోవడం వంటి చిన్న తప్పులు చేసిన మరో రెండు వేల మందికి కూడా జరిమానాలు విధించారు. సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న సుమారు 500 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఇతర జోన్లలో కూడా ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామని జాయింట్ కమిషన్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) బీఆర్ రవికాంత్ గౌడ్ తెలిపారు. మరోవైపు ఆదర్శ్ ఆటో డ్రైవర్ సంఘం అధ్యక్షుడు నారాయణ్ స్వామి ట్రాఫిక్ పోలీసుల చర్యను సమర్థించారు. కొందరు ఆటో డ్రైవర్ల కారణంగా అందరికీ చెడ్డ పేరు వస్తున్నదన్నారు. దీని వల్ల ప్రజలు క్యాబ్‌లను ఆశ్రయిస్తుండటంతో ఆటో డ్రైవర్లకు గిరాకీ తగ్గిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.


ఏపీలోని కృష్ణా జిల్లా నందిగామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం. (ఇన్‌సెట్‌లో) మృతులు దుర్గా, మనోజ్, అరవింద్, అనీల్

# కృష్ణా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు యువకుల దుర్మరణం
- ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న కారు

**అమరావతి:** ఆగి ఉన్న డీసీఎంను కారు వేగంగా ఢీకొట్టడంతో నలుగురు యువకులు మృతిచెందారు. ఈ ప్రమాదం ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నందిగామ సమీపంలోని అంబారుపేట వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. నందిగామ విజయ టాకీస్ ప్రాంతానికి చెందిన అనీల్, సాయి, మనోజ్, దుర్గా, అరవింద్ కారులో విజయవాడకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు అంబారుపేటకు చేరుకోగానే అతివేగంతో ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు యువకులు ఘటనా స్థలంలోనే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన ఇద్దరిని దవాఖానకు తరలిస్తుండగా ఒకరు మార్గంమధ్యలోనే మరణించారు. మృతులను దుర్గా, మనోజ్, అరవింద్, అనీల్‌గా గుర్తించారు. అతివేగంగా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ కారు నడుపడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.



క్రిస్మస్‌గిఫ్ట్‌ప్యాకెట్ల వాహనాలను గురువారం హజ్‌హౌస్ నుంచి ప్రారంభిస్తున్న మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్‌హుస్సేన్, ఎండీ కాంతివెస్లీ, ఎమ్మెల్యే జీ విఠల్‌రెడ్డి తదితరులు

# సీఎం కేసీఆర్ పాలనలో మతసామరస్యం

- మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్
- క్రిస్మస్ గిఫ్ట్‌ప్యాకెట్ల వాహనాల తరలింపు ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలో మతసామరస్యం వెల్లివిరుస్తున్నదని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్ పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా క్రిస్టియన్లకు పంపిణీచేసే గిఫ్ట్‌ప్యాకెట్ల వాహనాలను గురువారం హజ్‌హౌస్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2.35 లక్షల గిఫ్ట్ ప్యాకెట్లను పేద క్రిస్టియన్లకు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్నిమతాల సమానత్వం, సామాజికన్యాయం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. అన్నిమతాల పండుగలను అధికారికంగా నిర్వహిస్తుండటంతో పాటు గిఫ్ట్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఈ విధంగా పంపిణీచేయడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జీ విఠల్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ కాంతివెస్లీ, సభ్యులు ఎంఏ వహీద్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అంతర్జాతీయస్థాయి సదుపాయాలు

## షూర్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభోత్సవంలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పారిశ్రామిక స్నేహపూర్వక వ్యాపారాభివృద్ధికి వీలు కల్పించే అంతర్జాతీయస్థాయి పారిశ్రామిక సదుపాయాలకు తెలంగాణ పేరొందిందని ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ అన్నారు. గురువారం మాదాపూర్‌లోని స్కైవ్యూలో అమెరికాకు చెందిన షూర్ సాఫ్ట్‌వేర్ కార్యాలయాన్ని ఆపరేషన్ వైస్‌ప్రెసిడెంట్ జమీ గ్రిఫిన్, ఐటీ వైస్‌ప్రెసిడెంట్ రాబిన్ హమెర్లింక్, హెచ్చార్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ పాల్ ఆప్లెబమ్, టీసీఎస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ వి రాజన్న, షూర్ ప్రెసిడెంట్, సీఈవో క్రిస్టీన్ షావింక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షూర్ కంపెనీకి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని.. రాష్ట్రంలో సాంకేతిక అభివృద్ధిని మరింత మెరుగుపరిచేందుకు కంపెనీ సహకరిస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. షూర్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ అవినాశ్ వైద్య మాట్లాడుతూ కొన్నేళ్లుగా షూర్ ఉత్పాదనలకు వాల్యూ ప్రపోజిషన్ కావడంతో సాఫ్ట్‌వేర్ ప్రాధాన్యం పెరుగుతూ వస్తున్నదని అన్నారు. హైదరాబాద్ ఇంజినీరింగ్ సెంటర్ ప్రపంచవ్యాప్తంగా షూర్ ఉత్పాదనలకు సంబంధించి సాఫ్ట్‌వేర్ డిజైన్, డెవలప్‌మెంట్, క్వాలిటీ టెస్టింగ్‌లపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్టు తెలిపారు.



మాదాపూర్‌లోని స్కైవ్యూలో షూర్ సాఫ్ట్‌వేర్ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, షూర్ ప్రెసిడెంట్, సీఈవో క్రిస్టీన్ షావింక్ తదితరులు

# వృత్తినైపుణ్య పోటీలకు దరఖాస్తులు

- డిసెంబర్ 31 చివరితేదీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వివిధ రంగాల్లోని వృత్తినిపుణులు తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఉపాధి కల్పన, శిక్షణశాఖ పోటీలను నిర్వహిస్తున్నది. ఈ మేరకు ఔత్సాహికులైన వృత్తినిపుణులు ఈ నెల 31 లోగా http://worldskillsindia.co.in/worldskill/index.php పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని అధికారులు కోరారు. జిల్లా, మండల, రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు 1996 తర్వాత జన్మించిన వారు, ఇతర పోటీలకు 1999 జనవరి తర్వాత జన్మించినవారు అర్హులని పేర్కొన్నారు. మెకట్రానిక్స్, తయారీరంగం, ఏరోనాటికల్ ఇంజినీరింగ్, క్లౌడ్ కంప్యూటరింగ్, సైబర్‌సెక్యూరిటీ అండ్ వాటర్ టెక్నాలజీ, ఐటీ నెట్‌వర్క్ కేబులింగ్ తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు.

## ఎంపీ సుజన సతీమణికి డీఆర్టీ నోటీసులు

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ సుజనా చౌదరి సతీమణి పద్మజ సహా తొమ్మిది మందికి డీఆర్టీ నోటీసులు అందజేసింది. సుజనాచౌదరి నుంచి రూ.169 కోట్లు రావాలని ఐడీబీఐ బ్యాంకు అధికారులు చెప్తున్నారు. చెన్నైలోని డెట్ రికవరీ ట్రిబ్యునల్–2ను ఐడీబీఐ బ్యాంకు ఆశ్రయించింది. ఈ నెల 16న పద్మజ విచారణకు హాజరుకావాలని డీఆర్టీ ఆదేశాలు జారీచేసింది.

# ఏపీలో పెరిగిన మద్యం ధరలు

- నేటినుంచి కొత్త ధరలు అమలు

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో మద్యం ధరలు పెరుగనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. మద్యంపై అదనపు పన్ను విధించడంతో ధరల పెంపు అనివార్యమైనట్టు సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. కాగా, ఏయే మద్యం ధరలు ఎంత మేరకు పెరుగనున్నాయో ఉత్తర్వుల్లో వెల్లడించారు. ఈ పెరిగిన ధరలన్నీ శుక్రవారం నుంచి అములులోకి రానున్నాయి. వివరాలిలా ఉన్నాయి. భారత్‌లో తయారైన విదేశీ మద్యం ధరలు 60 ఎంఎల్, 90 ఎంఎల్‌పై రూ.30 చొప్పున పెరుగనున్నాయి. భారత్‌లో తయారైన విదేశీ మద్యం 180 ఎంఎల్‌పై రూ.60, 375 ఎంఎల్‌పై రూ.120, 750 ఎంఎల్‌పై రూ.240, వెయ్యి ఎంఎల్‌పై రూ.300, రెండు వేల ఎంఎల్‌పై రూ.750 చొప్పున పెరుగనున్నాయి. ఇక విదేశీ మద్యం 50–6– ఎంఎల్‌పై రూ.30, 200– 275 ఎంఎల్‌పై రూ.60, 330– 500 ఎంఎల్‌పై రూ.120, 700– 750 ఎంఎల్‌పై రూ.240, 1,500/2,000 ఎంఎల్‌పై రూ.750 చొప్పున పెరుగనున్నాయి. బీర్ 330 ఎంఎల్‌పై రూ.30, 500 ఎంఎల్‌పై రూ.30, 650 ఎంఎల్‌పై రూ.60, 30 వేల ఎంఎల్‌పై రూ.3 వేలు, 50 వేల ఎంఎల్‌పై రూ.6 వేల చొప్పున పెరుగనున్నాయి. ఇక 'రెడీ టు డ్రింక్' బ్రాండ్లు అన్నింటిపై రూ.60 చొప్పున పెరుగనున్నాయి.



# నరసరావుపేట ఎంపీ ఇంటిపై దాడి

- ధ్వంసమైన అద్దాలు
- ఇల్లు ఖాళీచేయాలని వాచ్‌మన్‌కు దుండగుల వార్నింగ్

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా నరసరావుపేట వైఎస్సార్సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఇంటిపై గురువారం గుర్తుతెలియని దండగులు దాడిచేశారు. ఈ దాడిలో నరసరావుపేటలోని ఆయన ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి. దుండగులు దాడిచేసిన అనంతరం ఇంటిని ఖాళీ చేయాల్సిందిగా వాచ్‌మన్‌ను బెదిరించి పరారయ్యారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని విచారణ ప్రారంభించారు.

IV.
నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
శుక్రవారం 6 డిసెంబర్ 2019

# చేయాల్సినవి చేసేద్దాం!



అంజనాదేవి, సాయిధరమ్‌తేజ్

సాయిధరమ్‌తేజ్, రాశీఖన్నా జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రతి రోజూ పండగే'. మారుతి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకులముందుకురానుంది. సత్యరాజ్, రావు రమేష్, మురళీశర్మ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల చిరంజీవి తల్లిగారైన అంజనాదేవి విడుదల చేశారు. 'లంగ్ క్యాన్సర్..అడ్వాన్స్‌డ్ స్టేజ్..మ్యాక్సిమమ్ ఫైవ్ వీక్స్ లైఫ్ స్పాన్..ఎలా షెడ్యూల్ చేయాలో అర్థంకావట్లేదు అన్నయ్య..' అంటూ ఉద్విగ్నభరిత సంభాషణతో మొదలైన ట్రైలర్ 'ఇప్పటివరకు నువ్వు చేద్దామనుకొని చేయలేనివి..చేద్దామనుకొని ఆగిపోయినవి..అన్నీ చేసేద్దాం..' అంటూ సత్యరాజ్‌తో హీరో సాయిధరమ్‌తేజ్ చెప్పే డైలాగ్‌తో ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ 'దర్శకుడు మారుతి చక్కటి వినోదంతో సినిమాను తీర్చిదిద్దాడు. హృద్యమైన భావోద్వేగాలతో ప్రేక్షకుల మనసుల్ని తాకే చిత్రమిది' అన్నారు. ''చిత్రలహరి' సినిమాతో నా సెకండ్ ఇన్నింగ్స్ మొదలైంది. అప్పటి నుంచి మంచి సినిమాలే చేస్తానని మాటిచ్చాను. కుటుంబ అనుబంధాల నేపథ్యంలో ఈ సినిమా అద్భుతంగా కుదిరింది' అని సాయిధరమ్‌తేజ్ తెలిపారు. ఈ సినిమాలోని ఎమోషన్‌తో ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతారని కథానాయిక రాశీ ఖన్నా చెప్పింది. ఈ కార్యక్రమంలో రావు రమేష్, సంగీత దర్శకుడు తమన్ పాల్గొన్నారు.

## హ్యాట్రిక్ హిట్‌తో ముగిస్తాం!

'ఈ ఏడాది మా సంస్థ నుంచి నాలుగు సినిమాలు వస్తాయనుకున్నాం. మూడు చిత్రాలతోనే ముగిస్తున్నాం. 'ఇద్దరిలోకం ఒకటే' క్రిస్మస్ కానుకగా ప్రేక్షకులముందుకొస్తుంది' అన్నారు ప్రముఖ నిర్మాత దిల్‌రాజు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై రాజ్‌తరుణ్ కథానాయకుడిగా ఆయన నిర్మించిన 'ఇద్దరిలోకం ఒకటే' ఈ నెల 25న విడుదలకానుంది. జీఆర్ కృష్ణ దర్శకుడు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. 'యు.ఎ' సర్టిఫికెట్ లభించింది. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో దిల్‌రాజు మాట్లాడుతూ 'దర్శకుడు ఓ టర్కీ సినిమా చూసి ఈ కాన్సెప్ట్ చెప్పాడు. మన నేటివిటీకి అనుగుణంగా కథను తీర్చిదిద్దాం. ఫీల్‌గుడ్ ప్రేమ కథగా ఆకట్టుకుంటుంది. మా సంస్థలో 33వ చిత్రమిది. మంచి కథ కుదిరితే రిలీజ్‌కు ముందే లాభాలు వస్తాయని నిరూపించింది.



జీఆర్ కృష్ణ, దిల్‌రాజు, రాజ్‌తరుణ్, వేణుగోపాల్

2020 ఏడాదికి శుభస్వాగతం పలికే చిత్రమవుతుందన్న నమ్మకం ఉంది. అంతా అనుకున్నట్లు జరిగితే హ్యాట్రిక్ హిట్‌తో ఈ ఏడాదిని ముగిస్తాం' అన్నారు. 'పుట్టిన దగ్గరి నుంచి ప్రేమికులయ్యేంత వరకు నాయకానాయికల ప్రయాణమే ఈ చిత్ర కథ. హృదయానికి హత్తుకునే భావోద్వేగాలుంటాయి. ప్రతి సన్నివేశంతో ప్రేక్షకులు సహానుభూతిచెందుతారు' అని దర్శకుడు తెలిపారు.

# అలాంటి లెక్కలు వేసుకోను!



రాశీఖన్నా

'నాయికగా ఒకే పంథాకు పరిమితమై పోవడం ఇష్టం లేదు. గ్లామర్‌తో పాటు అభినయప్రధాన పాత్రలకు ప్రాధాన్యతనిస్తూ కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నా. తెలుగులో సినీ ప్రయాణం ఆనందంగా సాగిపోతున్నది' అని చెప్పింది రాశీఖన్నా. ఆమె కథానాయికగా నటిస్తున్న చిత్రం 'వెంకీమామ'. కె.ఎస్.రవీంద్ర దర్శకుడు. ఈ నెల 13న విడుదలకానుంది. ఈ సందర్భంగా రాశీఖన్నా పాత్రికేయులతో ముచ్చటించింది.

**ఈ మధ్య బాగా సన్నబడినట్లున్నారు...?**

కథానాయికలు తప్పకుండా ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యతనివ్వాలి. శారీరకదారుఢ్యం కోసం చాలా కసరత్తులు చేశా. బొద్దుగా ఉంటే అవకాశాలు రావని కాదు. అయితే పాత్రల్లో కొత్తదనం చూపించాలంటే చక్కటి శరీరాకృతిని కలిగి ఉండాలి.

**'వెంకీమామ'లో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

హారిక అనే ఫిల్మ్‌మేకర్ పాత్రలో కనిపిస్తాను. అందం, అభినయం కలబోతగా నా పాత్ర మెప్పిస్తుంది. సినిమా ప్రథమార్థమంతా వినోదప్రధానంగా అలరిస్తుంది. ద్వితీయార్థం భావోద్వేగభరితంగా సాగుతుంది.

**ఇద్దరు నాయికలున్న సినిమా ఎక్కువగా చేస్తున్నారు?**

సినిమాలో ఎందరు కథానాయికలున్నారనే లెక్కలు వేసుకోను. నాకు కథ ముఖ్యం. ఇద్దరు నాయికలున్నా సరే ఎవరి కి ఉండే ప్రాధాన్యత వారికి ఉంటుంది. 'వెంకీమామ' చిత్రంలో కథానాయికల పాత్రలు పాటల్లో వచ్చి పోయేవిగా ఉండవు. అభినయప్రధానంగా కథాగమనంలో కీలకంగా సాగుతాయి.

> **దిశ ఘటన నన్ను ఎంతగానో కలచివేసింది. ఓ వైపు కోపం, మరోవైపు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో మనమంతా ఉన్నామనిపించింది. నిందితుల తలల్ని నరివేయాలనేంత ఆగ్రహం పుట్టుకొచ్చింది. ఆ రాక్షసుల మీద ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కఠినమైన చర్యలు తీసుకోవాలన్నదే నా కోరిక.**

**వెంకటేష్ వంటి సీనియర్ హీరోతో పనిచేయడం ఎలా అనిపించింది?**

కాలేజీ రోజుల నుంచే నేను వెంకటేష్‌గారికి నేను పెద్ద అభిమానిని. ఆయన కామెడీ టైమింగ్ అద్భుతంగా ఉంటుంది. వెంకటేష్‌గారిలో ఉన్నతమైన ఆధ్యాత్మిక భావాలుంటాయి. నిజజీవితంలో వెంకటేష్, చైతూ మధ్య గాఢమైన అనుబంధం కనిపిస్తుంది. తెరపై కూడా అదే రకమైన ఉద్వేగాల్ని కనబరిచారు.

**ఒక తెలుగు సినిమాలో పాట పాడుతున్నారని తెలిసింది?**

అవును. ఆ సినిమా పేరు చెప్పడం మాత్రం ఇష్టం లేదు. ఏడేళ్ల వయసు నుంచే నాకు సంగీతంలో ప్రావీణ్యం ఉంది. స్కూల్, కాలేజీ రోజుల్లో పాటల్లో పోటీల్లో పాల్గొన్ని బహుమతులు గెల్చుకున్నాను. ఓ తెలుగు సినిమాకు సొంతంగా డబ్బింగ్ చెబుతున్నా.

**మీ సినీ కెరీర్‌ను విశ్లేషించుకుంటే ఏమనిపిస్తున్నది?**

గత నాలుగేళ్లుగా హైదరాబాద్‌లోనే ఉంటున్నాను. కెరీర్ సంతృప్తికరంగా సాగిపోతున్నది. సినిమాల మధ్య విరామం వస్తే కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రలు చేస్తాను. ఫిట్‌నెస్‌పై ఎక్కువ దృష్టిపెడతాను. ప్రస్తుతం తెలుగులో కథానాయికల పాత్రల్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. పర్‌ఫార్మెన్స్‌కు ఎంతో స్కోప్ ఉండేలా హీరోయిన్స్ క్యారెక్టర్ డిజైన్ చేస్తున్నారు.



సుకుమార్, హరిప్రసాద్, దినేష్‌తేజ్

## ప్లేబ్యాక్ మిస్టరీ

'వన్ నేనొక్కడినే' మాదిరిగానే ఈ సినిమా కథ గొప్పగా ఉంటుంది. ఈ కథతో నేను సినిమా చేయాలనుకున్నాను. దర్శకుడు హరిప్రసాద్ మూడేళ్ల పాటు కష్టపడి రాశాడు. సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో తెరకెక్కిన ఈ సినిమా పెద్ద విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ముంది' అని అన్నారు ప్రముఖ దర్శకుడు సుకుమార్. దినేష్‌తేజ్, అనన్య, అర్జున్‌కల్యాణ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ప్లేబ్యాక్'. హరిప్రసాద్ జక్కా దర్శకుడు. ప్రసాద్‌రావు పెద్దినేని నిర్మించారు. ఈ చిత్ర టీజర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో సుకుమార్ విడుదలచేశారు. దర్శకుడు హరిప్రసాద్ మాట్లాడుతూ '1993, 2019 కాలాల్లో మర్డర్ మిస్టరీ కథాంశంతో తెరకెక్కించాం. 35 రోజుల్లో ఈ సినిమాను పూర్తిచేశాం' అని పేర్కొన్నారు. తన కెరీర్‌ను మలుపుతిప్పే చిత్రమిదని హీరో దినేష్‌తేజ్ అన్నారు.











